www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 21-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 52 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: త్రయోదశి సా. 5.40 తదుపరి చతుర్దశి; నక్షత్రం: స్వాతి పూర్తి; వర్జ్యం: ఉ.11.50-1.34; దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, రా.10.16-10.59; అమృతఘడియలు: రా.10.14-11.58; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 5.45; సూర్యాస్తమయం: 6.38 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రూ. లక్ష దాటిన వెండి

హైదరాబాద్‌లో ఒక్కరోజే 4,500 పెరుగుదల.. సరికొత్త రికార్డు గరిష్ఠానికి కిలో ధర

10 గ్రాముల బంగారం రూ.75,000 ఎగువకు



హైదరాబాద్: దేశీయంగా విలువైన లోహాల ధరలు మరింత ఎగబాకాయి. వెండి సరికొత్త జీవితకాల గరిష్ఠానికి చేరుకుంది. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం రేటు సోమవారం మరో రూ.540 పెరిగి రూ.75,160కి చేరుకుంది. 22 క్యారెట్ల స్వచ్ఛత లోహం రూ.500 పెరుగుదలతో రూ.68,900కు అమ్ముడైంది. కాగా, కిలో వెండి ఏకంగా రూ.4,500 ఎగబాకి రూ.1,01,000 ధర పలికింది. అంతర్జాతీయంగానూ వీటి ధరలు సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరాయి. ఇంటర్నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ సెంటర్ (కామెక్స్)లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒక దశలో 2,454 డాలర్లు, సిల్వర్ 32.75 డాలర్లకు ఎగబాకాయి. ముస్ముందు వీటి ధరలు మరింత పెరిగేందుకే అధిక అవకాశాలున్నాయని బులియన్ విశ్లేషకులు అంటున్నారు. త్వరలోనే ఔన్స్ బంగారం 2,500-2,550 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చన్న అంచనాలున్నాయి.

కారణమేంటి..?

అమెరికాలో రిటైల్ ధరల ద్రవ్యోల్బణం అంచనాల కంటే తగ్గిన నేపథ్యంలో ఫెడ్ రేట్ల తగ్గింపు ప్రక్రియ త్వరలోనే (జూన్ లేదా సెప్టెంబరులో) ప్రారంభం కావచ్చని, ఈ ఏడాదిలో ఫెడరల్ రిజర్వ్ కనీసం రెండు సార్లు వడ్డీ రేట్లను తగ్గించవచ్చని మార్కెట్లో ఊహాగానాలు ఊపందుకోవడం బులియన్ ధరల ర్యాలీకి ప్రధాన కారణమైంది. మళ్లీ పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు సైతం ధరలకు ఆజ్యం పోస్తున్నాయి.

ఫెడ్ రేటు డౌన్.. గోల్డ్, సిల్వర్ అప్!

అమెరికాతో పాటు మిగతా దేశాల సెంట్రల్ బ్యాంక్‌లూ త్వరలో వడ్డీ రేట్లను తగ్గించే ఆలోచనలో ఉన్నాయి. వచ్చే నెలలోనే వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలున్నాయని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లాండ్ గవర్నర్ ఆండ్రూ బెయిలీ సంకేతాలిచ్చారు. స్వీడన్ సెంట్రల్ బ్యాంక్ కూడా వడ్డీ రేట్ల తగ్గింపును ప్రారంభించింది. సాధారణంగా ఫెడ్ రేట్లు-గోల్డ్ డిమాండ్‌ది విలోమ సంబంధం. ఫెడ్ రేట్లు పెరుగుతున్న సమయంలో స్థిర ఆదాయాన్ని పంచే బాండ్లు, మార్కెట్ ఫండ్స్‌కు డిమాండ్ పెరుగుతుంది. దాంతో విలువైన లోహాల నుంచి పెట్టుబడులు వీటిలోకి మళ్లుతుంటాయి. కాగా, వడ్డీ రేట్లు తగ్గే సందర్భంలో బాండ్ల నుంచి పెట్టుబడులు విలువైన లోహాల్లోకి ప్రవహిస్తుంటాయి.

ఆఫ్‌లైన్ ఎడ్యుకేషన్‌లోకి నెక్స్ట్‌వేవ్

- బిట్స్ పిలానీతో జట్టు
- నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు ఆఫర్

హైదరాబాద్: ఎడ్‌టెక్, స్కిల్లింగ్ ప్లాట్‌ఫామ్ నెక్స్ట్‌వేవ్.. ఆఫ్‌లైన్ ఎడ్యుకేషన్ విభాగంలోకి అడుగుపెట్టింది. ఇందుకోసం బిట్స్ పిలానీతో జట్టు కట్టింది. ఇందులో భాగంగా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సును ఆఫర్ చేయనుంది. ముందుగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన క్యాంపస్‌లో 750 మంది విద్యార్థులతో ఈ కోర్సును ప్రారంభించనున్నట్లు నెక్స్ట్‌వేవ్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాహుల్ అట్లూరి తెలిపారు. మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్, డేటా ఎనలిటిక్స్ రంగాలపై ఈ కోర్సు ప్రధానంగా దృష్టి కేంద్రీకరిస్తుందని చెప్పారు. పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా ఈ కోర్సు కరిక్యులమ్‌ను రూపొందించినట్లు రాహుల్ తెలిపారు. జూలై 15న ప్రారంభం కానున్న ఈ నాలుగేళ్ల కోర్సు ఫీజు రూ.14 లక్షలని పేర్కొన్నారు. కోర్సు పూర్తయిన అనంతరం బిట్స్ పిలానీ గ్రాడ్యుయేషన్ పట్టాను ఇస్తుందని తెలిపారు. కాగా వచ్చే ఏడాది కాలంలో బెంగళూరు, చెన్నై, పుణె, కోచి నగరాలకు ఈ కోర్సును అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన చెప్పారు. ఇందుకోసం మొత్తం పది క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఒక్కో క్యాంపస్ ఏర్పాటు కోసం రూ.15 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు రాహుల్ చెప్పారు. కాగా ఇప్పటికే ఐటీ రంగంలో పని చేస్తున్న వారు తమ నైపుణ్యాలను మరింతగా పెంచుకునేందుకు గాను ప్రత్యేకంగా బూట్ క్యాంప్ కోర్సును నిర్వహిస్తున్నట్లు రాహుల్ తెలిపారు.

తగ్గిన ఇండియా సిమెంట్స్ నష్టాలు

చెన్నై: గడచిన ఆర్థిక సంవత్సరం (2023-24) నాలుగో త్రైమాసికం (క్యూ4)లో ఇండియా సిమెంట్స్ కన్సాలిడేటెడ్ నష్టం తగ్గింది. గత ఏడాది క్యూ4తో పోల్చితే నికర నష్టం రూ.243.77 కోట్ల నుంచి రూ.50.06 కోట్లకు తగ్గింది. కన్సాలిడేటెడ్ ఆదాయం కూడా రూ.1,485.73 కోట్ల నుంచి రూ.1,266.65 కోట్లకు తగ్గింది. అమ్మకాలు పెరగడం ప్రధానంగా నష్టాలు తగ్గేందుకు దోహదపడిందని తెలిపింది. కంపెనీకి చెందిన భూమి విక్రయంలో వచ్చిన రూ.24 కోట్ల లాభం వల్ల సిమెంట్ అమ్మకం ధరల క్షీణత కారణంగా ఏర్పడిన నష్టం పూడిందని తెలియచేసింది. మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి కంపెనీ రూ.5,112.24 కోట్ల ఆదాయంపై రూ.215.76 కోట్ల నికర నష్టం నమోదు చేసింది.

ఆయిల్ ఇండియా బోనస్ షేరు

ప్రతి రెండు షేర్లకు ఒక బోనస్ షేరు జారీ

క్యూ4 లాభం రూ.2,333 కోట్లు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఆయిల్ ఇండి యా లిమిటెడ్ (ఓఐఎల్) వాటాదారులకు బోనస్ షేర్లు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. వారి వద్ద ఉన్న ప్రతి రెండు షేర్లకు ఒక బోనస్ షేరు జారీ చేయనున్నట్లు తెలిపింది. అలాగే రూ.10 ముఖ విలువ గల (బోనస్‌కు ముందు) ఒక్కో షేరుపై రూ.3.75 తుది డివిడెండ్ కూడా ప్రకటించింది. బోనస్ అనంతరం తుది డివిడెండ్ రూ.2.50 అవుతుంది. ఇప్పటికే కంపెనీ రెండు విడతలుగా చెల్లించిన మధ్యంతర డివిడెండు రూ.12 (బోనస్‌కు ముందు) ఇది అదనం. కాగా మార్చి త్రైమాసికంలో కంపెనీ 18 శాతం వృద్ధితో రూ.2,332.94 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో ఆర్జించిన లాభం రూ. 1,979.74 కోట్లు. క్రూడాయిల్ ధరల పెరుగుదల లాభాల వృద్ధికి దోహదపడినట్టు కంపెనీ ప్రకటించింది. ఇదే కాలంలో టర్నోవర్ కూడా 16% వృద్ధితో రూ.10,375.09 కోట్లకు చేరింది. క్రూడాయిల్ ఉత్పత్తి, విక్రయం ద్వారా సమకూరిన ఆదాయం 18 శాతం వృద్ధి చెందగా గ్యాస్ ఉత్పత్తి విక్రయం ద్వారా మాత్రం ఆదాయం 16.5 శాతం క్షీణించింది. మార్చి 31వ తేదీతో ముగిసిన పూర్తి ఆర్థిక సంవత్సరంలో లాభం 29 శాతం క్షీణించి రూ.6,980.45 కోట్లకు దిగివచ్చింది.

ఆరు నెలల వరకు రియల్టీకి ఢోకా లేదు

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో దేశంలో రియల్టీ సెంటిమెంట్ మరింత పెరిగింది. 2023 అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో 69గా ఉన్న ఈ సూచీ ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో 72కు చేరింది. ఇదే సమయంలో ఫ్యూచర్ సెంటిమెంట్ స్కోరు కూడా 70 నుంచి 73కు చేరింది. మరో ఆరు నెలల వరకు ఇదే ట్రెండ్ కొనసాగుతుందని నైట్‌ఫ్రాంక్, నరెడ్కో తెలిపాయి.

భారత జీడీపీ వృద్ధి రేటు 7%: ఇండ్‌రా

న్యూఢిల్లీ: ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో భారత జీడీపీ వృద్ధి రేటు 6.2 శాతం వరకు ఉండే అవకాశం ఉందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్‌రా) సంస్థ అంచనా. 2023-24 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఈ వృద్ధి రేటు 6.9 శాతం నుంచి 7 శాతం వరకు ఉంటుందని ఆ సంస్థ ప్రధాన ఆర్థికవేత్త సునీల్ కుమార్ సిన్హా తెలిపారు.

పెట్ ఫుడ్స్ విభాగంలోకి గ్రోవెల్

- పుల్లర్, డాట్‌గుడ్ బ్రాండ్‌తో ఉత్పత్తుల విడుదల



హైదరాబాద్: ఆక్వాకల్చర్ ఫీడ్స్ కంపెనీ గ్రోవెల్ గ్రూప్.. పెంపుడు జంతువుల పోషకాహార (పెట్ ఫుడ్స్) విభాగంలోకి ప్రవేశించింది. పుల్లర్, డాట్‌గుడ్ బ్రాండ్ పేరుతో పెట్ బిస్కెట్స్ (ట్రీట్)ను కంపెనీ విడుదల చేసింది. వ్యాపార కార్యకలాపాల విస్తరణలో భాగంగా పెంపుడు జంతువుల పోషకాల విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రమోటర్ గ్రూప్, గ్రోవెల్ ఎంఎస్ఆర్ కార్తీక్ తెలిపారు. దేశీయ పెట్ పరిశ్రమ ఏటా 10 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని, 2027 నాటికి ఇది 100 కోట్ల డాలర్లకు చేరుకునే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం పెట్ ట్రీట్స్ మార్కెట్ రూ.650 కోట్లుగా ఉందని, 2027 నాటికి రూ.1,900-2,000 కోట్లకు చేరుకోవచ్చని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. గ్రోవెల్ గ్రూప్.. ఆక్వా ఫీడ్స్, ఫార్ములేషన్, సీఫుడ్ ప్రాసెసింగ్ వ్యాపారాలను నిర్వహిస్తోందన్నారు. ప్రస్తుతం కంపెనీ వార్షిక టర్నోవర్ రూ.2,000 కోట్లుగా ఉందని కార్తీక్ తెలిపారు. కంపెనీ హైదరాబాద్‌లో రెండు ఫార్ములేషన్ యూనిట్లు, ఆంధ్రప్రదేశ్‌లోని సింగరాయపాలెంలో రెండు ఫీడ్స్, సీఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నిర్వహిస్తోందన్నారు. కాగా ఈ పెట్ ఫుడ్ కోసం సింగరాయపాలెంలోని ప్రత్యేకంగా రెండు ప్రొడక్షన్ లైన్స్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వచ్చే ఐదేళ్ల కాలంలో ఈ విభాగంలో రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు కార్తీక్ తెలిపారు. దేశవ్యాప్తంగా 300కు పైగా నగరాల్లోని రెండువేలకు పైగా ఔట్‌లెట్స్‌లో పుల్లర్, డాట్‌గుడ్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని గ్రోవెల్ గ్రూప్ పెట్ ఫుడ్ బిజినెస్ హెడ్ జేఎస్ రామకృష్ణ తెలిపారు.

ఆచితూచి అడుగేయండి!

స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికలు చివరి దశకు చేరుకోవటం, అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితులు ఇందుకు కారణం. పెరిగిన పుట్, కాల్ నిష్పత్తిని బట్టి చూస్తే మదుపరులు అప్రమత్తంగా ఉండటం ఎంతో అవసరం. ఈ వారం నిఫ్టీకి 22,400 వద్ద మద్దతు, 22,550 వద్ద నిరోధ స్థాయిలున్నాయి. సూచీలు హఠాత్తుగా పెరుగుతూ, తగ్గుతూ వస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు జాగ్రత్తగా ఉండటం మంచిది.

స్టాక్ రికమండేషన్స్

టీవీఎస్ మోటార్స్: నిఫ్టీతో పోలిస్తే ఈ కౌంటర్ మెరుగైన ప్రదర్శన కనబరుస్తోంది. మార్చి త్రైమాసిక ఫలితాలు మార్కెట్ అంచనాలను మించి ఉండటంతో మూమెంటమ్ పెరిగింది. గత శనివారం ఈ షేరు రూ.2,191 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లో రూ.2,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.2,320/2,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,180 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బీఈఎల్: ఈ కౌంటర్ సుదీర్ఘకాలంగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. బెంచ్‌మార్క్ సూచీలు ఆటుపోట్లకు లోనైనా ఇది మాత్రం నిలకడగా సాగుతోంది. చివరి ఐదు సెషన్లలో షేరు ధర 15 శాతం పెరిగింది. గత శనివారం ఈ షేరు 4.43 శాతం లాభంతో రూ.259.20 వద్ద ముగిసింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.255 శ్రేణిలో ప్రవేశించి రూ.325 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.240 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఆర్‌ఎఫ్‌సీ: మంచి అప్‌ట్రెండ్ అనంతరం ఈ కౌంటర్‌లో స్వల్ప కరెక్షన్ జరిగింది. మళ్లీ ఇప్పుడు జీవితకాల గరిష్ఠాన్ని దాటే క్రమంలో సాగుతోంది. తక్కువ వాల్యూమ్ ట్రేడవటాన్ని బట్టి చూస్తే ఈ షేర్లను వదులుకోవటానికి ఇన్వెస్టర్లు ఇష్టపడటం లేదు. గత శనివారం రూ.173 స్థాయిలో ముగిసిన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.170 స్థాయిలో ప్రవేశించి రూ.225/240 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.163 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

వేదాంత లిమిటెడ్: ఈ కౌంటర్‌లో చాలా కాలం పాటు కరెక్షన్ జరిగింది. మంచి బేస్ ఏర్పడిన అనంతరం ఏప్రిల్‌లో అప్‌ట్రెండ్ మొదలైంది. రూ.438 స్థాయిలో కీలక నిరోధాన్ని అధిగమించింది. మూమెంటమ్ ఇలాగే కొనసాగితే సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని తాకటం ఖాయంగా కనిపిస్తోంది. గత శనివారం ఈ షేరు రూ.458 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.455 స్థాయిలో ప్రవేశించి రూ.485/510 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.440 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జేఎస్‌డబ్ల్యూ స్టీల్: సుదీర్ఘకాలంగా ఈ కౌంటర్‌లో కన్సాలిడేషన్ జరుగుతోంది. ఈ షేర్లు సైడ్‌వేస్‌లో చలిస్తూ ప్రస్తుతం కీలక నిరోధ స్థాయికి చేరుకున్నాయి. పెరుగుతున్న మూమెంటమ్, వాల్యూమ్‌ను బట్టి చూస్తే దాన్ని అధిగమించే అవకాశం కనిపిస్తోంది. గత శనివారం రూ.890 వద్ద ముగిసిన ఈ షేరులో ఇన్వెస్టర్లు అదే స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.955/1,055 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.870 స్థాయిని స్టాప్ లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

పవర్‌మెక్ లాభంలో 13 % వృద్ధి

హైదరాబాద్: విద్యుత్, మౌలిక వసతుల రంగంలోని హైదరాబాద్‌కు చెందిన పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి త్రైమాసికంలో రూ.84.41 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.74.57 కోట్లతో పోల్చితే లాభం 13% పెరిగింది. కంపెనీ ఆదాయం రూ.1,183.20 కోట్ల నుంచి రూ.1,311.86 కోట్లకు పెరిగింది. కాగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఒక్కో షేరుకు రూ.2 తుది డివిడెండ్‌కు ఆమోదం తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,160 ▲	68,900 ▲	1,01,000 ▲
ముంబై	73,383 ▼	67,219 ▼	86,373 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

21వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	540
వరంగల్	552	గోదావరి	540
చిత్తూరు	628	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	150	విజయవాడ	154
వరంగల్	150	గుంటూరు	154
కరీంనగర్	150	ఒంగోలు	154
మహబూబ్‌నగర్	152	చిత్తూరు	160
కర్నూలు	152	నెల్లూరు	160
విశాఖపట్నం	146	అనంతపురం	154
గోదావరి	154		

స్పోర్ట్స్

దీప్తి ప్రపంచ రికార్డు



ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో స్వర్ణం కైవసం
పారిస్ పారాలింపిక్స్‌కు అర్హత

కోబ్ (జపాన్): తెలుగమ్మాయి జీవాంజి దీప్తి విశ్వ వేదికపై సంచలన ప్రదర్శనతో మెరిసింది. ప్రపంచ పారా అథ్లెటిక్స్‌లో రికార్డుతో స్వర్ణ పతకం కొల్లగొట్టింది. సోమవారం ఇక్కడ జరిగిన మహిళల 400 మీటర్ల టీ20 క్లాస్ విభాగం రేసును దీప్తి 55.07 సెకన్లలో పూర్తి చేసి చాంపియన్‌గా నిలిచింది. ఈ క్రమంలో గతేడాది అమెరికా అథ్లెట్ బ్రిన్నా క్లార్క్ నెలకొల్పిన ప్రపంచ రికార్డు (55.12 సె.)ను దీప్తి బద్దలుకొట్టింది. ఐసెల్ ఒండర్ (టర్కీ-55.19)కు రజతం, లిజాంషెలా అంగులో (ఈక్వెడార్- 56.68 సె)కు కాంస్య పతకాలు దక్కాయి. అంతకుముందు రోజు దీప్తి హీట్స్‌లో 56.18 సెకన్లతో ఆసియా రికార్డు టైమింగ్‌ను నమోదుచేసి ఫైనల్స్‌కు క్వాలిఫై అయింది. ఈ టోర్నీలో విజయంతో దీప్తి త్వరలో జరిగే పారిస్ పారాలింపిక్స్‌కు కూడా అర్హత సాధించింది. ఇక, ఇదే టోర్నీలో భారత్‌కే చెందిన యోగేష్ కథునియా ఎఫ్56 కేటగిరీ డిస్కస్ త్రోలో రజత పతకం సొంతం చేసుకున్నాడు. ఈ పోటీల్లో భారత్ ఇప్పటివరకు ఒక స్వర్ణం, రజతం, రెండు కాంస్యాలు సహా మొత్తం 4 పతకాలు సాధించింది.

నిరుపేద కుటుంబం.. అమ్మానాన్న కూలికెళ్తేగానీ పూట గడవని పరిస్థితి.. వీటికితోడు తన వైకల్యాన్ని చూసి వెక్కిరింపులు, ఛీత్కారాలు.. ఇలా ఎన్నో అవమానాలు ఎదురైనా, వాటన్నింటిని అధిగమిస్తూ ముందుకు సాగింది.. పరుగే శ్వాసగా జీవించింది.. తనకు అవహేళనలు ఎదురైన చోటే ప్రశంసలు అందుకుంటూ ఇవాళ ప్రపంచ వేదికపై అత్యుత్తమ ప్రదర్శనతో మెరిసింది. తన విజయంతో తెలుగు రాష్ట్రాలతో పాటు దేశానికి గర్వకారణంగా నిలిచింది 21 ఏళ్ల దీప్తి జీవాంజి.



వరంగల్ జిల్లాలోని మారుమూల గ్రామం కల్లెడ, దీప్తి స్వస్థలం. తల్లిదండ్రులు యాదగిరి, ధనలక్ష్మి రోజు కూలీలు. తినడానికి మంచి తిండి లేక, చదువుకోవడానికి నోచుకోని దీప్తి జీవితాన్ని ఒక్క 'పరుగు' మలుపు తిప్పింది. తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో సాధించిన స్వర్ణం, దీప్తి అథ్లెటిక్స్ ప్రస్థానానికి పునాది వేసింది. ఈ పోటీల్లో దీప్తి ప్రదర్శన గురించి తెలుసుకున్న 'సాయ్' సీనియర్ అథ్లెటిక్ కోచ్ నాగపురి రమేష్, మెరుగైన శిక్షణ కోసం హైదరాబాద్ రావాలని ఆహ్వానించాడు. కానీ, ఆ సమయంలో దీప్తి వరంగల్ నుంచి హైదరాబాద్ వచ్చేందుకు బస్సు చార్జీలకు కూడా డబ్బులు లేని దుస్థితి. మరోవైపు.. 'మానసిక దివ్యాంగురాలు.. ఎదుటి వాళ్లు చెప్పేదే సరిగ్గా అర్థం చేసుకోలేదు. అలాంటిది క్రీడల్లో దేశం తరఫున పతకాలు సాధిస్తుందా? క్రీడలు, ట్రైనింగ్ అంటూ హైదరాబాద్ చుట్టూ తిరిగితే ఇక ఈ అమ్మాయికి పెళ్లి కూడా కాదు' అని ఎంతో మంది అవహేళన చేశారు. అయినా ఇవేవీ పట్టించుకోకుండా దీప్తిని తల్లిదండ్రులు హైదరాబాద్ పంపించారు. అనుకున్నట్టే దీప్తి.. అనతికాలంలోనే రమేశ్ శిక్షణలో జాతీయ, అంతర్జాతీయస్థాయికి రాటుదేలింది. గోపీచంద్-మైత్రాహ్ ఫౌండేషన్‌లో శిక్షణ తీసుకుంటున్న దీప్తి, తొలుత సాధారణ అథ్లెట్లతో కలిసి పోటీ పడేది. ఒకసారి జాతీయ బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ దీప్తిని గమనించి, ఆమె సమస్యను తెలుసుకొని, వైద్య పరీక్షలు చేయించాడు. ఆమెకు ఐక్యూ చాలా తక్కువగా ఉందని, ఎదుటి వారు చెప్పేవి అర్థం చేసుకోవడం, సొంతంగా ఆలోచించడంలో ఇబ్బందులున్నాయని తెలిసి, పారా క్రీడల్లోని టీ20 విభాగానికి మార్చాడు. అప్పట్నుంచి దీప్తి వెనుదిరిగి చూడలేదు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తన సత్తా చాటుతూనే ఉంది. గతేడాది హాంగ్జౌలో జరిగిన ఆసియా పారా క్రీడల్లో 400 మీటర్ల రేసులో దీప్తి స్వర్ణ పతకంతో సత్తాచాటింది. ఇప్పుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలవడంతో పాటు పారిస్ పారాలింపిక్స్‌లో దేశం తరఫున పోటీపడే స్థాయికి చేరుకుంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి- హైదరాబాద్)

స్వర్ణంతో మెరిసినా..

- భారత్‌కు దక్కని పారిస్ బెర్త్
- ఆసియా మిక్స్‌డ్ 4 x400 మీ. రిలే

బ్యాంకాక్: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 4x400 మీ. రిలే విభాగంలో భారత జట్టు అదరగొట్టింది. తెలుగు అథ్లెట్ జ్యోతిక శ్రీ, శుభా వెంకటేశన్, అజ్మల్, జాకబ్‌తో కూడిన భారత బృందం సోమవారం జరిగిన రేస్‌ను 3 నిమిషాల 14.14 సెకన్ల జాతీయ రికార్డు టైమింగ్‌తో పూర్తిచేసి స్వర్ణ పతకం సాధించింది. అయితే పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను మాత్రం దక్కించుకోలేకపోయింది. శ్రీలంక జట్టు రజతం, వియత్నాం బృందం కాంస్య పతకం నెగ్గాయి.

అర్జున్‌కు డ్రా

షార్జా: షార్జా మాస్టర్స్ చెస్ టోర్నమెంట్ ఏడో రౌండ్‌లో అర్జున్ ఇరిగేసికి డ్రా ఎదురైంది. ఇరాన్‌కు చెందిన పర్హమ్‌తో జరిగిన ఈ రౌండ్‌లో 52 ఎత్తుల అనంతరం అర్జున్ (5) పాయింట్ పంచుకున్నాడు. అలీషేర్ (కజకిస్థాన్)తో జరిగిన ఏడో రౌండ్‌లో 48 ఎత్తుల తర్వాత హారిక (1.5) ఓటమిని అంగీకరించింది. రాజా రిత్విక్ (2.5) కూడా తన గేమ్‌ను డ్రాగా ముగించాడు.

మేం ఆడియో రికార్డు చేయలేదు

రోహిత్ ఆరోపణలను ఖండించిన స్టార్ గ్రూప్

న్యూఢిల్లీ: క్రికెటర్ల వ్యక్తిగత గోప్యతకు ఐపీఎల్ బ్రాడ్‌కాస్టర్ భంగం కలిగిస్తుందంటూ టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ఆరోపణలపై స్టార్ గ్రూప్ స్పందించింది. అసలు రోహిత్ వ్యక్తిగత సంభాషణకు చెందిన ఎలాంటి ఆడియో రికార్డును తాము ప్రసారం చేయలేదని స్పష్టం చేసింది. 'రోహిత్‌కు సంబంధించిన ఓ వీడియో క్లిప్‌తో పాటు అతడి పోస్ట్ కూడా ఇటీవల అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ వీడియోను వాంఖడే స్టేడియంలో ఈనెల 16న రికార్డు చేశాం. సైడ్‌లైన్‌లో భాగంగా అభిషేక్ నాయర్‌తో మాట్లాడిన దాన్ని కూడా కొన్ని సెకన్లపాటు అలా చూపాం. కానీ ఆడియోను రికార్డు చేయడం లేదా ప్రసారం చేయలేదు. ఆటగాళ్ల గోప్యతకు స్టార్ గ్రూప్ అమిత ప్రాధాన్యమిస్తుంది' అని స్టార్ తేల్చింది. అభిషేక్‌తో ముంబై కెప్టెన్సీ వ్యవహారంపై రోహిత్ సంభాషణను అదే రోజు కోల్‌కతా ఫ్రాంచైజీ ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేసి... కొంతసేపటి తర్వాత డిలీట్ చేసింది. కానీ అప్పటికే ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

'ఫైనల్' అడుగు ఎవరిదో?



క్వాలిఫయర్-1లో కోల్‌కతా x సన్‌రైజర్స్ అమీతుమీ నేడు

గెలిచిన జట్టు తుది పోరుకు

రాత్రి 7.30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో

అహ్మదాబాద్: ఊహకందని అంచనాలతో రసవత్తరంగా సాగిన ఐపీఎల్-17వ సీజన్ లీగ్ దశ ముగిసింది. ఇక మంగళవారం నుంచి ప్లేఆఫ్స్ పోరుకు తెర లేవనుంది. గతేడాది టాప్-4లో నిలిచిన చెన్నై, గుజరాత్, ముంబై, లఖ్‌నవూలో ఒక్క జట్టు కూడా ఈసారి అర్హత సాధించకపోవడం గమనార్హం. ఈసారి పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య తొలి క్వాలిఫయర్ జరుగనుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియం ఇందుకు వేదిక. గెలిచిన జట్టుకు నేరుగా ఫైనల్‌కు వెళ్లే గోల్డెన్ చాన్స్ ఉండడంతో ఇరు జట్ల అభిమానులు హోరాహోరీ పోరును ఆశిస్తున్నారు. ఓడిన జట్టు క్వాలిఫయర్-2లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటుంది. కోల్‌కతా చివరి రెండు మ్యాచ్‌లు వర్షార్పణం కావడంతో వారికి సరైన మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా పోయింది. అటు రైజర్స్ తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో పంజాబ్‌పై ఘనవిజయం సాధించి జోష్‌లో ఉంది. తాజా సీజన్‌లో ఈ రెండింటి మధ్య ఈడెన్‌లో ఓ మ్యాచ్ జరగ్గా కేకేఆర్ నాలుగు పరుగుల తేడాతో గెలిచింది. ఓవరాల్‌గా ఈ రెండు జట్ల మధ్య 26 మ్యాచ్‌లు జరగ్గా.. కేకేఆర్ 17, రైజర్స్ 9 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి.

వీరబాదుడే లక్ష్యంగా..

గతేడాది పట్టికలో అట్టడుగున నిలిచిన రైజర్స్.. ఈ సీజన్‌లో ఊహకందని రీతిలో చెలరేగుతోంది. ఆ జట్టు ఫ్యాన్స్ కూడా ఇలాంటి భీకర ఫామ్‌ను అంచనా వేయలేకపోయారు. ఇప్పటికే అత్యధిక స్కోరు రికార్డును అధిగమించిన ఈ జట్టు ఈ మ్యాచ్‌లోనూ బౌలర్లపై విరుచుకుపడాలని భావిస్తోంది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (533 రన్స్), అభిషేక్ శర్మ (467) పోటాపోటీ బౌండరీలతో పవర్‌ప్లేలోనే జట్టు స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళుతోంది. ఈ ఇద్దరూ 200కు పైగా స్ట్రయిక్‌రేట్‌తో ఆడుతుండడంతో బౌలర్ల దిమ్మ తిరిగిపోతోంది. హెడ్ బాదుడును ప్రేరణగా తీసుకుంటూ అభిషేక్ హిట్టింగ్‌కు దిగుతుండడంతో రైజర్స్ పరుగుల వరద పారిస్తోంది. గత ఆరు సీజన్లలో 31 సిక్సర్లు బాదిన శర్మ ఈ సీజన్‌లోనే 41 సిక్సర్లతో అదరగొట్టాడు. అయితే మిడిలార్డర్‌లో నితీశ్, క్లాసెన్ మాత్రమే రాణిస్తున్నారు. అలాగే వన్‌డౌన్‌లో రాహుల్ త్రిపాఠినే కొనసాగించవచ్చు. సమద్, షాబాజ్ ఆఖర్లో వేగం కనబర్చుతున్నారు. బౌలింగ్‌లో స్పిన్ బలహీనంగా కనిపిస్తున్నా కమిన్స్, భువనేశ్వర్, నటరాజన్, ఉనాద్కట్‌లతో పేస్ దళం మాత్రం పటిష్ఠంగా ఉంది.

సాల్ట్ లేకుండానే..

లీగ్ మ్యాచ్‌ల్లో కోల్‌కతా మెరుపు ఆరంభాలకు ఓపెనర్ ఫిల్ సాల్ట్‌ది ప్రధాన పాత్ర. కానీ పాక్‌తో టీ20 సిరీస్ కోసం అతడు ఇంగ్లండ్‌కు వెళ్లడంతో కేకేఆర్‌కు కీలక సమయంలో ఎదురుదెబ్బ తగిలింది. మరో ఓపెనర్ నరైన్ (461 రన్స్), సాల్ట్ (435) జట్టులో ఎక్కువ పరుగులు సాధించిన బ్యాటర్లు. అతడి స్థానాన్ని భర్తీ చేసేందుకు రహ్మనుల్లా గుర్బాజ్‌ను పరీక్షిద్దామనుకున్నా రాజస్థాన్‌తో మ్యాచ్ వర్షార్పణమైంది. దీంతో నరైన్ బాదుడుపై భారీ స్కోరు ఆధారపడి ఉంది. వన్‌డౌన్‌లో రఘువంశీ, వెంకటేశ్ అయ్యర్‌లను సందర్భాన్ని బట్టి ఆడిస్తున్నారు. మిడిలార్డర్‌లో కెప్టెన్ శ్రేయాస్ పెద్దగా ఆకట్టుకోవడం లేదు. అయితే నితీశ్ రాణా బరిలోకి దిగిన ఒక్క మ్యాచ్‌లో వేగంగా ఆడాడు. ఇక ఆండ్రీ రస్సెల్, రింకూ సింగ్ హిట్టింగ్ డెత్ ఓవర్లలో కీలకం కానుంది. బౌలింగ్‌లో నరైన్, వరుణ్ చక్రవర్తిల రూపంలో స్పిన్ బలంగా కనిపిస్తుండగా, పేస్‌లో మిచెల్ స్టార్క్, హర్షిత్ రాణా ఇబ్బందిపెట్టాలనుకుంటున్నారు.

తుది జట్లు (అంచనా)

కోల్‌కతా: గుర్బాజ్, నరైన్, వెంకటేశ్ అయ్యర్, శ్రేయాస్ అయ్యర్ (కెప్టెన్), నితీశ్ రాణా, రస్సెల్, రింకూ సింగ్, రమణ్‌దీప్, స్టార్క్, హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి.

సన్‌రైజర్స్: హెడ్, అభిషేక్ శర్మ, రాహుల్ త్రిపాఠి, నితీశ్ కుమార్, క్లాసెన్, షాబాజ్, సమద్, సన్వీర్ సింగ్, కమిన్స్ (కెప్టెన్), భువనేశ్వర్, నటరాజన్.

పిచ్, వాతావరణం

చక్కటి పేస్, బౌన్స్‌తో ఇక్కడి వికెట్ బ్యాటింగ్, పేసర్లకు అనుకూలించనుంది. భారీ స్కోర్లకు అవకాశం ఉండదు. గత 12 ఇన్నింగ్స్‌లో రెండుసార్లు మాత్రమే 200+ స్కోర్లు నమోదయ్యాయి. అలాగే చివరి ఐదు మ్యాచ్‌ల్లో చేజింగ్ జట్లే గెలిచాయి. కాబట్టి టాస్ నెగ్గిన టీమ్ ఫీల్డింగ్ వైపు మొగ్గు చూపవచ్చు.



ఫేవరెట్ సింధు

మలేసియా ఓపెన్

కౌలాలంపూర్: ఆటకు స్వల్ప విరామం ఇచ్చిన ఏస్ షట్లర్ పీవీ సింధు.. మంగళవారం నుంచి జరిగే మలేసియా ఓపెన్‌లో ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. గాయం నుంచి కోలుకొని రీఎంట్రీ ఇచ్చిన తర్వాత సింధు ఆశించిన స్థాయి ప్రదర్శన కనబర్చలేక పోతోంది. ఈ నేపథ్యంలో ఉబెర్ కప్, థాయ్ ఓపెన్‌ల నుంచి తప్పుకొన్న సింధు.. పారిస్ ఒలింపిక్స్ ముందు ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకోవాలనుకొంటోంది. తొలి రౌండ్‌లో క్రిస్టీ గిల్మోర్ (స్కాట్లాండ్)తో సింధు తలపడనుంది. అన్ సి యంగ్, చెన్ యు ఫీ, యమగూచి, కరోలినా మారిన్ లాంటి స్టార్ షట్లర్లు ఈ టోర్నీకి దూరం కావడంతో.. సింధు టైటిల్ గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అస్మిత చలీహా, ఆకర్షి కశ్యప్, ఉన్నతి హుడా కూడా అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. పురుషుల్లో కిరణ్ జార్జ్ ఒక్కడే పోటీలో ఉన్నాడు. డబుల్స్‌లో ట్రీసా జాలీ-గాయత్రి పుల్లెలతోపాటు పాలక్-ఉన్నతి, రితుపర్ణ-శ్వేతపర్ణ, సిమ్రన్-రితిక, కృష్ణ ప్రసాద్-సాయి ప్రతీక్ జంటలు బరిలోకి దిగనున్నాయి. మిక్స్‌డ్‌లో సిక్కిరెడ్డి-సుమీత్ జోడీ కూడా ఆడనుంది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 21-5-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 52 | వరంగల్
Warangal | Hyderabad | Mahabubnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




హెలికాప్టర్ శకలాల వద్ద గాలింపు బృందాలు

హెలికాప్టర్ ప్రమాదంలో..
ఇరాన్ అధ్యక్షుడి దుర్మరణం

- విదేశాంగ మంత్రి సహా 8 మంది మృతి
- వాతావరణ పరిస్థితి, కాలంచెల్లిన చాపర్‌తోనే..
- టెక్నాలజీలో వెనుకంజతో వెదుకులాట జాప్యం
- రేపు టెహ్రాన్ నగరంలో రైసీ అంత్యక్రియలు
- తాత్కాలిక అధ్యక్షుడిగా మహమ్మద్ మొఖ్బెర్
- సంబంధాల బలోపేతానికి రైసీ కృషి: మోదీ
- రైసీ మరణం.. ఇజ్రాయెల్‌పై నెటిజన్ల ట్రోల్!
- మెగసెసె నుంచి వైఎస్ వరకు
- నేతలను బలిగొన్న విమాన, హెలికాప్టర్ ప్రమాదాలు

టెహ్రాన్, మే 20: ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ(63) హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆదివారం ఆయన ప్రయాణిస్తున్న హెలికాప్టర్ భారీ వర్షాలు, దట్టమైన పొగమంచు, ఈదురుగాలులతో తూర్పు అజర్‌బైజాన్ ప్రావిన్స్‌లోని పర్వతాల మధ్య ఉన్న డిజ్మార్ అటవీ ప్రాంతంలో కూలిపోయిన విషయం తెలిసిందే. 20కి పైగా ప్రత్యేక బృందాలు, ఇరాన్ సైన్యం, ఇరాన్ రెడ్‌క్రిసెంట్ బృందాలు, ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్(ఐఆర్‌జీసీ) రాత్రంతా అటవీ ప్రాంతంలో గాలించి, సోమవారం తెల్లవారుజామున 5.30 సమయంలో(ఇరాన్ కాలమానం ప్రకారం) రైసీ హెలికాప్టర్ కూలిపోయిన ప్రదేశానికి

మిగతా 10వ పేజీలో...

సన్నాలకే బోనస్

500 చొప్పున ఇచ్చే పథకం వచ్చే సీజన్ నుంచే అమలు.. కేబినెట్ భేటీలో నిర్ణయం



మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

- కాళేశ్వరంలో చుక్క నీటి నిల్వ సాధ్యం కాదు
- ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర నివేదిక మేరకే చర్యలు
- తాత్కాలిక ఏర్పాట్లతో రైతులకు నీటి సరఫరా
- తడిసిన ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేస్తాం
- అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు పరిహారం
- నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు
- జూన్ 2న సోనియాగాంధీకి అభినందన సభ
- మంత్రివర్గ సమావేశ నిర్ణయాలను వెల్లడించిన పొంగులేటి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతులు పండించే సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇచ్చే పథకాన్ని వచ్చే వానాకాలం సీజన్ నుంచే అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సన్న వడ్ల రకాలను గుర్తించాల్సిందిగా వ్యవసాయ అధికారులను ఆదేశించింది. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన అనుమతితో సోమవారం నిర్వహించిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో సుదీర్ఘంగా జరిగిన మంత్రివర్గ సమావేశంలో.. కాళేశ్వరం ప్రాజెక్టుతో పాటు ధాన్యం కొనుగోళ్లు, తడిసిన ధాన్యం సేకరణ, అకాల వర్షాలతో నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లింపు, పాఠశాలల్లో సదుపాయాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. కేబినెట్ భేటీలో తీసుకున్న నిర్ణయాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోమవారం రాత్రి విలేకరులకు

మిగతా 11వ పేజీలో...

స్కూళ్ల అభివృద్ధికి రూ. 600 కోట్లు

- పాఠశాలల్లో వెంటనే మరమ్మతు పనులు
- విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫారాల పంపిణీ
- 20 రోజులపాటు బడిబాట కార్యక్రమం
- కేబినెట్ భేటీలో విద్యాశాఖపై ప్రత్యేక చర్చ

11

మేడిగడ్డ ఎగువన రాతికట్ట!

- 2.5 మీటర్ల ఎత్తుతో తాత్కాలికంగా..
- గ్యాబియన్ వాల్ పద్ధతిలో నదీ ప్రవాహంలో నిర్మాణం
- ప్రాణహిత నీటిని మళ్లించి పంపింగ్
- నెలలో 3 బ్యారేజీల మరమ్మతు పూర్తి
- డిసెంబరులోగా మేడిగడ్డ వద్ద పంపింగ్
- అన్నారం, సుందిళ్లలో వానాకాలంలోనే పరిస్థితిపై రెండేసి సంస్థలతో పరిశీలన

అధిక వడ్డీ ఆశపెట్టి..
200 కోట్లు కొల్లగొట్టి

తెలంగాణ స్టేట్ కో-ఆపరేటివ్ సొసైటీ మహిళా జీఎం మోసం

- శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో డిపాజిట్ల సేకరణ
- 5 నెలల నుంచి చెల్లింపుల బంద్
- ఒత్తిడి పెరగడంతో దీర్ఘకాల సెలవు
- 3 నెలల ముందే పదవీ విరమణ
- ప్రశ్నిస్తే రేపు, మాపు అని దాటవేత
- ఇల్లు, ఆఫీసుకు తాళం వేసి పరార్
- సీసీఎస్ ముందు బాధితుల ధర్నా



వాణిబాల

హిమాయత్‌నగర్/హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఆమె, అబిడ్స్‌లోని స్టేట్-కో-ఆపరేటివ్ సొసైటీలో జనరల్ మేనేజర్! బ్యాంకులో సహోద్యోగులు, సిబ్బంది, ఖాతాదారులతో కలుపుగోలుగా ఉండేది. ఇదే వారిని నిండా ముంచేసింది. 'బ్యాంకులో డబ్బులు వేస్తే వడ్డీ పెద్దగా రాదు. మాకు ఫైనాన్స్ బిజినెస్ ఉంది. నా భర్త, కుమారుడు మాత్రమే చూస్తారు. బడా రియల్ ఎస్టేట్ సంస్థలకు, వ్యాపారులకు ఫైనాన్స్ చేస్తుంటాం. సో.. మా సంస్థలో పెట్టుబడులు

మిగతా 12వ పేజీలో...



తిరుమలలో మళ్లీ చిరుతల కలకలం

- దివ్యారామం వద్ద చూశామన్న భక్తులు
- అటవీ, విజిలెన్స్ అధికారులు అప్రమత్తం

9



రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం!

- 24న వాయుగుండంగా మారే చాన్స్
- నేడు, రేపు వాన.. 40 డిగ్రీలపైనే ఎండ
- హైదరాబాద్, వికారాబాద్ జిల్లాల్లో వర్షాలు.. పిడుగుపాటుకు ఇద్దరి మృతి



ప్రాణాలు బోల్తా!

- 20 అడుగుల లోయలోకి పల్టీ కొట్టిన ట్రక్కు
- 19 మంది తునికాకు కూలీల దుర్మరణం
- మృతుల్లో 18మంది మహిళలే
- ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్‌లో ఘటన

10



నేటితో ముగియనున్న వీసీల పదవీకాలం

11

- మొదలవ్వని సెర్చ్ కమిటీల భేటీలు
- ప్రక్రియ పూర్తయ్యేదాకా ఇన్‌చార్జిలే
- హెచ్‌వోడీగా పాత బిల్లుల చెల్లింపు
- మూడేళ్ల ఆఫీ ఇప్పుడు మంజూరు

ఎంబీబీఎస్‌పై అస్పష్టత

ప్రవేశాల్లో పాత విధానమా? కొత్తదా? అనే సందిగ్ధత



- కన్వీనర్ కోటా సీట్లలో ఏపీ వారికి పదేళ్లుగా 15%
- గడువు తీరడంతో 'స్థానికత'పై నిర్ణయం తెలంగాణదే
- ఉన్నత విద్యా మండలి వద్ద పెండింగ్‌లో ఫైల్
- జీవో జారీ చేయకుంటే 300 సీట్లు కోల్పోయినట్లే
- ఈడబ్ల్యూఎస్‌పైనా నిర్ణయం తీసుకోని ప్రభుత్వం
- నెలలో నోటిఫికేషన్! కొత్త విధానానికి విద్యార్థుల డిమాండ్

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్య అడ్మిషన్ల విషయంలో స్థానికత, ఈడబ్ల్యూఎస్ కోటాపై సర్కారు నుంచి స్పష్టత కరువైంది. వీటిపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని, లేదంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వాపోతున్నారు. దేశవ్యాప్తంగా నీట్ ఫలితాలు జూన్ 14న రానున్నాయి. తర్వాత వారం, పది రోజుల్లోనే హెల్త్ యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. అంటే.. సరిగ్గా నెల రోజుల్లో ఎంబీబీఎస్ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల కానుంది. ఆలోగా వైద్య విద్య ప్రవేశాలకు సంబంధించిన స్థానికతను తేల్చాల్సి ఉంది. వాస్తవానికి విభజన చట్టం ప్రకారం అన్ని రకాల

మిగతా 12వ పేజీలో...

మత్తు మజా.. మస్త్ మజా..

- హైదరాబాద్ వ్యాపారి బర్త్ డే సందర్భంగా బెంగళూరులోని ఫాం హౌస్‌లో రేవ్ పార్టీ
- పార్టీలో ఏపీ రాజకీయ, సినీ ప్రముఖులు.. విమానాల్లో తరలించిన నిర్వాహకులు
- అర్ధరాత్రి దాటినా తాగేసి చిందులు.. 75 శాతంపైగా ఏపీ, తెలంగాణ వాసులే
- కన్నడ సీరియల్ నటులు, మోడల్స్ సైతం.. భారీగా డ్రగ్స్ స్వాధీనం.. ఐదుగురిపై కేసు
- పార్టీ వద్ద ఏపీ మంత్రి కాకాణి స్టిక్కర్ ఉన్న వాహనం.. టాలీవుడ్‌లో మళ్లీ ప్రకంపనలు
- శ్రీకాంత్ పేరు కూడా వెలుగులోకి.. అలాంటి అలవాట్లు లేవని వివరణ ఇచ్చిన నటుడు

9



కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా సాపోర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన ప్రజలు

60%

- ఐదో దశలో పోలింగ్.. బారాముల్లాలో భారీగా
- ఓటు వేయలేకపోయిన మమత సోదరుడు

దక్షిణాదిలో అధిక సీట్లు మాకే

- మిత్రపక్షాలతో కలిసి 400 సీట్లు దాటేస్తాం
- కీలక హామీలను 125 రోజుల్లో అమలుచేస్తాం
- బెంగాల్, ఒడిసాల్లో మాకు భారీగా ప్రజాదరణ
- దీంతో విపక్షాలు, మీడియాకు నిద్ర కరువు: మోదీ

10

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రైసీ దుర్మరణం

హెలికాప్టర్ ప్రమాదంలో ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ దుర్మరణం చెందడం ప్రపంచాన్ని నిర్ఘాంతపరిచింది. భారీ వర్షాలు, పొంగ మంచుతో ప్రకృతి ప్రతికూలంగా మారిపోవడం ఈ దుర్ఘటనకు కారణంగా కనిపిస్తున్నప్పటికీ, గాజా యుద్ధంతో ఇరాన్–ఇజ్రాయెల్ వైరం పతాక స్థాయిలో ఉన్నప్పుడు రైసీ మరణం పలు అనుమానాలతో పాటు, సరికొత్త భయాలను కూడా కలిగిస్తోంది. అనేక దశాబ్దాల తరువాత ఇజ్రాయెల్‌తో ఇరాన్ నేరుగా తలబడటం ఇబ్రహీం రైసీ ఏలుబడిలో ఇటీవలే జరిగింది. వందలాది డ్రోన్లు, క్షిపణులతో సాగిన ఆ దాడికి ప్రతీకారం తీర్చుకుంటానని ఇజ్రాయెల్ ప్రకటించింది. ఇక, ఇరాన్ ఆర్థిక, ఆయుధ సహకారంతో హౌతీ, హిజ్బుల్లా ఇత్యాదిసంస్థలు ఇజ్రాయెల్ దూకుడుకు కళ్ళెంవేసేందుకు, ఎర్రసముద్రం దాడులతో అంతర్జాతీయ వాణిజ్యాన్ని దెబ్బతీసి అగ్ర రాజ్యాలపై ఒత్తిడిపెంచేందుకు ప్రయత్నిస్తున్న విషయం తెలిసిందే. ఇంతటి కీలకమైన సమయంలో ఇరాన్ అధ్యక్షుడు మరణించడంతో ఇజ్రాయెల్ మీదకు అనుమానాలు పోవడం సహజం. తన ప్రమేయం ఏమాత్రం లేదని ఇజ్రాయెల్ ప్రమాణం చేస్తున్నప్పటికీ, ఇప్పట్లో ఆ సందేహాలకు తెరపడే అవకాశాలైతే లేవు.

ఈ ప్రయాణంలో ఇరాన్ అధ్యక్షుడు వినియోగించిన బెల్ హెలికాప్టర్ అనేక దశాబ్దాల నాటిది. ఇస్లామిక్ విప్లవంకంటే ముందే దీనిని కొనుగోలుచేసి ఉండాలని కొందరి అంచనా. ఆ తరువాత అమెరికా ఆంక్షలు, కక్షసాధింపు చర్యలు తెలిసినవే. కొత్త హెలికాప్టర్లను కొనగలిగే అవకాశం ఎలాగూ లేకపోగా, ఉన్నవాటి విడిభాగాలకోసం కూడా వెతుక్కుంటున్న స్థితి ఇరాన్‌ది. పశ్చిమదేశాలతో కాస్తంత సయోధ్య సాధించి కష్టాలనుండి బయటపడదామని ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలకు అమెరికా అడ్డుపడుతూనే ఉంది. ఒబామా కాలంలో పశ్చిమదేశాలకూ ఇరాన్‌కూ మధ్య కుదిరిన అణు ఒప్పందం ప్రపంచానికి ఎంతో ఉపశమనాన్ని కలిగించింది. కానీ, డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రాగానే ఈ ఒప్పందం నుండి వైదొలిగి తిరిగి అగ్గిరాజేశారు. ఈ కక్షపూరిత వైఖరే రైసీ ఎదుగుదలకు కూడా దోహదం చేసింది. ఇరాన్ అత్యున్నత మతపెద్ద అయతొల్లా అలీ ఖమేనీ అండదండలతో, ఆశీస్సులతో పైకి ఎదిగిన రైసీ 2017 అధ్యక్ష ఎన్నికల్లో హసన్ రౌహానీతో పోటీపడి ఓడిపోయారు. 2015లో పశ్చిమదేశాలతో అణు ఒప్పందం కుదుర్చుకోవడంలో హసన్ రౌహానీ చొరవ కాదనలేనిది. ఆయనకు ఆధునికుడిగా, ఆలోచనాపరుడుగా అక్కడి ఉన్నత స్థానాల్లోనూ, ప్రజల్లోనూ మంచి పేరుంది. ఇక, 2018లో ట్రంప్ ఈ అణు ఒప్పందం నుంచి వైదొలిగి, మరిన్ని కఠినమైన ఆంక్షలతో తిరిగి ఇరాన్‌ను వేధించడం ఆరంభించడంతో పరిస్థితులు రైసీకి ఉపకరించాయి. ఆయనకు ఖమేనీ అనేక కీలక పదవులు కట్టబెట్టారు. 2021లో రౌహానీని సులువుగా ఓడించి రైసీ దేశాధ్యక్షుడు కాగలిగారు. కానీ, పాలకుడుగా ఇంటా బయటా ఆయనకు గొప్పపేరేమీ లేదు. ఖమేనీ శిష్యుడుగా, ఛాందసత్వం అమితంగానే ఉన్న ఈయన అధికారంలోకి రాగానే దేశంలో చాలా ఆంక్షలు అమలుచేశారు. మహిళల వస్త్రధారణకు సంబంధించిన నియంత్రణలమీద పెద్ద ఎత్తున ఉద్యమాలు రేగాయి. మహసా అమిని ఘటన తీవ్ర ప్రజాగ్రహాన్ని రేపింది. మహిళా ఉద్యమాన్ని అణచివేయడంలో ఈయన ప్రదర్శించిన కర్కశత్వం చరిత్రలో నిలిచిపోతుంది. ఆయన మరణానికి దేశంలో అందరూ చింతించడం లేదని, కొన్ని సమూహాలు వేడుక చేసుకుంటున్నాయని వార్తలు వస్తున్నాయి. తీవ్ర అనారోగ్యంతో ఉన్న ఖమేనీ నిష్క్రమణ అనంతరం రైసీ ఆ స్థానాన్ని భర్తీ చేయబోతున్నారని అనుకుంటున్న తరుణంలో ఈ ప్రమాదం జరిగింది.

చాబహార్ పోర్టులో ఒక టెర్మినల్‌ను అభివృద్ధి చేసుకొని వాడుకొనేందుకు భారత్–ఇరాన్ మధ్య ఇటీవలే పదేళ్ళ ఒప్పందం కుదిరింది. అధ్యక్షుడు రైసీ, విదేశాంగమంత్రి హుసేన్ ఆమిర్ అబ్దుల్లాహియన్ ఈ విషయంలో ఎంతో చొరవచూపి, మనకు ఎంతగానో సహకరించారంటూ విదేశాంగమంత్రి జయశంకర్ గుర్తుచేసుకున్నారు. భారత్–ఇరాన్ మధ్య అనాదిగా బలమైన మైత్రి ఉంది. కొన్ని సందర్భాల్లో మనస్పర్థలు కలిగినా అవి హద్దులు దాటలేదు. అమెరికా ఆంక్షలు, ఆదేశాల మేరకు ఇరాన్‌తో మనం వ్యవహరించే తీరులో గతంతో పోల్చితే ఎంతోమార్పు వచ్చినప్పటికీ, చమురు దిగుమతుల విషయంలో అమెరికా మాటను తుచ తప్పకుండా పాటించినప్పటికీ ఇరాన్ మన పరిస్థితిని అర్థం చేసుకుంది, సానుకూలంగానే వ్యవహరించింది. ఇప్పుడు కొత్త అధ్యక్షుడుగా ఎవరు ఎంపిక అయినప్పటికీ, ఉభయదేశాల సంబంధాలు మెరుగుపడవచ్చునే కానీ, దిగజారే అవకాశాలైతే లేవు.

మరోసారి మోదీ సర్కారే తథ్యం

నరేంద్రమోదీ సారథ్యంలో భారతీయ జనతా పార్టీ మూడోసారి అధికారంలోకి రావడం కష్టమని ప్రతిపక్షాలు పెద్ద ఎత్తున వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయి. వాటికి కొందరు కుహనా, వామపక్ష మేధావులు వంత పలుకుతున్నారు. మోదీ ఏమి మాట్లాడినా ఆయన ఆత్మరక్షణలో ఉన్నారని, ఓటమి భయంతో ఉన్నారని దుష్ప్రచారం చేస్తున్నారు. విచిత్రమేమంటే 2019లో కూడా వారు ఇదే విధంగా ప్రచారం చేశారు. కాంగ్రెస్ పునరుజ్జీవనం చెందుతోందని, ప్రతిపక్షాలు మునుపటికన్నా బలోపేతమవుతున్నాయని లెక్కలు చెప్పారు. కాని 2019లో కూడా అనేక రాష్ట్రాల్లో బీజేపీ అత్యధిక స్థానాలు సాధించింది. 2019లో అత్యధిక స్థానాలు సంపాదించడం కూడా బీజేపీకి ఈ ఎన్నికల్లో వ్యతిరేక అంశంగా ప్రతిపక్షాలు ప్రచారం చేస్తున్నాయి. 2019లో కంటే ఈసారి బీజేపీ ఎందుకు అధిక స్థానాలు సంపాదించలేదో, కొత్త ప్రాంతాల్లోకి ఎందుకు విస్తరించలేదో చెప్పేందుకు వారి వద్ద కారణాలు లేవు.



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

ఉత్తరప్రదేశ్‌నే ఉదాహరణ తీసుకుంటే ఈ రాష్ట్రంలో సమాజ్‌వాది పార్టీ–కాంగ్రెస్ కలిసి పోటీ చేసినందువల్ల వెనుకబడిన వర్గాలు, మైనారిటీలు సంఘటితమై ఇండియా కూటమికి మద్దతుగా నిలుస్తారని ఒక బూటకపు ప్రచారానికి కాంగ్రెస్ వ్యతిరేకులు తెరదించారు. 2019లో కూడా సమాజ్‌వాది పార్టీ, బహుజన సమాజ్ పార్టీ కలిసి పోటీ చేశాయి. వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనారిటీలు కలిసి బీజేపీని చిత్తుగా ఓడిస్తాయని అప్పుడు కూడా గొంతెత్తి ఘోషించారు. కాని 2014 కంటే 2019లో అత్యధిక ఓట్లు, సీట్లు బీజేపీకి లభించాయి. వెనుకబడిన వర్గాలు, దళితులు కూడా బీజేపీకి ఓటు వేసినట్లు నియోజకవర్గాల వారీ ఫలితాలు చూసిన వారికి అర్థమవుతుంది. గత అయిదు సంవత్సరాల్లో కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో యోగి ఆదిత్యనాథ్‌ల డబుల్ ఇంజన్ సర్కార్ యూపీలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేశాయి. వేల కోట్ల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు అమలు అయ్యాయి. ఎక్స్‌ప్రెస్ హైవేలు, రహదారులు, రైల్వే మార్గాలతో అధునాతన యూపీ ఆవిర్భవించింది. ఒకప్పుడు రెండే విమానాశ్రయాలున్న యూపీలో ఇప్పుడు పది ఉన్నాయి. భవిష్యత్‌లో 21 విమానాశ్రయాలను నిర్మించాలని సంకల్పించారు. మాఫియా హింసాకాండను పూర్తిగా అరికట్టి శాంతి భద్రతల పరిస్థితిని అద్భుతంగా మెరుగుపరిచారు. కుల, మత, జాతి వివక్ష లేకుండా సంక్షేమ కార్యక్రమాలు నేరుగా ప్రజలను చేరుకుంటున్నాయి. వీటన్నిటికి తోడు కాశీ కారిడార్ నిర్మాణం, అయోధ్యలో రామమందిర నిర్మాణం తర్వాత మెజారిటీ ప్రజలు ఎంతో హర్షాతిరేకంతో ఉన్నారు. ఈ పరిణామాల వల్ల యూపీలో బీజేపీ సీట్ల సంఖ్య పెరుగుతుందా లేక తగ్గుతుందా? ఏం సాధించారని సమాజ్‌వాది పార్టీ–కాంగ్రెస్ కూటమికి ప్రజలు ఓటు వేస్తారు? అమేథిలో గత ఎన్నికల్లో కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ చేతుల్లో ఓటమిపాలు కావడంతో ఖిన్నుడైన రాహుల్ గాంధీ ఇప్పుడు నియోజకవర్గం ప్రజలకు ముఖం చాటేసి తల్లిచాటు బిడ్డగా ఆమె ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం నుంచి పోటీ చేయడం సిగ్గుచేటు కాదా? పైగా యూపీలో కూటమి ప్రభంజనం వీస్తుందని ప్రగల్భాలు పలుకుతున్నారు.



> 2019తో పోలిస్తే మోదీ సామాజిక పునాది మరింత విస్తరించిందే కాని తగ్గలేదు. కారణం మోదీ అమలు చేసిన సామాజిక సంక్షేమ కార్యక్రమాలు 2019లో కంటే ఇప్పుడు ప్రజలకు మరింత చేరువయ్యాయి. బీజేపీ అంటే అగ్రవర్ణాల పార్టీ అని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని స్వీకరించేందుకు ఇప్పుడెవరూ సిద్ధంగా లేరు. ఎందుకంటే రాజకీయంగా, ఆర్థికంగా దళితులు, ఆదివాసీలు, మహిళలు, బీసీలకు బీజేపీ సాధికారికత కల్పించింది. ఈ వాస్తవం ఆ వర్గాల వారికి బాగా తెలుసు.

యూపీ మాత్రమే కాదు, బిహార్, ఉత్తరాఖండ్, హర్యానా, గుజరాత్, హిమాచల్, అస్సాం, ఢిల్లీ, తెలంగాణ, బెంగాల్ తదితర రాష్ట్రాల్లో బీజేపీకి అనుకూల పవనాలు ఉధృతంగా వీస్తున్నాయే కాని తగ్గడం లేదు. మోదీ హయాంలో దేశం బలోపేతం కావడం తెలిసిన ఈ రాష్ట్రాల ప్రజలు మరొక పార్టీకి ఓటు వేసే అవకాశాలే లేవు. రాష్ట్రీయ జనతాదళ్‌కు కంచుకోట అని చెప్పే బిహార్‌లోని గోపాల్‌గంజ్‌లో కూడా ప్రజలు 'జో రామ్ కో లాయే హై, హమ్ ఉన్ కో లాయేంగే' అని నినదిస్తున్నారని ఒక రాజకీయ విశ్లేషకుడు చెప్పారు. లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన సతీమణి రబ్రీదేవి అరాచక పాలన, ఆయన బంధువుల అవినీతి వల్ల రాష్ట్రం కొన్ని దశాబ్దాల వెనుకకు వెళ్లిందని అక్కడి ప్రజలకు తెలుసు. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీయే బిహార్‌లో అత్యధిక శాతం సీట్లు, ఓట్లు సాధించింది. ఈసారి కూడా బిహార్‌లో ఎన్డీఏ 50 శాతం పైగా ఓట్లు సాధిస్తుందని ఏబీపీ–సీ ఓటర్ జరిపిన సర్వేలో తేలింది. బిహార్‌లో 69 శాతం మంది నరేంద్రమోదీని ప్రధానమంత్రిగా చూడాలనుకుంటున్నారని ఈ సంస్థ సర్వే తెలిపింది. దాదాపు 60 శాతం మంది ప్రజలు మోదీ పనితీరుపై వ్యక్తం చేశారు.

నిజానికి ఈ అభిప్రాయం కేవలం బిహార్‌కు సంబంధించింది కాదు, దేశంలో అత్యధిక శాతం ప్రజానీకం నరేంద్రమోదీ పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారు. ఇప్పుడు దేశంలో జరుగుతున్నది అసెంబ్లీ ఎన్నికలు కావని ప్రజలకు తెలుసు. అసెంబ్లీ ఎన్నికల్లో స్థానిక అంశాలు ప్రస్తావనకు వస్తాయి. కాని లోక్‌సభ ఎన్నికల్లో జాతీయ స్థాయిలో అంశాలను ప్రజలు దృష్టిలో ఉంచుకుంటున్నారు. ముఖ్యంగా దేశంలో యువత పూర్తిగా ఇప్పుడు బీజేపీ వైపే ఉన్నదని ఎవర్ని కదిలించినా అర్థమవుతోంది. మోదీకి ఓటు వేయకపోతే ఎవరికి ఓటు వేస్తాం అని వారు ప్రశ్నిస్తున్నారు. దేశంలో సగానికిపైగా మహిళలు మోదీకి ఏకపక్షంగా ఓటు వేయాలని కృతనిశ్చయంతో ఉన్నారు. బీసీలు, ఎస్సీలు, ఆదివాసీలకు మోదీకి మించిన నాయకుడు కనపడడం లేదు. 2019తో పోలిస్తే మోదీ సామాజిక పునాది మరింత విస్తరించిందే కాని తగ్గలేదు. కారణం మోదీ అమలు చేసిన సామాజిక సంక్షేమ కార్యక్రమాలు 2019లో కంటే ఇప్పుడు ప్రజలకు మరింత చేరువయ్యాయి. బీజేపీ అంటే అగ్రవర్ణాల పార్టీ అని ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారాన్ని స్వీకరించేందుకు ఇప్పుడెవరూ సిద్ధంగా లేరు. ఎందుకంటే రాజకీయంగా, ఆర్థికంగా దళితులు, ఆదివాసీలు, మహిళలు, బీసీలకు సాధికారికత కల్పించింది. ఈ వాస్తవం ఆ వర్గాల వారికి బాగా తెలుసు.

2009 లోక్‌సభ ఎన్నికల నుంచి కాంగ్రెస్‌కు దాదాపు 10–11కోట్ల మంది ఓటర్లు మద్దతు పలుకుతున్నారు. కాని బీజేపీకి అందుకు రెట్టింపు ఓటర్లు అంటే 22 కోట్ల మంది మద్దతునిస్తున్నారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ బీజేపీకి 15 కోట్ల మంది ఓటర్లు అధికంగా పెరిగారు. ఇది పూర్తిగా నరేంద్రమోదీ నాయకత్వం వల్ల వచ్చిన మార్పు. మోదీ ఎక్కడకు వెళ్లినా కోట్లాది ప్రజలు ఆయనకు ఘనస్వాగతం చెప్పడాన్ని పార్టీ గమనించింది. ఆయన పార్టీ యంత్రాంగాన్నే కాక మొత్తం ప్రజలను ఉత్తేజపూరితులు చేయగలిగారని తెలుసుకున్నది. మోదీ నాయకత్వం పట్ల ప్రజలు విశ్వాసం చూపిస్తున్నారని తెలిసినందువల్లే ఈసారి మోదీ కీ గ్యారంటీ అన్న పేరుతో ప్రజలకు వాగ్దానాలు చేయాలని పార్టీ నిర్ణయించింది. దీని మూలంగా 2019 కన్నా ఇప్పుడు బీజేపీకి అత్యధిక ఓటు శాతం లభించడం ఖాయం. మరి మోదీ నాయకత్వంలో ఎన్డీఏ అత్యధిక సీట్లు సాధిస్తుందనడంలో అనుమానం ఎవరికున్నది? ప్రజలకు మాత్రం లేదు.

(బీజేపీ జాతీయ కార్యదర్శి)

విజయాల బాటలో ఇండియా

లోక్‌సభ ఎన్నికల ఐదో దశలో దేశవ్యాప్తంగా 49 నియోజకవర్గాల ఓటర్లు సోమవారం తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికలలోని అన్ని దశల కంటే ఈ దశ చాలా చిన్నది. అయితే ఈ 49 నియోజకవర్గాల ఓటర్ల తీర్పు ఎన్నికల తుది ఫలితంపై అసమానమైన ప్రభావం చూపనున్నది. పలు ప్రతిష్ఠాత్మక పోటీలు జరగడం ఈ దశ ప్రత్యేకతల్లో ఒకటి. కొన్ని రాష్ట్రాలలో భారతీయ జనతా పార్టీ తీవ్ర నష్టాలను చవి చూడనున్నది. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి, అమేథి, ఫైజాబాద్ (అయోధ్య); బిహార్‌లో సరణ్ (ఒకప్పుడు చాప్రా), హాజీపూర్, భారతదేశ ఆర్థిక రాజధాని ముంబై మహానగరంలోని మొత్తం ఆరు నియోజకవర్గాలు రాజకీయంగా ప్రతిష్ఠాత్మకమైనవే కాకుండా, అత్యంత ముఖ్యమైనవి. మూడో దశలో వలే ఈ ఐదవ దశలో కూడా బీజేపీ, 2019లో గెలుచుకున్న సీట్లలో చాలా వాటిని కోల్పోనున్నది. ఐదో దశలో పోలింగ్ జరిగిన 49 స్థానాలలో 39 గత సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏకు దక్కాయి. వాటిలో 32 బీజేపీవే కావడం గమనార్హం. 2019లో ఇండియా కూటమి ఈ 49లో కేవలం 8 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది. ప్రస్తుత ఎన్నికలలో అంతకు రెట్టింపు సంఖ్యలో సీట్లను గెలుచుకోగలమనే ఆశాభావం ప్రతిపక్ష కూటమిలో ఉన్నది. 2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు గెలుచుకున్న ఓట్లు, సీట్లను పరిగణనలోకి తీసుకుంటే ఆ ఆశాభావం నిరాధారమైనది కాదని చెప్పవచ్చు. నిజానికి ఇండియా కూటమికి అంతకు మించి సీట్లు దక్కే అవకాశమున్నదనే సూచనలు బలంగా ఉన్నాయి. 2019లో రెండు కూటములు గెలుచుకున్న సీట్ల మధ్య వ్యత్యాసం 31 కాగా, ఈ తేడా ప్రస్తుత ఎన్నికలలో ఇంచుమించు 17కి తగ్గనున్నది. ఆ వ్యత్యాసం మరింత తగ్గే అవకాశమెంతైనా ఉన్నది. వీటిలో గణనీయమైన సీట్లు ఉత్తరప్రదేశ్ నుంచి ఇండియా కూటమికి దక్కనుండడం విశేషం.



■ యోగేంద్ర యాదవ్

ఉత్తరప్రదేశ్‌లో ఐదో దశ ఎన్నికలు జరిగిన 14 నియోజకవర్గాలు నాలుగు ప్రాంతాలలో విస్తరించి ఉన్నాయి. అవి: అవధ్, పూర్వాంచల్, దో ఆబ్, బుందేల్‌ఖండ్. ఈ 14 సీట్లలో 13ను 2019లో బీజేపీ గెలుచుకున్నది. మిగతా ఒక స్థానం – రాయబరేలిని కాంగ్రెస్ కైవసం చేసుకున్నది. అయితే 2022 అసెంబ్లీ ఎన్నికలలో ఓట్ల వాటాను నిలుపుకున్న పక్షంలో కాంగ్రెస్ పార్టీ రాయబరేలి (ఈ నియోజకవర్గం నుంచే రాహుల్ గాంధీ పోటీ చేశారని గుర్తు చేయవలసిన అవసరమున్నదా?)నే కాకుండా అమేథి, బారాబంకి సీట్లనూ గెలుచుకోవచ్చు. కాంగ్రెస్ సీనియర్ భాగస్వామి అఖిలేశ్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాది పార్టీ సైతం గణనీయంగా లబ్ధి పొందే అవకాశమున్నది. 2019లో ఎస్‌పి ఈ 14 స్థానాలలో ఒక్క దానినీ గెలుచుకోలేదు. అయితే 2022 అసెంబ్లీ ఎన్నికలలో మారిన ఓటర్ల ప్రాధాన్యాలు ప్రస్తుత ఎన్నికలలో కూడా యథాతథంగా కొనసాగిన పక్షంలో పూర్వాంచల్‌లో కౌశాంబీని, దోఆబ్‌లో ఫతేపూర్‌ను, బుందేల్‌ఖండ్‌లో బందా నియోజకవర్గాలను సమాజ్‌వాది పార్టీ తప్పక గెలుచుకోగలదు. సరే, అయోధ్య ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గంలో కూడా సోమవారం పోలింగ్ జరిగింది. అయోధ్యలోను, దాని చుట్టు పక్కల ప్రాంతాలలో ఓటింగ్ శాతం పెరిగిందా లేదా అనేది ఒక ఆసక్తికరమైన విషయం.

మహారాష్ట్రలో ఈ ఐదో దశతో ఎన్నికలు ముగిసాయి. ఉద్ధవ్ సేన, షిండే సేన; ఎన్‌సీపీ (శరద్ పవార్), ఎన్‌సీపీ (అజిత్ పవార్) పార్టీల మధ్య అస్లీ.. నకిలీ పోరు హోరాహోరీగా జరిగింది. ఓటర్లు ఏ సేనను అసలు శివసేనగా, ఏ ఎన్‌సీపీని అసలు ఎన్‌సీపీగా గుర్తించారో వేచి చూడవలసి ఉన్నది. ఈ పోరాట క్షేత్రాలు గ్రేటర్ ముంబై ప్రాంతంలోను, నాసిక్ ప్రాంతంలోను మాలేగావ్–ధూలే ప్రాంతంలోను ఉన్నాయి. ముంబై నగరంలోను, థానేలోను జరుగుతున్న పోటీలు ఉద్ధవ్ సేన, షిండే సేనలకు అస్తిత్వ పోరాటాలు కాగా భివాండి, దిండోరి నియోజకవర్గాల ఓటర్ల తీర్పు ఎన్‌సీపీ (శరద్ పవార్) పశ్చిమ మహారాష్ట్రలోని తన కంచుకోటల నుంచి ఇతర ప్రాంతాలకు విస్తరించగలదా అనే విషయాన్ని నిర్ధారిస్తుంది. ఉద్ధవ్ సేన ప్రప్రథమంగా డబుల్ ఎమ్ (మరాటీ మనూస్, ముస్లింలు)లపై ఆధారపడింది. ఇక ప్రస్తుతం బద్ధ శత్రువుగా ఉన్న బీజేపీకి వ్యతిరేకంగా సంయుక్త మహారాష్ట్ర ఉద్యమకాలం నాటి మహారాష్ట్రియన్ వర్సెస్ గుజరాతీ వివాదాన్ని పునరుద్ధరించింది. మరాఠీ మనూలు, ముస్లిమ్స్ అంశాలను సంయుక్తంగా ఉపయోగించుకోవడం ప్రస్తుతానికి హేతుబద్ధంగానే కనిపిస్తోంది. కాగా సంఖ్యా బలం కూడా ఆ పార్టీ పక్షానే ఉన్నది. ముంబైలోని 6 నియోజకవర్గాలలో ఐదు ఉద్ధవ్ సేన చేతిలోనే ఉన్నాయి. 2019–22 సంవత్సరాల మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న ఉద్ధవ్ ఠాక్రే ప్రజల్లో మంచి పేరు సంపాదించుకున్నారు మాటల్లోను, చేతల్లోను వివక్ష పాటించకపోవడంతో మైనారిటీ వర్గాలు సైతం ఆయన పట్ల సానుకూలంగానే ఉన్నాయి. ముంబై ఎమ్మెల్యేలు, కార్యకర్తల్లో అత్యధికులు ఉద్ధవ్ పక్షానే ఉన్నారు. ఈ కారణంగా ప్రస్తుత ఎన్నికలలో కూడా ఆ పార్టీ అత్యధిక సీట్లను గెలుచుకునే అవకాశమున్నది. తత్కారణంగా ఉద్ధవ్ సేన భాగస్వామిగా ఉన్న ఇండియా కూటమి విశేషంగా లబ్ధి పొందనున్నది.

పశ్చిమ బెంగాల్, బిహార్, జార్ఖండ్‌లలో ఇండియా కూటమికి స్వల్ప లబ్ధి సమకూరే అవకాశమున్నది. బిహార్‌లో రాష్ట్రీయ జనతాదళ్ తన ఒకనాటి కంచుకోట చాప్రా (ఇప్పుడు సరన్)లో తన వైభవాన్ని పునరుద్ధరించుకోవడానికి తీవ్రంగా ప్రయత్నించింది. మిథిలాంచల్‌లో రెండు సీట్లు ఎన్డీఏకు అనుకూలంగా ఉన్నాయి. దివంగత దళిత నేత రాంవిలాస్ పాశ్వాన్ నియోజకవర్గమైన హాజీపూర్‌లో బీజేపీకి మిత్రుడు అయిన ఆయన కుమారుడు పోటీ చేస్తున్నాడు. బెంగాల్ ఉత్తర పరగణాలలోని ఏడు నియోజకవర్గాలకుగాను ఐదో దశలో హుగ్లీ, హౌరా నియోజకవర్గాలలో పోలింగ్ జరిగింది. 2021 అసెంబ్లీ ఎన్నికల ప్రాతిపదికన చూస్తే బారక్‌పూర్, హుగ్లీలో బీజేపీకి విజయావకాశాలు లేవు. అయితే తృణమూల్ కాంగ్రెస్ నుంచి అరామ్ గాబ్ నియోజకవర్గాన్ని కైవసం చేసుకోవచ్చు.



> ఐదో దశలో పోలింగ్ జరిగిన 49 స్థానాలలో 39 గత సార్వత్రిక ఎన్నికలలో ఎన్డీఏకు దక్కాయి. 2019లో ఇండియా కూటమి ఈ 49లో కేవలం 8 స్థానాలను మాత్రమే గెలుచుకున్నది. ప్రస్తుత ఎన్నికలలో అంతకు రెట్టింపు సంఖ్యలో సీట్లను గెలుచుకోగలమనే ఆశాభావం ప్రతిపక్ష కూటమిలో ఉన్నది. 2019 అనంతరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ సహా ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు గెలుచుకున్న ఓట్లు, సీట్లను పరిగణనలోకి తీసుకుంటే ఆ ఆశాభావం నిరాధారమైనది కాదని చెప్పవచ్చు.

ఒడిషాలో 2019లో గెలుచుకున్న స్థానాలు అన్నిటినీ మళ్లీ స్వాయత్తం చేసుకోగలనని బీజేపీ భావిస్తోంది. ఈ దశలో ఐదు లోక్‌సభ, 35 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోలింగ్ జరిగింది. ఐదు లోక్‌సభ నియోజకవర్గాలలో బర్గా, సుందర్‌గఢ్ బొలంగీర్‌లు పశ్చిమ ఒడిషాలో ఉన్నాయి. గత సార్వత్రిక ఎన్నికలలో ఈ మూడు స్థానాలను బీజేపీ గెలుచుకున్నది. మరో రెండు స్థానాలు కంధమాల్, అస్కాను 2019లో బిజూ జనతాదళ్ గెలుచుకున్నది. ప్రస్తుత ఎన్నికలలో కూడా ఈ ఐదు స్థానాలు బీజేపీ, బిజూ జనతాదళ్ యథావిధిగా గెలుచుకునే అవకాశమున్నది. పోలింగ్ జరిగిన రెండు శాసనసభ నియోజకవర్గాలలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అభ్యర్థిగా ఉన్నారు. జార్ఖండ్‌లో ఇండియా కూటమి కొడెర్మను స్వాయత్తం చేసుకునే అవకాశమున్నది. ఇక్కడ సీపీఐ (ఎమ్ఎల్ఎల్) ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉన్నాడు. జైల్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ భార్య కల్పన కొడెర్మలోని ఒక శాసనసభా నియోజకవర్గం ఉప ఎన్నికలో పోటీ చేస్తున్నారు.

జమ్మూ–కశ్మీర్‌లోని బారాముల్లా, లద్దాఖ్ నియోజకవర్గాలలో సోమవారం ఐదో దశ ఎన్నికలు జరిగాయి. బారాముల్లాలో నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి ఓమర్ అబ్దుల్లా తీవ్ర పోటీ నెదుర్కొన్నారు. జైలు నుంచి పోటీ చేసిన ఇంజనీర్ రషీద్ అబ్దుల్లాకు తీవ్ర పోటీ నిచ్చారు. లద్దాఖ్‌లో ఇటీవలి వరకు ఇండియా కూటమికి సానుకూలత ఉన్నది. అయితే ఎన్‌సి, ఐఎన్‌సికి చెందిన కార్గిల్ ప్రాంత నేతలు, కార్యకర్తలు తిరుగుబాటు చేసి లేహ్ నుంచి ఒక అభ్యర్థిని సంయుక్తంగా పోటీకి నిలబెట్టారు. ఫలితంగా ఇండియా, ఎన్డీఏ ఓట్లు చీలిపోయే అవకాశమున్నందున కార్గిల్‌కు చెందిన స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించే అవకాశమున్నది.

మొత్తం మీద ఈ ఐదో దశ బీజేపీకి క్లిష్ట సమయం. 2019 నాటి ఆధిక్యతను నిలబెట్టుకోగలదా అన్నది సందేహమే. మా అంచనాలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ఇప్పటికే మొదటి నాలుగు దశలలో 40 సీట్లను నష్టపోనున్నది. 5, 6, 7 దశలలో సైతం ఇంచుమించు అదే సంఖ్యలో సీట్లను కోల్పోయే అవకాశమున్నది. ఈ నష్టాల పరంపరను ఐదో దశ నుంచే నిరోధించలేని పక్షంలో జూన్ 4న ఎన్డీఏ తన మెజారిటీని, కనీసం బీజేపీ తన సొంత ఆధిక్యతను కోల్పోవడం దాదాపుగా తథ్యం. ఇది నిశ్చితంగా సంభవించనున్న పరిణామం.


(వ్యాసకర్త జాతీయ కన్వీనర్, భారత్ జోడో అభియాన్)

(శ్రేయాస్ సర్దేశాయి, రాహుల్ శాస్త్రి సహకారంతో)

నవ భారత వైతాళికుడు

మానవ జీవిత పురోగమనానికి అనుగుణమైన సాంఘిక పరిణామాలు తీసుకురావడానికి తమ జీవితాలను అర్పించిన ధర్మ యోధులే నవయుగ వైతాళికులు. 18వ శతాబ్దపు చివరిలో భారతదేశం ఎంతో దైన్యస్థితిలో ఉండేది. దేశమంతా విగ్రహారాధన, జంతు బలులు, నర బలులు, మత న్యూనతాధిక్యతలు, కలహాలు, అస్పృశ్యత, కన్యాశుల్కం, వరకట్నం, కుల, మత భేదాలు, బాల్య, వృద్ధ వివాహాలు, సతీసహగమనాలు, బహుభార్యాత్వం మొదలైన ఎన్నో సాంఘిక దురాచారాలతో నిండిపోయి ఉంది. ఇంకొక పక్క మహమ్మదీయ మత ఛాందస ధోరణి, కొత్తగా వెలిసిన క్రైస్తవ మత తీవ్ర ప్రచారం– వీటి మధ్య ప్రజలు నలిగిపోయారు. స్త్రీల పరిస్థితి అధ్వానంగా ఉండేది. ఈ మూఢ బంధాల నుంచి ప్రజలకు విమోచనం కలిగించడానికి ఆనాటి మేధావులైన భారతీయులు కొందరు పూనుకున్నారు. వారిలో ప్రథముడు రాజా రామమోహన రాయ్.

1772 మే 22న బెంగాల్ రాష్ట్రంలోని, హుగ్లీ జిల్లా, రాధానగర్ అనే గ్రామంలో రామమోహన్ రాయ్ జన్మించారు. తల్లిదండ్రులు రమాకాంత రాయలు, తారిణీ దేవి. ఇంటివద్దనే పారసీ భాష, స్కూల్లో బెంగాలీ భాష నేర్చుకున్నారు. 9వ ఏట పాట్నా వెళ్ళి అరబ్బీ భాష అభ్యసించారు. 12వ ఏట కాశీ వెళ్ళి సంస్కృతం భాష నేర్చుకుని, హిందూ మతగ్రంథ పఠనం సాగించారు. 1815లో 'హిందువుల విగ్రహారాధన' అనే పుస్తకం రచించి విగ్రహారాధనను ఖండించారు. 22వ ఏట ఉద్యోగంలో చేరారు. ఇంగ్లీష్ భాష నేర్చుకున్నారు. 1815–1828 మధ్య కలకత్తాలో 5141 సతీ సహగమనాలు జరిగాయి. ఆయన వదినగారే దీనికి బలి అయ్యారు. అందుకు ఆయన తీవ్రంగా స్పందించి ఉద్యమం చేపట్టారు.



నికృష్ట దశలో ఉన్న భారత జాతి పునరుద్ధరణకు బ్రహ్మ సమాజం ఆవిర్భవించింది. ముగ్గురు మహనీయులు దీని అభివృద్ధికి మూడు దశలలో కారకులయ్యారు. వారు రాజా రామమోహన రాయ్, మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్, బ్రహ్మానంద కేశవ చంద్రసేన్. రాజా రామమోహన రాయ్ వివిధ మతాలను కూలంకషంగా పరిశీలించి, సర్వ మతాలు ఒకే మూల సత్యాన్ని వెల్లడిస్తున్నాయని గ్రహించారు. అదే వేద సారం, సర్వ మత సారం, విశ్వ మానవ ధర్మం, బ్రహ్మ ధర్మం. హిందువులు, మహమ్మదీయులు, క్రైస్తవులు, యూదులలో సద్భావన కలిగించడానికి ఒక్కటే ఉపాయమని, అదే ఏకేశ్వరుని మానసికోపాసన అని, అన్ని మతాల ఉపదేశాలు ఈ విషయంలో ఏకీభవిస్తున్నాయని ఆయన సప్రమాణంగా రుజువు చేశారు.

శతాబ్దాల నమ్మకాల నుంచి ప్రజలను మళ్ళించి ఉపాసన ప్రతి ఒక్కరికి సాధ్యమని చెప్పారు. గురువులు, బాబాలు, పూజారులు, మధ్యవర్తులు, పవిత్ర గ్రంథాలు – వీటి అవసరం ఏదీ లేకుండా భగవంతుని సూటిగా ఆరాధించవచ్చునని రామమోహన్ రాయ్ వెల్లడించారు. అంటే పౌరాణిక భావాల నుంచి, సనాతన వైదికధర్మ భావాల వైపు మళ్ళించారు. ఎవరి నమ్మకాలు ఏమైనా, విభేదాలు ఎన్ని వున్నా, ఏకేశ్వర విశ్వాసులందరు, నానా మతస్థులు కలిసి ఒక చోట చేరి, జగత్కర్త, జగత్పిత అయిన ఆ పరమేశ్వరుని ఉపాసించవచ్చునని ఆయన విశదీకరించారు. ఈ ఏకేశ్వర ఉపాసన వ్యాప్తికై 'బ్రహ్మ సభ' అనే సంఘాన్ని 1828 ఆగస్ట్ 20న స్థాపించారు. తర్వాత దీనినే 'బ్రహ్మ సమాజం' అన్నారు. ఏకేశ్వరోపాసనకు అనువైన మందిరాన్ని కలకత్తాలో 1830లో ఆయన నిర్మించారు. ఆ మందిరంలో చేయవలసిన ఉపాసన లక్ష్యం, విధానం, ఉపాసకులు పాటించవలసిన నియమాలను నిర్దేశిస్తూ ఆయన ఒక 'ధర్మ పత్రం' ప్రకటించారు. ఆధ్యాత్మిక, స్వాతంత్ర్యాలను ప్రతిబింబించే ఆ ధర్మ పత్రం (ట్రస్ట్ డీడ్)లో ఏకేశ్వర విశ్వాసం కలవారెవరైనా జాతి, మత, కుల భేదాలు లేకుండా భక్తి, శ్రద్ధలతో అందులో చేరి ప్రార్థించుకోవచ్చునని ప్రకటించారు. ఈ విధంగా రామమోహన్ రాయ్ సర్వ మత సమన్వయాన్ని సాధించి దేశ కల్యాణానికి మార్గదర్శకులు అయ్యారు. బ్రహ్మ సమాజం ఎన్నో సాంఘిక, మత సంస్కరణలకు కారణం అయ్యింది. ఈనాడు బాల్య వివాహాలు లేవు. వితంతు, కులాంతర, మతాంతర, దేశాంతర వివాహాలు సంఘ ఆమోదం పొందాయి. స్త్రీ విద్య సామాన్య వ్యవహారమైంది. 19వ శతాబ్దంలో భారత జాతి జీవనాన్ని వివిధ రంగాలలో తీర్చిదిద్దిన దేశభక్తులందరూ బ్రహ్మసమాజ విశాల ధర్మ ప్రభావాన్ని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పొందినవారే.

అసంఖ్యాకములై శాఖోపశాఖలుగా విస్తరించిన కుల భేదాలు ప్రజలలో దేశాభిమానాన్ని, భారతీయతను పూర్తిగా నాశనం చేశాయని రామమోహన్ రాయ్ సంఘోద్ధరణకు పూనుకుని స్త్రీ విద్యావశ్యకతను నిరూపించి, బహుభార్యాత్వాన్ని ఖండించారు. సతీ సహగమనాన్ని నిషేధింపచేసారు. ఆయన స్వాతంత్ర్య పిపాసి. ఆయన జీవితంలో జాతీయత, విశ్వజనీనత మిళితమైనాయి. దేశ ప్రజలకు రాజకీయ స్వాతంత్ర్యం లేనిదే మత, సాంఘిక స్వాతంత్ర్యాలు ప్రయోజనకరం కావన్న ఉద్దేశంతో రామమోహన్ రాయ్, బ్రిటిష్ పార్లమెంట్ సభ్యులతో వాదించి భారత దేశ పరిపాలనలో అనేక సంస్కరణలు ప్రవేశపెట్టడానికి కారకులయ్యారు. భారతదేశానికి వెన్నెముక అయిన రైతుల శ్రేయస్సులోనే దేశ భవిష్యత్తు ఇమిడి ఉన్నదని గ్రహించి, పన్నులు విధించడంలోను, పరిపాలన విధానంలోను అనేక మార్పులను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టించారు.

'నానాజాతి సమితి' స్థాపనకు ఆయనే పునాదులు వేశారు. ప్రపంచమంతా ఒకటేనని, జాతుల మధ్య, దేశాల మధ్య భేద భావాలు వచ్చినప్పుడు అన్ని జాతులు కలిసి ఒక సంఘంగా ఏర్పడి, ఒక్కొక్క సంవత్సరం ఒక్కొక్క దేశం వారు దానికి అధ్యక్షులుగా ఉండాలని, ఒక్కొక్క సమావేశం వేరు వేరు దేశాలలో జరగాలని ఆయన సూచించారు. పర ప్రభుత్వాన్ని నిరసిస్తూనే, పాశ్చాత్య సంస్కృతి, సంప్రదాయాల వలన కలిగే ప్రయోజనాలను స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించి వారి సుఖ జీవనానికి తోడ్పడకపోతే బ్రిటీష్ ప్రభుత్వం కేవలం పశుబలంతో భారతదేశాన్ని పాలించలేదని, ప్రజలు తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని పడగొట్టడం తథ్యమని జోస్యం చెప్పిన మహా మేధావి.

రామమోహన్, బ్రహ్మ మందిరానికి శ్రీ రామచంద్ర విద్యావాఘీష్ అనే ఆచార్యుడిని నియమించారు. 1833లో ఆయన ఇంగ్లాండ్ వెళ్ళారు. అక్కడే బ్రిస్టల్ నగరంలో సెప్టెంబర్ 27న మరణించారు.

■ కేశవ చంద్ చల్లా

అధ్యక్షులు, హైదరాబాద్ దక్కన్ బ్రహ్మసమాజ్

(రేపు రాజా రామమోహన రాయ్ 252వ జయంతి)

అడవిని హరిస్తున్న జాతరలు

ఇటీవలికాలంలో ప్రకృతి పర్యాటకానికి (ఎకో టూరిజం) విపరీతమైన ఆదరణ లభిస్తోంది. సెలవులు దొరికాయంటే కేరళ, జమ్మూ కశ్మీర్, హిమాచల్ తదితర ఈశాన్య రాష్ట్రాలు; ఊటీ, కొడైకెనాల్ లాంటి ప్రాంతాలకు ఎంత వ్యయమైనా భరించి పెద్ద ఎత్తున వెళ్తున్నారు. ఇదే ధోరణి తెలంగాణ రాష్ట్రంలోనూ కనిపిస్తోంది. ఒత్తిడితో కూడిన నగర జీవితం నుంచి స్వాంతన కోసం అమ్రాబాద్, తాడ్వాయి, లక్నవరం, ఆదిలాబాద్, గొట్టంగుట్ట తదితర అటవీ, ప్రకృతి రమణీయ పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఇదే కోవలో, రాష్ట్రంలోని దట్టమైన అటవీ ప్రాంతాల్లో జరిగే వివిధ మతపరమైన ఉత్సవాలకు ఎంతో కఠినమైనప్పటికీ లక్షలాదిగా వెళ్తున్నారు. దీనికి ఉదాహరణగా నాగర్ కర్నూల్ జిల్లా సలేశ్వరం జాతరను చెప్పుకోవచ్చు.

చుట్టూ అడవి, కొండలు, కోనలు, జలపాతాలు. ప్రకృతి రమణీయతకు అద్దంపట్టే నల్లమల అటవీ ప్రాంతంలో దట్టమైన లోయ గుహలో వెలసిన లింగమయ్య దర్శనం ఏప్రిల్ 21నుంచి 24వ తేదీ వరకు జరిగింది. తెలంగాణ అమర్ నాథ్ సాహస యాత్రగా పేరొందిన మూడు రోజుల సలేశ్వరం మహాజాతర ప్రాంతం చిరుతల అభయారణ్యం కావడంతో మూడు రోజులు మినహా మిగతా ఏడాది మొత్తం ప్రవేశం నిషేధం. చెంచు పెంటలు, ప్రకృతి రమణీయత, పున్నమి వెన్నెల... సలేశ్వరం యాత్రలో అరుదైన అనుభూతిని మిగులుస్తాయి. ఈ మూడు రోజుల్లో రికార్డు స్థాయిలో ఈసారి ఆరు లక్షలకు పైగా భక్తులు హాజరయ్యారు. ఎంతో కఠినమైనప్పటికీ ప్రతీ ఏటా ఈ జాతరకు వచ్చే వారి సంఖ్య పెరుగుతూనే ఉంది. ఇది ఒక రకంగా ఎకో టూరిజానికి పెరుగుతున్న ఆదరణగా భావించవచ్చు గానీ, మరోపక్క దట్టమైన అటవీ ప్రాంతంలోకి పౌరులు వెళ్లడం వల్ల పర్యావరణ, వన్య ప్రాణుల మనుగడకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతున్నదని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మూడు రోజుల పాటు జాతర ముగిసిన అనంతరం, పర్యాటకులు/ భక్తులు వదిలిన ప్లాస్టిక్ బాటిళ్లు, వారు మార్గమధ్యంలో వదిలేసిన చెప్పులు, ఇతర వ్యర్థ పదార్థాలే దాదాపు పదిహేను లారీలకు పైగా ఉన్నాయని గణాంకాలు తెలుపుతున్నాయి. టెంపుల్ టూరిజం పేరుతో రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి లక్షలాది మంది రావడం, వచ్చిన పర్యాటకులు భారీ మొత్తంలో వ్యర్థాలు వదిలేసి వెళ్ళడం అడవిలోని వన్య ప్రాణుల మనుగడకు ప్రమాదకరంగా మారిందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సలేశ్వరం మాదిరిగానే, వరంగల్ జిల్లాలోని మేడారం జాతర కూడా ఒకప్పుడు దట్టమైన అడవిలోనే ఉండేది. అటవీ ప్రాంతాలకు వెళ్లి ప్రకృతిలో సేద తీరాలనే ఉద్దేశ్యంతో మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు కూడా ఇదే విధంగా జనసమ్మర్దం పెరిగింది. 1996లో మేడారం జాతరకు దాదాపు పదిలక్షలు పైగా హాజరవగా, ఇటీవల 2024లో ముగిసిన జాతరకు కోటి యాభై లక్షల మంది హాజరయ్యారు. రెండు దశాబ్దాలలో మేడారంను సందర్శించే వారి సంఖ్య పన్నెండింతలు పెరిగిందన్న మాట. ఇదేమాదిరిగా, మేడారంలో అటవీ సంపద గణనీయ విస్తీర్ణంలో తగ్గడం, వన్య ప్రాణుల మనుగడ పూర్తిగా కనుమరుగవడం, విపరీతంగా ప్లాస్టిక్ వినియోగం వ్యర్థపదార్థాలు వదలడం వల్ల మేడారంతోపాటు పరిసర పదికిలోమీటర్ల వరకు అడవీ, నివాస గూడాలన్నీ కాలుష్యానికి గురికావడం చూస్తున్నాం. మేడారానికి డబుల్ రోడ్ నిర్మాణం; అంతర్గత రోడ్ల ఏర్పాటు, విద్యుత్ లైన్ల నిర్మాణం; బస్సులు, ఇతర వాహనాలకు పార్కింగ్ సదుపాయానికి చెట్లు నరకడం లాంటి చర్యల వల్ల తాడ్వాయి అటవీ సర్కిల్లో ప్రతీ జాతరకు కనీసం ఐదు శాతం అడవుల ధ్వంసం జరుగుతోందని అంచనా. 2024లో ముగిసిన మేడారం జాతర అనంతరం 25 టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు, 63 టన్నుల పశు మాంస వ్యర్థాలు (స్లాటర్ వేస్ట్), 11 డీసీఎంల గ్లాస్ బాటిళ్లు, 320 ట్రాక్టర్ల బెల్లం తదితర పూజా పదార్థాలు, 67 కిలోల తలనీలాల వెంట్రుకలు, బ్లేడుల వ్యర్థాలు మేడారం పరిసర ప్రాంతాల నుండి సేకరించినట్టు రాష్ట్ర కాలుష్య నియంత్రణా మండలి తన అధికారిక నివేదికలో తెలియచేసింది. ఇవేకాక, దాదాపు కోటి మంది విసర్జించే మల వ్యర్థాలు కూడా ఉంటాయి.

అయితే, ఈ సలేశ్వరం, మేడారం జాతరలలో పర్యావరణ పరిరక్షణకై రాష్ట్ర అటవీ శాఖ, పర్యావరణ శాఖ, కాలుష్య నియంత్రణ మండలి, దేవాదాయ శాఖలు పలు చర్యలను చేపడుతున్నాయి. కాగా, పర్యాటకులు ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు తీసుకుపోకుండా కఠినమైన చర్యలను చేపట్టాలి. అటవీ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ ఆహార, వ్యర్థ పదార్థాలను వదిలివేయకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలి. అవసరమైతే, నిబంధనలను అతిక్రమించిన వారికి భారీ ఎత్తున జరిమానాలు విధించాలి. ఏది ఏమైనా, ప్రజా చైతన్యం ద్వారానే పర్యావరణహితంగా అటవీ ప్రాంతాల్లో జాతరలు, ఉత్సవాలు జరుపుకోగలుగుతాం. దీనికి ప్రతీ ఒక్క పౌరుడు బాధ్యతతో వ్యవహరించాలి.

● కన్నెకంటి వెంకటరమణ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్: editpage@andhrajyothy.com



పట్టమెవరికో..?

27న గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక

- కాంగ్రెస్ నుంచి బరిలో దిగిన తీన్మార్ మల్లన్న
- బీఆర్ఎస్ తరుపున ఎనుగుల రాకేష్‌రెడ్డి
- బీజేపీ అభ్యర్థిగా గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి
- హోరాహోరీగా ప్రధాన అభ్యర్థుల ప్రచారం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,73,413 మంది పట్టభద్రులు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఉప ఎన్నిక ప్రచారం జోరందుకుంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు 12 జిల్లాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పట్టభద్రులను ఆకట్టుకునేందుకు ఆత్మీయ సమ్మేళనాలు, వాకర్స్‌తో కలిసి అడుగులేస్తూ ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మూడేళ్ల కాలపరిమితికే ఈ ఉప ఎన్నిక జరుగుతున్నప్పటికీ అన్ని ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నిక సవాల్‌గా మారింది. వరుసగా గత నాలుగు పర్యాయాలు గెలిచిన ఈ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్.. మోదీ చరిష్మాతో పాగా వేయాలని కమలం పార్టీ నేతలు విస్తృతంగా శ్రమిస్తున్నారు. దీంతో 27న జరిగే పట్టభద్రుల ఎన్నికల్లో ఎవరికి పట్టం కడతారో అనే ఉత్కంఠ నెలకొంది. వివరాల్లోకి వెళితే...

1.73 లక్షల మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు..

ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల పరిధిలో 4,63,839 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 2,88,189 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 1,75,645 మంది మహిళ ఓటర్లు, ఇతరులు ఐదుగురు ఉన్నారు. ఇందులో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,73,413 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,08,349 మంది ఓటర్లు, మహిళలు 65,063 మంది ఓటర్లు, ఇతరులు ఒక్కరు ఉన్నారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో 43,812 ఓట్లు, హనుమకొండలో 43,719ఓట్లు ఉన్నాయి. ములుగు జిల్లాలో 10,306 మంది ఓటర్లు, భూపాలపల్లి జిల్లాలో 12,535 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. సిద్దిపేటలో (పూర్వ వరంగల్ జిల్లా పరిధిలోని మండలాల ఓటర్లు) కేవలం 4,679 మంది ఓటర్లే ఉన్నారు. అయితే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానంలో మాత్రం మహిళ ఓటర్ల కంటే పురుష ఓటర్లే అధికంగా ఉండటం గమనార్హం. కాగా, ఇప్పటికే నామినేషన్ల ఘట్టం పూర్తి కావడంతో ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ నెల 27న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక జరగనుంది. ఇందు కోసం ఎన్నికల సంఘం విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 52మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ నెలకొంది.

కాంగ్రెస్‌లో తీన్మార్ జోష్..

నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో ఖచ్చితంగా గెలువాలని కాంగ్రెస్ టార్గెట్ పెట్టుకుంది. శాసనమండలిలో కాంగ్రెస్‌కు మెజారిటీ లేకపోవటంతో ప్రతీ ఎమ్మెల్సీ ఎన్నిక ఆ పార్టీకి సవాల్‌గా మారింది. దీంతో నల్గొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంపై కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన రాములునాయక్ నామమాత్రపు పోటీ ఇచ్చారు. అయితే ఆ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన తీన్మార్ మల్లన్నను ప్రస్తుతం కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించారు. అలాగే తృతీయ స్థానంలో నిలిచిన ప్రొఫెసర్ కోదండరాం ప్రస్తుతం కాంగ్రెస్‌కు మద్దతుగా ఉండటంతో ఈసారి ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విజయం సాధిస్తామనే ధీమాతో ఉంది. దీనికి తోడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో తమకు

జిల్లా	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
వరంగల్	27,038	16,774	00	43,812
హనుమకొండ	25,739	17,990	00	43,729
జనగామ	14,915	8,503	01	23,419
సిద్దిపేట	3,122	1,557	00	4,679
మహబూబాబాద్	22,948	11,985	00	34,933
భూపాలపల్లి	8,000	4,535	00	12,535
ములుగు	6,587	3,719	00	10,306
మొత్తం	1,08,349	65,063	01	1,73,413

కలిసి వస్తుందనే లెక్కల్లో ఆ పార్టీ ఉంది. అలాగే ప్రొఫెసర్ కోదండరామ్ నేతృత్వంలో టీజేఎస్‌తో పాటు సీపీఐ, సీపీఎంలు కూడా కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ప్రకటించాయి. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలో ఉభయ కమ్యూనిస్టులకు ఓటు బ్యాంకు ఉండడంతో తమకు కలిసి వస్తుందనే ఆశలో కాంగ్రెస్ ఉంది. వీటికి తోడు నల్గొండ, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో దాదాపు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు చెందినవారే అధికంగా ఉండడంతో గెలుపు ధీమాలో ఆ పార్టీ నేతలు ఉన్నారు. ఇక చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ద్వితీయ స్థానంలో నిలిచారు. సొంతంగా తీన్మార్ మల్లన్న టీమ్ ఏర్పాటు చేసుకుని గత కొంతకాలంగా మూడు ఉమ్మడి జిల్లాల్లో తన సొంత ఓటు బ్యాంకును పెంచుకుంటు వస్తున్నారు. దీంతో ఈసారి పక్కగా కాంగ్రెస్ గెలుస్తుందనే ధీమాలో ఆ పార్టీ క్యాడర్ ఉంది.

గులాబీకి సవాలే..!

ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల గులాబీ పార్టీకి సవాల్‌గా మారింది. శాసన మండలి పునరుద్ధరణ తరువాత 2007లో తొలిసారిగా వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా కపిలవాయి దిలీప్‌కుమార్ విజయం సాధించారు. ఆ తరువాత 2009లో జరిగిన ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన దిలీప్ కుమార్ విజయం సాధించారు. 2015, 2021లో వరుసగా రెండు పర్యాయాలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. 2007 నుంచి 2021 వరకు నాలుగు పర్యాయాలు జరిగిన ఎన్నికల్లో గులాబీ పార్టీ విజయం సొంతం చేసుకుంది. ఉద్యమ సమయంతో పాటు అధికారంలో ఉన్న సమయంలో కూడా గ్రాడ్యుయేట్ ఓటర్లు గులాబీ పార్టీకి జై కొట్టారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో పాటు కీలక నేతలు పార్టీని వీడుతున్న సమయంలో ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్ ప్రతిష్టాత్మకంగా మారింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎనుగుల రాకేష్‌రెడ్డిని ఆ పార్టీలో దించింది. గత నవంబరులో అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ నుంచి రాకేష్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ ఓటు బ్యాంకుతో పాటు పూర్వ పరిచయాలతో బీజేపీ ఓటు కూడా రాకేష్‌రెడ్డి వైపు మొగ్గు చూపుతుందనే అంచనాలతో ఆ పార్టీ నేతలు ఉన్నారు. ఈ ఎన్నికను జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తన భుజస్కంధాలపై వేసుకుని విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

బీజేపీలో గెలుపు ఆశలు..

వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో పాగా వేసేందుకు బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తుంది. 2007 నుంచి గత నాలుగు పర్యాయాలుగా బీజేపీ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ విజయం మాత్రం చేరువకావటం లేదు. దీంతో లోక్‌సభ ఎన్నికలు జరుగుతుండటంతో ప్రధానమంత్రి మోదీ హవా వీస్తుందని ఆ పార్టీ భావిస్తుంది. మోదీ చరిష్మాతో పాటు యువత ఓట్లతో ఉప ఎన్నికల్లో విజయం సాధించాలని ఆ పార్టీ లక్ష్యంగా పెట్టుకుంది. దీంతో గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని మరోసారి బరిలో దించింది. పార్టీలో అన్ని జిల్లాల నాయకులతో ప్రేమేందర్‌రెడ్డికి పరిచయాలు విస్తృతంగా ఉండడంతో పాటు పార్టీ నుంచి పూర్తి స్థాయిలో సహకారం అందుతుండటంతో కమలంలోనూ గెలుపు ధీమా వ్యక్తం అవుతోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సైతం ప్రచారంలోకి దిగడంతో కమలనాధుల్లో జోష్ కనిపిస్తుంది.



భద్రకాళి చెరువులో అమ్మవారికి చక్రస్నానం

కన్నులపండువగా చక్రస్నానం

- ఘనంగా అమ్మవారికి పుష్పయాగం
- వైభవంగా ముగిసిన భద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలు

వరంగల్ కల్చరల్, మే 20: వరంగల్‌లోని భద్రకాళి కల్యాణ బ్రహ్మోత్సవాలు ఆఖరి రోజు కన్నులపండువగా జరిగాయి. 11రోజులపాటు సాగిన ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం చక్ర తీర్థోత్సవం (చక్రస్నానం), ధ్వజారోహణం, ఘటాభిషేకం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగిశాయి. ఉదయం 4 గంటలకు నిత్యాహ్నికం, విశేషపూజ నిర్వహించిన అనంతరం అమ్మవారికి చూర్ణోత్సవం నిర్వహించారు. ముత్తైదువలు అమ్మవారి అభిషేకానికి పసుపు కొమ్ములు, సుగంధ ద్రవ్యాలను కలిపి పాత్రలో సమర్పించగా చక్రస్నానానికి ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు నేతృత్వంలో అర్చక బృందం భద్రకాళి తటాకం(చెరువు)లో వేద మంత్రోశ్చరణల మధ్య నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో తెలిసీ తెలియక పొరపాట్లు చేస్తే ఆ దోషం, పాపం అంటకుండా అమ్మవారికి శతఘటాభిషేకం నిర్వహించి, పుష్పయాగం చేశారు. సోమవారం అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ఉభయ దాత సేవకులుగా వరంగల్, హనుమకొండ, గ్రేటర్ వరంగల్ పద్మశాలీ సంఘం సభ్యులు పాల్గొన్నారు. పద్మశాలీ జిల్లా సంఘం అధ్యక్షుడు ఆడెపు రవీందర్ దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు, ప్రముఖ వ్యాపారవేత్త గుండు ప్రభాకర్, మేయర్ గుండు సుధారాణి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారి పూజాద్రవ్యాలను ఆలయంలో సమర్పించారు. ప్రత్యేక పూజలు, అభిషేకం జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. అర్చకులు భద్రకాళి శేషు మాట్లాడుతూ భగవంతుడిని సకల జనులు ఆరాధించాలన్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతీ రోజు ఒక కులం వారు అమ్మవారి సేవలో పాల్గొనడం శుభసూచికమన్నారు. ఈవో శేషు భారతి మాట్లాడుతూ భద్రకాళి, భద్రేశ్వరుల కల్యాణ బ్రహ్మోత్సవాలు విజయవంతం కావడానికి సహకరించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, గోరంటల రాజు, వడ్నాల నరేందర్, శ్యామంతుల శ్రీనివాస్, కుసుమ సతీష్, నందాల చందర్‌బాబు, పద్మశాలీలు పాల్గొన్నారు.

నాలా పూడిక తీత పనుల్లో వేగం పెంచండి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే



డాక్టర్స్ కాలనీలో నాలాను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, మే 20 : గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో నాలా పూడిక తీత పనులపై వేగం పెంచాలని నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. సోమవారం వరంగల్ నగరంలోని పలు కాలనీలలో సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పర్యటన చేశారు. బొందివాగు, దేశాయిపేట, 100 ఫీట్ల రోడ్డు, లేబర్ అడ్డా, డాక్టర్ కాలనీ, వడ్డెపల్లి చెరువు, బాలాజీనగర్‌లో నాలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో పూడిత పనుల్లో వేగం పెంచాలని, లేదంటే ప్రజలకు సమస్యలు ఎదురవుతాయని అన్నారు. నాలాల నుంచి తీసిన సీల్ట్‌ను రాంపూర్ డంప్ యార్డ్‌కు తరలించాలని, లేదంటే వర్షం నీటికి కాలువల్లో కలిసిపోతాయని అన్నారు. ఇంజనీరింగ్ అధికారులు శానిటేషన్ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, ఈఈ శ్రీనివాస్, డీఈలు రంగారావు, సారంగం, రవికిరణ్, ఏఈ సతీష్, శానిటరి ఇన్‌స్పెక్టర్ ఇశ్రం శ్రీను పాల్గొన్నారు.



ఏనుమాములలోని స్ట్రాంగ్ రూం వద్ద రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝూ

స్ట్రాంగ్ రూంను పరిశీలించిన సీపీ

వరంగల్ సిటీ, మే 20 : ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను సోమవారం వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సోమవారం పరిశీలించారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల ఈవీఎంలను స్ట్రాంగ్ రూంలలో భద్రపరిచి మూడంచల భద్రత ఏర్పాటు చేశారు. కాగా, సీపీ సోమవారం అకస్మిక తనిఖీ చేశారు. కేంద్ర బలగాలు, స్థానిక పోలీసులు నిర్వహిస్తున్న విధులను సీపీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే స్ట్రాంగ్ రూంల వద్ద మరింత భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలను కేంద్ర బలగాలకు, పోలీసులకు వివరించారు. సీపీ వెంట ఏనుమాముల సీఐ పులి రమేష్ ఉన్నారు.

'స్థానిక' సమరానికి సిద్ధం

- మొదలైన పంచాయతీ ఎన్నికల సన్నద్ధత
- ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ
- మూడు విడతలుగా పోలింగ్
- ఉమ్మడి జిల్లాలో 1688 జీపీలు
- బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు
- ప్రతీ కేంద్రంలో రెండేసి బ్యాలెట్ బాక్సులు

5

ఏసీబీకి చిక్కిన కమలాపూర్ తహసీల్దార్

- రూ.5 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.30 వేలు డిమాండ్
- హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో ఘటన



మాట్లాడుతున్న ఏసీబీ డీఎస్పీ సాంబయ్య,తహసీల్దార్ మాధవి, బాధితుడు గోపాల్

కమలాపూర్, మే 20 : తనకు వారసత్వంగా వచ్చిన భూమిని రిజిస్ట్రేషన్ చేయడానికి లంచం డిమాండ్ చేసిన తహసీల్దార్‌ను ఏసీబీ అధికారులు సోమవారం వలపన్ని పట్టుకున్నారు. ఈ సంఘటన కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో చోటు చేసుకుంది. వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపిన వివరాల ప్రకారం..

కమలాపూర్ మండలంలోని కన్నూర్ గ్రామానికి చెందిన కసరబోయిన గోపాల్ తన తండ్రి రాజయ్య పేరుమీద ఉన్న వ్యవసాయ భూమి (రెండెకరాల మూడు గుంటలు)ని తన పేరు మీదకు మార్చాలని ఈ నెల 10న స్లాట్ బుక్ చేసుకున్నాడు. కాగా, రిజిస్ట్రేషన్ చేయాలంటే తనకు రూ.30వేలు డబ్బులు ఇవ్వాలని తహసీల్దార్ మాధవి ఈనెల 18న డిమాండ్ చేశారు. ఇందుకు ముందుగా సోమవారం రూ.5వేలు ఇస్తానని, రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తర్వాత మిగతా రూ.25వేలు ఇస్తానని గోపాల్ ఒప్పుకున్నాడు. అయితే న్యాయపరంగా తన తండ్రిపేరున ఉన్న భూమి వారసత్వంగా తనకు రావలసి ఉండగా, అధికారులు లంచం అడగడంతో మనోవేదనకు గురైన గోపాల్ ఏసీబీని ఆశ్రయించాడు. వారు పథకం ప్రకారం రూ.5 వేలు గోపాల్‌కు ఇచ్చి పంపించారు. అతడు తహసీల్దార్ మాధవికి ఇస్తుండగా ధరణి ఆపరేటర్ రాకేష్‌గౌడ్‌కి ఇవ్వాలని ఆమె సూచించారు. అనంతరం ఆపరేటర్ వద్దకి వెళ్లి రూ.5వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. తహసీల్దార్‌తో పాటు ధరణి ఆపరేటర్ రాకేష్‌గౌడ్‌పై కేసు నమోదు చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కి తరలిస్తామని ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.

'హశిష్' మత్తు మందు స్మగ్లర్ అరెస్టు

- 900 గ్రాముల మందు స్వాధీనం
- వీటి విలువ రూ.4.50 లక్షలు
- ఇలాంటి మత్తుపదార్థం పట్టుకోవడం ఇదే తొలిసారి : ఏసీపీ



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాం నాయక్, స్వాధీనపర్చుకున్న మత్తుమందు

మట్టెవాడ, మే 20: అతి ప్రమాదకరమైన హశిష్ మత్తుమందు స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర స్మగ్లర్ చింతల వెంకటరాజు అలియాస్ బాబిని అరెస్టు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. సోమవారం మట్టెవాడ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ కాకినాడ జిల్లా ఏలేశ్వరం ఎర్రవరంనకు చెందిన చింతల వెంకటరాజు అలియాస్ బాబి సోమవారం హంటర్‌రోడ్‌లోని 12 మోరీల ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందిందన్నారు. వెంటనే మట్టెవాడ పోలీసులు తెలంగాణ నార్కోటిక్ యాంటీ బ్యూరో అధికారులు అక్కడికి చేరుకుని వెంకటరాజును తనిఖీ చేయగా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న అతి ప్రమాదకరమైన నిషేధిత హశిష్ మత్తు పదార్థాన్ని గుర్తించి, స్వాధీన పర్చుకున్నారు. దీని విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుంది. నిందితుడు వెంకటరాజు ఆటో డ్రైవర్‌గా పని చేస్తూ జల్సాలకు డబ్బులు లేక పోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే లక్ష్యంతో గంజాయి ఆకు నుంచి తయారు చేసిన హశిష్ మత్తుమందును వివిధ మార్గాల్లో కొనుగోలు చేసి ఢిల్లీ, ముంబాయి, హైదరాబాద్ లాంటి ప్రధాన నగరాల్లో అవసరమైన వారికి సరఫరా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వరంగల్‌లో ఇలాంటి మత్తు పదార్థాన్ని పట్టుకోవడం ఇదే తొలిసారని ఏసీపీ వెల్లడించారు. సమావేశంలో తెలంగాణ నార్కోటిక్ యాంటిబ్యూరో ఇన్‌స్పెక్టర్ రాజేష్, మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి, మట్టెవాడ ఎస్ఐలు విఠల్, నవీన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రంజీ క్రీడలు ఆడేలా స్టేడియం ఏర్పాటు

- హెచ్‌సీఏ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు
- త్వరలో హైదరాబాద్‌లో టీ 20 టోర్నీ
- ముగిసిన వేసవి క్రికెట్ క్రీడా శిబిరం

వరంగల్ స్పోర్ట్స్, మే 20 : వరంగల్ నగరంలో రంజీ క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహించే విధంగా అత్యాధునిక హంగులతో స్టేడియాన్ని నిర్మించేందుకు కృషి చేస్తానని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్‌రావు హామీ ఇచ్చారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 నుంచి ములుగు రోడ్డు సమీపంలోని ఎల్బీ కళాశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రికెట్ క్రీడా శిక్షణ శిబిరం సోమవా రం ముగిసింది. ఈ కార్యక్రమానికి జగన్‌మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వరంగల్ నగరంలో రంజీ మ్యాచ్‌లు నిర్వహించే విధంగా ఉండే క్రికెట్ స్టేడియాన్ని నిర్మించేందుకు త్వరలోనే అపెక్స్ కౌన్సిల్‌లో చర్చిస్తామన్నారు. మరికొన్ని రోజుల్లోనే హైదరాబాద్ వేదికగా టీ-20 క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయనున్నట్లు ఆయన తెలిపారు. టీ 20మ్యాచ్‌లో ప్రతీ జిల్లా నుంచి ఒక జట్టు ఆడేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. టోర్నీ ఫైనల్ మ్యాచ్ హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా నిర్వహించిన వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో సుమారు 3500 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందన్నారు. క్రికెట్ శిక్షణ శిబిరాల నిర్వాహణ కోసం రూ.కోటి 50 లక్షలు వెచ్చించామన్నారు. క్రికెట్ పట్టణాలకు పరిమితం కాకుండా రూరల్, మండల స్థాయిలో విస్తరింప జేయడానికి క్రికెట్ శిక్షణ శిబిరాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లను ప్రజలు ఎంతో ఆహ్లాదంగా ప్రత్యేక్షంగా, పరోక్షంగా వీక్షిస్తూ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అండర్-14, 16, 19, 23 విభాగాల్లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ముందు ముందు హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో నిర్వహించబోయే అంతర్జాతీయ స్థాయి మ్యాచ్‌లను తిలకించే విధంగా రవాణా, భోజన, ప్రవేశ రుసుము లేకుండా ఏర్పాట్లు చేస్తామన్నారు.

ప్రతి జిల్లా జిల్లా కేంద్రంలో మినీ క్రికెట్ స్టేడియాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. వేసవి సమయం లోనే కాకుండా సంవత్సర కాలంలో 11 నెలల పాటుగా జిల్లా కేంద్రాల్లో నిత్యం క్రికెట్ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసే విధంగా సహకరిస్తామన్నారు. 25 యేండ్ల క్రితం హైదరాబాద్‌లో నిర్మించిన ఉప్పల్ స్టేడియం మినహాయించి

మిగతా 6వ పేజీలో..



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రావు

°C
సోమవారం ఉష్ణోగ్రత
గరిష్ఠం : 33.0°C
కనిష్ఠం : 27.0°C

జర్నలిస్టులకు క్రీడా పోటీలు

వడ్డెపల్లి, మే 20: గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్‌లో సభ్యులైన జర్నలిస్టులకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బోళ్ల అమర్ ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలపై ఆసక్తి ఉన్న జర్నలిస్టులు ఈ నెల 21 నుంచి 24 వరకు ప్రెస్‌క్లబ్‌కు నేరుగా వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

బాలికలపై వివక్ష వీడాలి

డీఎంహెచ్‌వో సాంబశివరావు

వరంగల్ మెడికల్, మే 20 : బాలికల పై వివక్ష వీడాలని హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు అన్నారు. సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లాస్థాయి అడ్వయిజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ, ఎంటీపీ చట్టం, ఇతర ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి అవగాహన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. గర్భిణులు పరీక్ష నిమిత్తం, లింగ నిర్ధారణ కోసం, అబార్షన్ కోసం అర్హత లేని వైద్యుల వద్దకు వెళ్లి తమ ప్రాణాలను ప్రమాదం కొని తెచ్చుకోవద్దని విజ్ఞప్తి చేశారు. స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు చట్టం నియమాలకు లోబడి పరీక్షలు నిర్వహించాలని, ఎవరైనా అప్పటికే అమ్మాయిలు కలిగి ఉండి తిరిగి పుట్టబోయే బిడ్డ ఆగ, మగ తెలుసుకోవడానికి వస్తే వారి వివరాలను తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. అడ్వయిజరీ కమిటీ సభ్యులు జిల్లాలో బాలికల నిష్పత్తి తక్కువగా ఉన్న మండలాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి క్షేత్రస్థాయి సిబ్బందితో తరచుగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలన్నారు. వీటితో పాటు ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు సైతం చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు, చట్టాన్ని ఉల్లంఘించిన వారి వివరాలను 104, 1098కు లేదా డయల్ 100కు సమాచారం అందజేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎమ్డీ యాకూబ్‌పాష, గైనకాలజిస్టులు డాక్టర్ ఉషారాణి, డాక్టర్ ఏ.నిరంజనదేవి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ మానస, జిల్లా మాస్ మీడియా అధికారి వి.అశోక్‌రెడ్డి, ఎఫ్‌ఎంఎం స్వచ్ఛంద సంస్థ నుంచి ఇ.శ్రీకాంత్, సర్వోదయ యూత్ కవిరాజ్, ప్రసన్న కుమార్, మాధవరెడ్డి, సందీప్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సాంబశివరావు

విధుల్లో చేర్చుకోవాలని అటెండర్ నిరసన


డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న అటెండర్ పార్వతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 20: తనను విధుల్లో చేర్చుకోవాలని మహిళా అటెండర్ పార్వతి మహబూబాబాద్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అటెండర్ పార్వతి మాట్లాడుతూ.. తాను 2017 నుంచి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం ఏప్రిల్ మాసంలో పాఠశాలల పనిదినాల ముగింపు వరకు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ తర్వాత రెండు రోజుల అనంతరం రెన్యువల్ చేసి మళ్లీ విధుల్లోకి తీసుకుంటారని పేర్కొన్నారు. తాను 20 రోజులుగా విధులు నిర్వహిస్తున్నప్పటికి ఈ విద్యా సంవత్సరం తన విధులను రెన్యువల్ చేయలేదని వాపోయారు. కార్యాలయంలో తనతో ఎవరు మాట్లాడడం లేదని, తాను కిందనే కూర్చుంటున్నట్లు తెలిపారు. ఈ ఏడాది తనను రెన్యువల్ ఎందుకు చేయలేదని డీఈవోను అడిగినట్లు చెప్పారు. దీంతో సోమవారం డీఈవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసినట్లు చెప్పారు. తన పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని అటెండర్ పార్వతి వేడుకున్నారు. ఈ విషయంపై డీఈవో రామారావును వివరణ కోరగా... పార్వతి సరిగ్గా విధులు నిర్వహించక పోవడంతోనే ఈ సంవత్సరం రెన్యువల్ చేయలేదని పేర్కొన్నారు.

సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

ఏపీడీ శాంతకుమారి


మహబూబాబాద్ ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్న ఏపీడీ శాంతకుమారి

మహబూబాబాద్ రూరల్, మే 20 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని మహబూబాబాద్ ఈజీఎస్ ఏపీడీ శాంతకుమారి అన్నారు. మహబూబాబాద్‌లోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పంచాయతీ కార్యదర్శులు ఏడు రికార్డులను తప్పనిసరిగా మెయింటెనెన్స్ చేయాలన్నారు. హరితహారంలో నాటిన మొక్కలు కొన్ని గ్రామాల్లో ఎండిపోయాయని వాటి స్థానంలో తిరిగి నాటి రక్షించే బాధ్యత పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్ద తాగునీరు, టెంట్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి పనులపై సామాజిక తనిఖీ చేపట్టారు. మొదటి రోజు సింగారం, రెడ్యాల, సాదుతండాతో పాటు మరో ఆరు గ్రామాల సామాజిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.40వేల జరిమానాను పంచాయతీ కార్యదర్శులు, టీఏలు, ఎఫ్ఏలకు విధించినట్లు చెప్పారు. పీఆర్ ఏఈ రాజశేఖర్‌కు 41 గ్రామ పంచాయతీలు ఉండగా ఈజీఎస్ కింద 80 సీసీరోడ్లు మంజూరు కాగా, వాటి పనులకు సంబంధించిన రికార్డులను సామాజిక తనిఖీ బృందానికి 39 రికార్డులు మాత్రమే ఇచ్చారని, మిగతా 41 పనులకు సంబంధించిన రికార్డులు అందించకపోవడం గమనార్హం. కాగా, మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ చేస్తుండగా ఫ్యాన్ సౌకర్యం, తాగునీరు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. ఈ సామాజిక తనిఖీలో ఏపీవో రమేష్ రెడ్డి, ఎస్ఆర్‌పీలు కుమార్, నాగరాజు, పీఆర్ ఏఈ రాజశేఖర్, టీఏలు సంతోష్‌కుమార్, ఓంకార్, కిశోర్, నవీన్‌కుమార్, ఎఫ్ఏలు గాంధీ, నర్సయ్య, సుజాత, ఉమ, వీరన్న పాల్గొన్నారు.


ఉపాధి చట్టం రక్షణకై ప్రజాపోరాటం

మరిపెడ రూరల్, మే 20 : ఉపాధి హామీ పథకం రక్షణకై ప్రజాపోరాటం తప్పదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య అన్నారు. సోమవారం మండలంలోని బాల్ని ధర్మారంలో పుచ్చలపల్లి సుందరయ్య 39 వర్ధంతిని పురస్కరించుకొని ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలతో ఉపాధి కూలీల నోట్లో మట్టి పడిందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఉపాధి చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించి అనేక సవరణలు చేసి నిర్వీర్యం చేసిందన్నారు. ఉపాధి చట్టాన్ని రక్షించుకోవడం కోసం మే 31 జిల్లా వ్యాప్తంగా ధర్నాలు, నిరసనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాణాల రాజన్న, కుమ్మరికుంట్ల వెంకన్న, వెంకటరెడ్డి, గోపయ్య, పిచ్చయ్య, అర్జున్, నాగమణి, పిచ్చమ్మ, నరసింహా, బాల్యా నాయక్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వీరయ్య

'స్థానిక' సమరానికి సిద్ధం

మొదలైన పంచాయతీ ఎన్నికల సన్నద్ధత



- ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ
- మూడు విడతలుగా పోలింగ్
- ఉమ్మడి జిల్లాలో 1688 గ్రామపంచాయతీలు
- బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు
- 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం
- ప్రతీ కేంద్రంలో రెండేసి బ్యాలెట్ బాక్సులు

హనుమకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికలు పూర్తికావస్తుండడంతో అధికార యాంత్రాంగం పంచాయతీ ఎన్నికలపై దృష్టి సారించింది. తాజాగా పంచాయతీ ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు చాలినన్ని సమకూర్చుకోవాల్సిందిగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. పదవీకాలం ముగిసే పంచాయతీలతో పాటు ఎన్నికలు జరగని, కొత్తగా ఏర్పాటైన పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసే దిశగా అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. జూన్ 4వ తేదీన లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ ప్రక్రియ అయిపోగానే లోకసభ ఎన్నికల ఘట్టం ముగిసిపోతుంది. ఆ వెంటనే ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల సందడి మొదలు కానున్నది.

బ్యాలెట్ బాక్సులు

పంచాయతీ ఎన్నికల్లో ఈవీఎంలు కాకుండా బ్యాలెట్ బాక్సులను వినియోగించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో అభ్యర్థులు ఎక్కువగా ఉంటారు. అంతమందికి ప్రస్తుతం ఉన్న ఈవీఎంలు సరిపోవు. పైగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా పార్టీ గుర్తులు ఉండవు. అందుకనే పంచాయతీ ఎన్నికల్లో మొదటి నుంచి బ్యాలెట్ బాక్సులనే ఉపయోగిస్తున్నారు. ఈ దృష్ట్యా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ప్రస్తుతం ఎన్ని బ్యాలెట్ బాక్సులు ఉన్నాయి? ఇంకా అదనంగా ఎన్ని బాక్సులు అవసరమవుతాయి? ప్రస్తుతం ఉన్న బ్యాలెట్ బాక్సుల్లో సక్రమంగా ఉన్నవి ఎన్ని? వీటిలో మరమ్మత్తు చేయాల్సినవి ఎన్ని? తదితర వివరాలు పంపాల్సిందిగా ఉన్నతాధికారులు జిల్లా పంచాయతీ అధికారులను కోరారు.అలాగే పోలింగ్ సిబ్బందికి ఆర్‌వో బుక్‌లు ఏ మేరకు అవసరం అవుతాయో కూడా వివరాలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఆర్‌వో బుక్‌లు సైతం ఎక్కువ సంఖ్యలోనే అవసరమవుతాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. దీంతో ఆరు జిల్లాల డీపీవోలు గతంలోనే ఈ వివరాలను పంపినప్పటికీ తాజాగా మరో సారి సమాచారాన్ని సేకరించి పంపే పనిలో ఉన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బ్యాలెట్ బాక్సులు సరిపడ ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాల్లో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1688 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 2018లో ఉమ్మడి జిల్లాలో 1060 పంచాయతీలు మాత్రమే ఉండేవి. కేసీఆర్ ప్రభుత్వం 500జనాభా కన్నా మించి ఉన్న తండాలను కూడా పంచాయతీలుగా మార్చడంతో వాటి సంఖ్య 1688కి పెరిగింది. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో 208, వరంగల్ జిల్లాలో 323, జనగామ జిల్లాలో 281, మహబూబాబాద్ జిల్లాలో 461, ములుగు జిల్లాలో 174, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 241 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ మొత్తం 1688 పంచాయతీల్లో 83 మేజర్ గ్రామ పంచాయతీలు. హనుమకొండ, వరంగల్ జిల్లాల పునర్విభజన ఫలితంగా వాటి పరిధిలో అంతకు ముందున్న గ్రామ పంచాయతీల సంఖ్యలో మార్పులు జరిగాయి. హనుమకొండ జిల్లాలో పెరగ్గా వరంగల్ జిల్లాలో తగ్గాయి.

లోక్‌సభ ఎన్నికలతో ఆలస్యం

కిందటిసారి పంచాయతీ ఎన్నికలు 2019 జనవరిలో మూడు దశల్లో జరిగాయి. అన్ని పంచాయతీల్లో ఫిబ్రవరి 1 నాటికి సర్పంచ్‌తో సహా కార్యవర్గాలు కొలువు తీరాయి. వీరి పదవీ కాలం 2024 ఫిబ్రవరి 2తో ముగియడంతో ఆ వెంటనే ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. వాస్తవానికి జనవరిలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేయాల్సి ఉన్నా ఉద్యోగుల వివరాలు సేకరణతోనే సరిపెట్టారు. లోక్‌సభ ఎన్నికలు దగ్గరపడడంతో వాటిపై దృష్టి సారించి పంచాయతీ ఎన్నికల ఏర్పాట్లను తాత్కాలికంగా పక్కనపెట్టారు. నిజానికి పంచాయతీల పాలకవర్గం పదవీ కాలం ముగియడానికి మూడు నెలల ముందుగానే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాల్సి ఉంటుంది. అయితే అసెంబ్లీ, ఆతర్వాత లోక్‌సభ ఎన్నికల కారణంగా ఆలస్యమైంది. అసెంబ్లీ ఎన్నికలు పూర్తి అయి కొత్త శాసన సభ కొలు వుదీరిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు పంచాయతీ ఎన్నికలకు కసరత్తు మొదలు పెట్టింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ అధికారుల నియామకం, ఎన్నికల విధుల్లో పాల్గొననున్న సిబ్బందికి శిక్షణ ఇవ్వడం తదితర కార్యక్రమాలను ప్రారంభించాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం సూచించింది. రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఎం.అశోక్ కుమార్ గత సంవత్సరం డిసెంబర్ 4వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారు.

మూడు విడతలుగా..

పంచాయతీ ఎన్నికలను మూడు విడతలుగా నిర్వహించనున్నారు. ఒక్కో రెవెన్యూ డివిజన్‌లో ఒక విడతలో ఎన్నికలు ఉండనున్నాయి. 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. 200 మంది ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, ఒక పోలింగ్ ఆఫీసర్, 201 నుంచి 400 ఓటర్లు ఉండే పోలింగ్ కేంద్రాల్లో ఒక ప్రిసైడింగ్ అధికారులు, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 650 మంది ఓటర్లు ఉండే కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు పోలింగ్ ఆఫీసర్లు విధులు నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు ఏడు వేల మంది సిబ్బంది అవసరం ఉండవచ్చునని అంచనా. ఉమ్మడి జిల్లాలోని సర్పంచులు, ఉపసర్పంచుల వివరాలను ఇది వరకే పంపించారు. తాజాగా ఎన్నికల నిర్వహణకు సిబ్బంది వివరాలు పంపించాలని ఆదేశాలు వచ్చాయి. ఇటీవల శాసన సభ ఎన్నికల్లో పాల్గొన్న సిబ్బంది వివరాలు అందుబాటులో ఉండడటంతో వాటిని టి-పోల్ వెబ్ సైట్‌లో నమోదు చేసే పనిలో ఉన్నారు. త్వరలో వారికి పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నారు. ఉద్యోగుల సంఖ్య సరిపోని పరిస్థితి ఉండడంతో ప్రభుత్వ రంగ సంస్థలు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాలు, ఏయిడెడ్ పాఠశాలలు, ఇతర సంస్థల సిబ్బందికి విధులు కేటాయించనున్నారు. ప్రతీ వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఉంటుంది. ప్రతీ కేంద్రంలో ఒక బ్యాలెట్ బాక్సు వార్డు సభ్యుడి ఎంపికకు, మరో బాక్స్ సర్పంచ్ ఎన్నికకు ఏర్పాటు చేస్తారు. ఇదే లెక్కలు సరి చూసి బ్యాలెట్ బాక్సులను అధికారులు అంచనా వేస్తున్నారు.

బ్యాలెట్ పద్ధతిలో....

ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీలతో పాటు పాతపంచాయతీలకు ఎన్నికలన్నిటికి ఎన్నికలు నిర్వహిస్తారు. భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం గోరికొత్తపల్లిని ఇటీవలే గ్రామపంచాయతీగా మార్చారు. దీనికి మొదటిసారి ఎన్నికలు జరుగనున్నాయి. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరుపుతారు. పంచాయతీ ఎన్నికల బ్యాలెట్ పత్రాల్లోనూ నోటా గుర్తు ఉంటుంది. ఎప్పటిలాగే ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఉప సర్పంచ్‌లను చేతులు ఎత్తడం ద్వారా పాత పద్ధతిలోనే ఎన్నుకుంటారు. ఏదైనా కారణంతో ఉప సర్పంచ్ ఎన్నిక అదే రోజు సాధ్యం కాకపోతే మరుసటి రోజు నిర్వహిస్తారు. 2019లో జనవరి 21, 25,30 తేదీల్లో పంచాయతీ ఎన్నికల పోలింగ్ జరిగింది. నాడు కొత్త సంవత్సరం తొలి రోజునే ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయింది.

గుర్తులపై కాకుండా...

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1688 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ ఎన్నికల్లో పార్టీ గుర్తులపై పోటీ ఉండదు.

ప్రధాన పార్టీల మద్దతుదారులు పోటీ చేస్తా రు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇది వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే అధిక సంఖ్యలో సర్పంచులుగా ఉన్నారు. ఈ సారి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో పంచా యతీ ఎన్నికల పోరు ఆసక్తిగా మారనున్నది.

రిజర్వేషన్లు

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లు మారతాయా? లేక పాత రిజర్వేషన్లనే కొనసాగిస్తారా? అనే సందిగ్ధత నెలకొంది. నిజానికి పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లనే యాధాతథంగా కొనసాగాలి. కానీ కొత్త ప్రభుత్వం చట్ట సవరణ చేస్తే రిజర్వేషన్లు మారవచ్చు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామ కార్యదర్శులు ఇప్పటికే సర్పంచ్, వార్డు మెంబర్లకు సంబంధించిన రిజర్వేషన్లపై వివరాలు పంపించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషను పదేళ్లకు వర్తించేలా రాష్ట్ర ప్రభుత్వం 2019లో చట్టం చేసింది. ఈ నేపథ్యంలో కిందటి సారి రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉంది. ఒక వేళ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రిజర్వేషన్లను మార్చాలని నిర్ణయం తీసుకుంటే అధికారులు నిర్ణీత సమయంలో కొత్త రిజర్వేషన్లకు సంబంధించిన వివరాలు అందిస్తే తప్ప రిజర్వేషన్లు మారే అవకాశం లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

భద్రత చెక్కు అందించిన సీపీ



చెక్కు అందిస్తున్న కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, మే 20 : అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుంచి మంజూరైన చెక్కును వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అందచేశారు. ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న పుట్టా మధు గత ఫిబ్రవరి 3న అనారోగ్యంతో మరణించాడు. తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా మరణించిన కానిస్టేబుల్ కుటుంబానికి రూ.7 లక్షల 89 వేలు మంజూరు చేయడం జరిగింది. చెక్కును సోమవారం కాని స్టేబుల్ సతీమణికి కమిషనర్ అందచేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ రవి, పరిపాలనాధికారి రామకృష్ణ, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి శోభన్ పాల్గొ న్నారు.

మాటలు రాని పిల్లల కోసం యాప్

వరంగల్ మెడికల్, మే 20 : మాటలు సరిగా రాని పిల్లల కోసం నిట్ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కేవీ కాదంబరి ఆధ్వర్యంలో ఒక ప్రాథమిక మొబైల్ అప్లికేషన్ (యాప్) తయారు చేశారు. ఎంజీఎం డీఈఐసీ సెంటర్‌కు వచ్చే పిల్లల కోసం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ ఈ యాప్ వల్ల పిల్లలకు పదజాలం పెంపొందించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రకాశ్, నిట్ విద్యార్థులు ఆదర్శ్‌రావు, సయ్యద్ ఫర్హాన్ నిజాముద్దిన్, వనజ, స్పీచ్ థెరపిస్టు డాక్టర్ మంజుల నాయక్, అనిల్, ప్రశాంత్, అమూల్య, రమేశ్, సంపత్ కుమార్, మాధవిపాల్గొన్నారు.

నేడు డాక్టర్ రేవూరికి సహృదయ పురస్కారం

హనుమకొండ కల్చరల్, మే 20 : నగరంలోని సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం వడ్డెపల్లిలోని పీఆర్ రెడ్డి ఫంక్షన్ హాలులో నిర్వహించే కార్యక్రమంలో ప్రసారభారతి అదనపు డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ రేవూరి అనంత పద్మనాభరావుకు సహృదయ ప్రత్యేక పురస్కారాన్ని అందజేస్తున్నట్లు అధ్యక్షులు గిరిజా మనోహర్‌బాబు చెప్పారు. సహృదయ వ్యవస్థాపక సభ్యులు స్వర్గీయ రాళ్లబండి కవితా ప్రసాద్ పేరిట ప్రతియేటా ఒక ప్రముఖ అధికార గణానికి అందజేస్తున్న సహృదయ అనుబంధ స్మారక పురస్కారాన్ని ఈసారి అనంత పద్మనాభరావుకు అందజేస్తున్నామన్నారు. భారత చరిత్ర పరిశోధన పరిషత్ పూర్వ అధ్యక్షులు ఎల్లాప్రగడ సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని ఆయన చెప్పారు.

జాతీయ రహదారి రక్తసిక్తం

రెండు ప్రమాదాల్లో ఒకరి మృతి, మరో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ వెంకటేశ్



లారీని ఢీకొని ధ్వంసమైన కారు

కాటారం, మే 20: భూపాలపల్లి కాటారం మండలంలోని మేడిపల్లి అటవీ ప్రాంతంలో జాతీయ రహదారి-353 (సీ) రక్తసిక్తమైంది. ఆదివారం రాత్రి, సోమవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం..

భూపాలపల్లి కృష్ణకాలనీకి చెందిన సింగరేణి ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కోదాది శ్యామ్‌కుమార్(30), ఠాకూర్ పృథ్వీ ఆదివారం రాత్రి తమ స్నేహితుడిని బైక్‌పై ఎక్కించుకొని మండలంలోని బయ్యారంలో అతడి ఇంటి వద్ద డ్రాప్ చేశారు. తిరిగి వస్తున్న క్రమంలో జాతీయ రహదారిలోని కమలాపూర్ క్రాస్ సమీపంలో మేడిపల్లి అటవీ ప్రాంతంలో బైక్ నడుపుతున్న పృథ్వీ రోడ్డు పక్కనున్న చెట్టును ఢీకొన్నాడు. దీంతో వెనుక కూర్చున్న శ్యామ్ కుమార్ ఎగిరి భూపాలపల్లి నుంచి కాళేశ్వరం వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం కింద పడ్డాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పృథ్వీ రోడ్డుపై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని పోలీసులు 108 అంబులెన్స్‌లో వంద పడకల ఆస్పత్రికి తరలించారు. మృతుడు శ్యామ్‌కుమార్‌కు భార్య దివ్య పాప, బాబు ఉన్నారు.

మేడిపల్లి అటవీప్రాంతంలోనే సోమవారం మరో రోడ్డు ప్రమాదం జరిగింది. భూపాలపల్లి నుంచి చిన్నతూండ్లకు వెళ్తున్న వెంకటేశ్ బైక్‌ను వేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న కారుకు డ్యాష్ ఇచ్చి మరో కారును ఢీకొట్టాడు. దీంతో రెండో కారులో ఎయిర్ బెలూన్లు ఓపెన్ కావడంతో డ్రైవర్‌కు ఏమీ కనిపించక ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. ఈ ప్రమాదఘటనలో బైక్ నడుపుతున్న వెంకటేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. రెండు కార్లు ధ్వంసమైనప్పటికీ ఎవరికీ ఏమీ కాలేదు. సంఘటన స్థలానికి ఎస్సై అభినవ్ చేరుకొని క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. ధ్వంసమై రోడ్డుపై ఉన్నవాహనాలను పక్కకు తొలగింపజేశారు. రెండు ప్రమాద సంఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



దివి నుంచి భువికి..!

తెల్లని మబ్బుల కనువిందు- బయ్యారం పెద్దగుట్ట ప్రాంతంలో ఆవిష్కృతం

ఆకాశంలో తేలాడే తెల్లని మబ్బులు కాసేపు దివి నుంచి భువికి చేరినట్టుగా కనువిందు చేశాయి. ఆకాశం మేఘావృతం కాగా తెల్లని మబ్బులు భూమిని తాకుతున్నట్లు కనిపించాయి. ఈ దృశ్యం మహబూబాబాద్ జిల్లా బయ్యారం పెద్ద గుట్ట ప్రాంతంలో సోమవారం మిట్ట మధ్యాహ్నం ఆవిష్కృతమైంది. పెద్ద గుట్టను తాకినట్లు కనిపిస్తున్న ఈ తెల్లని మబ్బు దృశ్యాలను పలువురు ఔత్సాహికులు తమ స్మార్ట్ ఫోన్లలో బంధించారు.

- బయ్యారం

నేడు నవీన్ 'అనురాగదీపం' నవలావిష్కరణ



హనుమకొండ కల్చరల్, మే 20 : చారిత్రక ఓరుగల్లుకు నవలా సాహిత్యంలో కేంద్ర సాహిత్య పురస్కారాన్ని సంపాదించిపెట్టిన ప్రముఖ నవలా రచయిత డాక్టర్ అంపశయ్య నవీన్ కలం నుంచి జాలువారిన 35వ నవలా అనురాగదీపం ఆవిష్కరణ మంగళవారం ఉదయం 10 గంటలకు హనుమకొండలోని పాపడం బ్లూలో నిర్వహిస్తున్నట్లు అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ కార్యదర్శి డి.స్వప్న, డాక్టర్ ఏ.రాజ్‌కుమార్ తెలిపారు. గిరిజా మనోహర్‌బాబు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో గంటా రామిరెడ్డి గ్రంథాన్ని ఆవిష్కరిస్తారు. నెల్లుట్ల రమాదేవి నవీన్ నవలను పరిచయం చేస్తారు. అమ్మంగి వేణుగోపాల్, పట్టణం వాసు, ఏ.వరలక్ష్మీ తదితరులు వక్తలుగా పాల్గొంటారు.

డాక్టర్ నవీన్ తన భార్య అనసూయతో గడిపిన 60 ఏళ్ల దాంపత్య జీవితాన్ని చిత్రిస్తూ ఆయన రాసిన నవల అనురాగదీపం. తన అర్ధాంతి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమెతో ఎదురైన కష్టనష్టాలను మధుర క్షణాలను కలగలిపి తన కలంలో ఇంకుగా మార్చి రాసిన నవలే అనురాగదీపం. ఇప్పటి వరకు నవీన్ రాసిన 34 నవలలు ఒక ఎత్తు అయితే తన జీవితాన్ని అనురాగ దీపంతో తేజోమయం చేసిన అర్ధాంతి అనసూయ ఎడబాటును తట్టుకోలేక మదనపడుతూ ఆవేదన చెందుతూ కన్నీళ్లతో హృదయాన్ని చీల్చుకొని వచ్చిన ఈ నవల ఒక ప్రత్యేకంగా విగలనుంది. ఈ నవలలో నవీన్ స్వగ్రామం వావిలాలలో వ్యవసాయ కుటుంబ నేపథ్యంలో తన సతీమణి అనసూయ పుట్టిన సూర్యాపేట పరిసర మద్దిరాల గ్రామ వాతావరణ నేపథ్యంలో ఆనాటి భూస్వామ్య కుటుంబ నేపథ్యం అప్పటి పరిస్థితులను అద్భుతంగా చిత్రీకరించారు.

మేలిమి మీనా..

ఎల్లూరు రంగంపేట చెరువులో వలకు చిక్కిన వింత చేప



సంగెం, మే 20: వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఎల్గూరు రంగంపేట గ్రామంలోని చెరువులో మత్స్యకారులకు వింత చేప లభ్యమైంది. సోమవారం చెరువులో మత్స్యకారుడు బోనాల మహేందర్ చేపల వల కు ఇది చిక్కింది. బంగారం రంగులో ఉండి, ఒంటిపై చిన్న చిన్న చారలు ఉండి వింత గోలిపేలా ఉంది. అరకిలో మేర బరువు ఉండటంతో మత్స్యకారులు, గ్రామస్థులు వింతగా తిలకించారు. గతంలో ఇలాంటి చేపను ఎప్పుడూ చూడలేదన్నారు.

రుణమాఫీపై కసరత్తు


- సీఎం ప్రకటనతో బ్యాంకు అధికారుల అప్రమత్తం
- ఆగస్టు 15కు అందించేలా లెక్కలు తీస్తున్న సిబ్బంది
- జిల్లాలో రూ.800 కోట్ల మేరకు మాఫీకి అవకాశం
- లబ్ధిపొందనున్న సుమారు 85వేల మంది రైతులు
- మ్యాపింగ్ తర్వాతే మాఫీపై స్పష్టత
- మార్గదర్శకాలతో కోసం ఎదురుచూస్తున్న బ్యాంకులు

హనుమకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఏదేమైనా ఆగస్టు 15వ తేదీలోపు రూ.2లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేసి తీరుతామని లోకసభ ఎన్నికల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో బ్యాంకుల అధికారులు అప్రమత్తమయ్యారు. ఆ సమయంలోపు రుణమాఫీకి సంబంధించిన లెక్కలను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. రైతుల రుణబకాయిలు ఏ మేరకు ఉన్నాయి? వారిలో రూ.2లక్షలలోపు రుణమాఫీకి ఎంతమంది అర్హులు అనేది తేల్చేందుకు రికార్డులను పరిశీలించే పనిలోపడ్డారు. హనుమకొండ జిల్లాలో లక్షా 10వేల మంది రైతులు ఉండగా, వీరిలో సుమారు 85వేల మంది రుణమాఫీ ద్వారా లబ్ధిపొందే అవకాశం ఉంది. ఈ క్రమంలో సుమారు రూ.800కోట్ల మేరకు రుణమాఫీ జరగవచ్చునని అంచనా వేస్తున్నారు.

మార్గదర్శకాలు ఏవీ?

రుణమాఫీ ఎప్పటిలోగా రుణాలు తీసుకున్నవారికి వర్తిస్తుందనేదికి సంబంధించి కటాఫ్ వివరాలు సూత్రప్రాయంగా వెల్లడయ్యాయి. కానీ అధికారికంగా ఇంకా ప్రకటించాల్సి ఉంది. రుణ మాఫీ ప్రక్రియ విధివిధానాలు, మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం జారీ చేయాల్సి ఉన్నది. కొత్త ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాల్లో ఏ మేరకు మార్పులు, చేర్పులు ఉంటాయి? రుణమాఫీకి సంబంధించి అనుసరించే విధివిధానాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వంకన్నా భిన్నంగా ఉంటాయనేది తెలియాల్సి ఉంది. బ్యాంకు అధికారులు వీటి కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం జారీ చేసే మార్గదర్శకాలను బట్టి వారు రుణమాఫీ ఏర్పాట్లు చేస్తారు. రుణమాఫీని కుటుంబంలో ఒక రైతుకే పరిమితం చేస్తారా? లేదా ఎంతమంది తీసుకుంటే అంత మందికి మాఫీ వర్తిస్తుందా? అనేదానిపై స్పష్టత రావలసిఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతులకు ఇచ్చిన రూ. 2 లక్షల రుణ మాఫీ ముఖ్యమైంది. ఈ హామీపై చాలామంది రైతులు ఆశలు పెట్టుకున్నారు. రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని ఇచ్చిన హామీ పట్ల అన్నదాతల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

కటాఫ్ తేదీలు



2019 ఏప్రిల్ 1 నుంచి 2023 డిసెంబర్ 10 మధ్య రూ.2లక్షలలోపు రుణాలు తీసుకున్న, రెన్యూవల్ చేసుకున్న రైతులకు మాఫీ వర్తిస్తుందని గతంలో ప్రభుత్వం సూత్రప్రాయంగా ప్రకటించింది. దీని ప్రకారం అర్హులైన వారి జాబితా పంపాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసీఎస్), ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు (ఏపీజీవీబీ)లను రాష్ట్ర అధికారులు ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ బ్యాంకులే పెద్దఎత్తున పంట రుణాలను మంజూరు చేశాయి. కొన్ని వాణిజ్య బ్యాంకులు కూడా జిల్లా రుణ వార్షిక ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యం మేరకు రైతులకు పంట రుణాలు ఇచ్చాయి. జిల్లా వార్షిక రుణ ప్రణాళికలో నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం 2023లో వివిధ బ్యాంకులు రూ.1600కోట్ల మేరకు రుణవితరణ చేశాయి. ఇందుల్లో కనీసం 50 శాతం మంది రైతులైన అర్హత సాధించే అవకాశం ఉంది. ఆ లెక్కన రూ.800కోట్ల మేరకు రుణమాఫీ జరగవచ్చునని భావిస్తున్నారు. పంట రుణాలు తీసుకున్నారు. వీరిలో 80శాతం మంది సన్న, చిన్నకారు రైతులే. రుణాలు తీసుకున్న రైతుల జాబితా తయారు చేయాల్సిందిగా ఒకటీ రెండు రోజుల్లో ఆదేశాలు రానున్నట్టు సమాచారం.

గతంలో..

గత ప్రభుత్వం రైతులకు నాలుగేళ్లలో దశల వారీగా రుణమాఫీ వర్తింపజేసింది. రూ.25వేలు, రూ.50వేలు, ఆ తర్వాత లక్షలోపు రుణాలు మాఫీ చేసింది. వివిధ కారణాల వల్ల సుమారు 30వేల మంది రైతులకు ఇంకా రుణ మాఫీ జరగలేదు. రుణాలను సకాలంలో రెన్యూవల్ చేయించుకోని వారికి మాఫీ జరగలేదు. కొత్త ప్రభుత్వం ప్రకటించే కటాఫ్ తేదీల్లో వీరికి చోటు దక్కుతుందా లేదా తెలియదు. అసలు కాంగ్రెస్ సర్కారు తాజాగా ప్రకటించబోయే కటాఫ్ తేదీ పరిధిలోకి ఎంత మంది రైతులు వస్తారనేది కూడా అస్పష్టంగానే ఉంది. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి రైతులు సహకార సంఘాల్లో ఎక్కువగా ఉన్నారు. కుటుంబ అవసరాల కోసం భూములు అమ్ముకున్నవారు, పిల్లల పెళ్లిళ్ల అనంతరం హక్కులు బదాలాయించిన వారిలో ఎవరైనా కటాఫ్ తేదీల మధ్య రుణాలు చెల్లిస్తే వారికి రుణ మాఫీ వర్తిస్తుంది. ఇతర అవసరాలకు అప్పులు చెల్లించి పట్టా పుస్తకాలు, డాక్యుమెంట్లు తీసుకున్నవారు చాలామంది ఉన్నారు.

మ్యాపింగ్

రుణాలు తీసుకున్న రైతుల మ్యాపింగ్ చేయాల్సి ఉంది. ఈ దిశగా కూడా అధికారులు దృష్టి సారించారు. వాస్తవానికి ఈ పని గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే జరగాల్సి ఉండింది. కానీ అప్పటి ప్రభుత్వం నుంచి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ కావడంతో అధికారులు ఈ ప్రక్రియ జోలికి వెళ్లలేదు. రూ.50వేలు, రూ.లక్ష, రూ.2లక్షలలోపు ఇలా తమ అవసరాల మేరకు రైతులు రుణాలు తీసుకున్నారు. గత ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేసింది. వీరంతా ఒక కేటగిరి. తనపేరుమీదనే కాకుండా తన భార్య పేరు మీద రుణాలు తీసుకున్న రైతులు ఉన్నారు. ఇటువంటి రుణాలకు సంబంధించిన ఫ్యామిలీ గ్రూపింగ్ సరిగా కాలేదు. ఇంటువంటి వారికి గతంలో రుణమాఫీ జరగలేదు. కొందరు రైతులు రెండు చోట్ల పంట రుణాలు తీసుకున్నారు. ఇటువంటి మల్టిపుల్ బ్యాంకు రుణాల మాఫీ సైతం ఆగింది. దీనిని కూడా మ్యాపింగ్ చేయాల్సి ఉంది. ఆధార్‌కార్డు మిస్ మ్యాచింగ్ అయి రుణాలు మాఫీ కాని రైతులు కూడా ఉన్నారు. ఈ కేటగిరి కింది రైతులను సైతం మ్యాపింగ్ చేయాల్సి ఉన్నది. మ్యాపింగ్ ప్రక్రియను చేపట్టేందుకు బ్యాంకు అధికారులు పూనుకున్నప్పటికీ ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు రావడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అది కుంటుపడింది. మరో బ్యాంకులో ఎక్కువ రుణం తీసుకోవడానికి నో డ్యూస్ సర్టిఫికెట్ అవసరం ఉండడంతో ఇంతకు ముందు బ్యాంకులో తీసుకున్న రుణాన్ని చెల్లించి ఖాతాలను మూసేసుకున్న రైతులు కూడా కొందరు ఉన్నారు. వీరికి కూడా గతంలో రుణమాఫీ జరగలేదు. వీరికి కూడా రుణమాఫీ చేస్తామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది కానీ ఆచరణలోకి రాలేదు. ప్రస్తుతం రుణమాఫీ అర్హత కిందకు రైతులు రావడానికి ఇలాంటి ఖాతాలను కూడా గుర్తించి వాటిని మ్యాపింగ్ చేయాల్సి ఉన్నది. వివిధ కేటగిరీల కింద పంట రుణాలు తీసుకున్న రైతుల మ్యాపింగ్ లేకపోవడంవల్ల రుణమాఫీపై స్పష్టత లేకుండా పోయింది. ఎంత మంది రైతులు ఏ కేటగిరీ కింది వచ్చేది స్పష్టమైతే వారికి రుణమాఫీ వర్తించే విషయంలో బ్యాంకులు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుంది. వీటిపై కూడా ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావలసి ఉంది.

మార్గదర్శకాలు రావాలి

శ్రీనివాసరావు, లీడ్ బ్యాంక్ మేనేజర్, హనుమకొండ జిల్లా

రూ2.లక్షల రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావలసి ఉంది. దీనితో పాటు రుణమాఫీకి కటాఫ్ తేదీని కూడా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఇది జరిగితేనే జిల్లాలో ఎంత మంది రైతులకు ఏ మేరకు రుణమాఫీ జరుగుతుందని కచ్చితంగా చెప్పడానికి వీలుకలుగుతుంది. జిల్లాలో పంట రుణాల కింద రూ.1600కోట్ల మేరకు వితరణ జరిగింది. ఇందులో సుమారు 50మంది రైతులు మాఫీకి అర్హత కలిగి ఉంటారు. ఆ లెక్కన దాదాపు రూ.800కోట్ల మేరకు రుణ మాఫీ జరిగే అవకాశం లేకపోలేదు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, మే 20: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా జరుగదని హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరస్వతి నగర్, సమ్మయ్య నగర్, కుడా కాలనీ, నయీంనగర్, లష్కర్ సింగారం, రాజాజీ నగర్, పోలీస్ హెడ్ క్వార్టర్స్, ఎక్సైజ్ కాలనీ, సుబేదారి పోలీసు స్టేషన్ ఏరియా, కేఎల్ఎన్ రెడ్డి కాలనీ, రెవెన్యూ కాలనీ, కాపువాడ, అలంకార్ సర్కిల్, కాకతీయ కాలనీ, విజయ డెయిరీ, ప్రగతి నగర్, రామకృష్ణ కాలనీ, నాగేంద్రనగర్, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు నక్కలగుట్ట మెయిన్‌రోడ్డు, స్విమ్మింగ్ పూల్, బాలసముద్రం, ఎల్ఐసీఆఫీస్, మాంగళ్య కాంప్లెక్స్, డెక్కన్ టవర్, రమేష్ స్కిన్ ఆస్పత్రి ఏరియాలో, ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు వడ్డెపల్లి ఫిల్టర్ బెడ్, హనుసారి కాలనీ, రైల్వే పంప్ హౌస్, అగ్రికల్చర్ బీపీఆర్ ఏరియాలో విద్యుత్ సరఫరా జరుగదని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని డీఈ సాంబరెడ్డి కోరారు.

పట్టభద్రుల పక్షాన నిలబడే వ్యక్తికి పట్టం కట్టండి



ఓటు అభ్యర్థిస్తున్న రావు పద్మ

హనుమకొండ టౌన్, మే 20: పట్టభద్రుల పక్షాన నిలబడే వ్యక్తికి పట్టం కట్టాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ కోరారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా సోమవారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ ఏస్ఈ, డీఈ కార్యాలయాల్లో అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి సతీమణి లక్ష్మీదేవితో కలిసి బీజేపీ శ్రేణులు ప్రచారం నిర్వహించారు. ఉద్యోగస్తులను కలుసుకొని ఈ నెల27న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రమ సంఖ్య 1పై మొదటి (1) ప్రాధాన్యత ఓటు వేసి ప్రేమేందర్‌రెడ్డికి అండగా నిలబడాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు పులి సరోత్తం రెడ్డి, కొలను సంతోష్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, యువమోర్చ జిల్లా అధ్యక్షుడు తీగల భరత్ గౌడ్, జిల్లా నాయకులు తోపుచర్ల మధుసూదన్‌రావు, నర్మెట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరం



రక్తదాతలకు సర్టిఫికెట్లను అందజేస్తున్న పెద్ది వెంకటనారాయణగౌడ్

సుబేదారి, మే 20: హనుమకొండ సుబేదారి క్రాస్ రోడ్డులోని రెడ్‌క్రాస్‌లో తలసేమియా బాధితుల కోసం వీవీఎస్.స్వామి నాయుడు జన్మదినాన్ని పురస్కరించుకొని చెన్నై సిల్క్స్ ఎంప్లాయీస్ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రెడ్ క్రాస్ సొసైటీ వైస్‌చైర్మన్ పెద్ది వెంకటనారాయణగౌడ్ శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇతరుల ప్రాణాలను కాపాడేందుకు తమ రక్తాన్ని దానం చేసిన రక్తదాతలను అభినందించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మహ్మద్ తహర్ మసూద్, పి. శేషకుమార్, కె. రాజేష్‌కుమార్, గాజుల రాఘవకృష్ణ, డి.నరేష్, ఎండి జమీల్ అహ్మద్, సతీష్, కరుణాకర్, రెడ్‌క్రాస్ సిబ్బంది శ్రీనివాస్, గుళ్లపల్లి శివకుమార్, పవన్, అనిల్, సునీత, రమేష్, పోశాలు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

రూ.37వేల నగదు, నాలుగు వాహనాలు స్వాధీనం

రాంనగర్, మే 20 :మడికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బట్టుపల్లి శివారు ప్రాంతంలో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. పలువురు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐలు దయాకర్, రవికుమార్‌ల ఆధ్వర్యంలో సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో రూ.37వేల 800 నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు నాలుగు టూవీలర్లు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించండి

మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య

ధర్మసాగర్, మే 20: వరంగల్ ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుడైన ఏనుగుల రాకేష్‌రెడ్డిని గెలిపించాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. వేలేరు మండల కేంద్రంలో సోమవారం నర్సింగరావు, ధర్మసాగర్ మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు రాజు అధ్యక్షతన నిర్వహించిన సన్నాహక సమావేశానికి రాజయ్య, నియోజకవర్గం కో ఆర్డినేటర్ రవిశంకర్ విచ్చేశారు. ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ ధర్మసాగర్ మండలంలో చట్టసభకి ప్రశ్నించే గొంతుకను పంపాలని ఓటర్లకు వివరించాలన్నారు. బూత్ ఇన్‌చార్జిలు కష్టపడి పనిచేస్తే 1704 ఓట్లు మొత్తానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికి పడేవిధంగా చేయాలని నాయకులకు సూచించారు. ఒక బూత్‌కు పది మంది ఇన్‌చార్జిల చొప్పున 30మందిని నియమించినట్టు ఆయన తెలిపారు. అదే విధంగా 25మంది ఓటర్లుకు ఒక ఇన్‌చార్జిని నియామించినట్టు తెలిపారు. అనంతరం నియోజకవర్గం కో ఆర్డినేటర్ సుంకె రవిశంకర్ మాట్లాడుతూ వేలేరు మండలంలో 80శాతం ఓట్లు బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థికే పడుతాయని నాయకులు చెప్పాడం జరిగిందన్నారు. ఇక ధర్మసాగర్ మండలం నుంచి అధికంగా మెజారిటీ వస్తుందని నమ్మకం ఉందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే ఎన్నికల్లో ధర్మసాగర్ మండలం నుంచి పెద్ద ఎత్తున మెజారిటీ ఇవ్వడం జరిగిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో మెజారిటీ ఇస్తారని నమ్మకం ఉందన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ నాయకులు సోమయ్య (55)కు పార్టీ పరంగా మంజూరైన రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును రాజయ్య చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రభుదాస్, మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, ఎంపీటీసీ శోభ, జిల్లా కో ఆప్షన్ సభ్యురాలు జూబేదలాల్ తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

పెద్దల సభలో కొట్లాడే గొంతుకను గెలిపించండి

బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డి గెలుపు ఖాయం

మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



సమావేశంలో మాట్లాడుతున్న బాల్క సుమన్

రాంనగర్, మే 20 : పెద్దల సభలో కొట్లాడే గొంతుకను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ పిలుపిచ్చారు. సోమవారం హనుమకొండలోని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్‌వీ విద్యార్థి నాయకులు, పరిశోధక విద్యార్థులతో సన్నాహక సమావేశం జరిగింది. సమావేశానంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో బాల్క సుమన్ మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌వీ నాయకులు కీలక పాత్ర పోషించాలన్నారు. బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన రాకేష్‌రెడ్డి విద్యావంతుడు, లక్షల రూపాయల ఉద్యోగం వదిలి ప్రజలకు సేవచేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాడని తెలిపారు. ఆయన గెలుపు ఖాయమైందన్నారు. ఒక యూట్యూబ్ చానల్ పెట్టి పీడిత ప్రజల రక్తం తాగే తీన్మార్ మల్లన్న కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచారని ఆయన ఆరోపించారు. సంస్కార హీనుడు చట్టసభల్లోకి వెలితే ప్రమాదమన్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన, ప్రజల పక్షాన నిలబడి కొట్లాడే సత్తా కలిగిన రాకేష్‌రెడ్డిని ఎమ్మెల్సీ ఎన్నికలో గెలిపించాలన్నారు. రాకేష్‌రెడ్డిని గెలిపిస్తే ప్రభుత్వం మెడలువంచి నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాడని బాల్క సుమన్ తెలిపారు. విలేకర్ల సమావేశంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, బీఆర్ఎస్ నేతలు కె.ప్రభాకర్, పి.కొమురయ్య, దామోదర్, శరత్‌చంద్ర, సూర్య కిరణ్, రాజేష్‌నాయక్, అరూరి రంజిత్, బైరపాక ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో దీప్తి రికార్డు

- 400 మీటర్ల పరుగు పందెం పూర్తి చేసిన తొలి తెలుగు పారా అథ్లెట్
- పారా ఒలంపిక్స్ పోటీలకు అర్హత



జీవంజి దీప్తి



పరుగు పందెంలో పాల్గొన్న దీప్తి

వరంగల్ స్పోర్ట్స్, మే 20 : మెరుపు లాంటి వేగాన్ని ప్రదర్శిస్తూ, ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తూ, చిరుతలా పరుగులు పెడుతూ వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో 400 మీటర్ల పరుగు పందెంలో -55.07సెకన్లలో సునాయాసనంగా పూర్తి చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన తొలి తెలుగు పారా అథ్లెట్‌గా నిలిచింది జీవంజి దీప్తి. ఈ నెల 17నుంచి 25వరకు కోబ్ జపాన్ దేశంలోని యూనివేసియేడ్ మెమోరియల్ స్టేడియంలో కొనసాగనున్న వరల్డ్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో భారతదేశం తరుపున దీప్తీ పాల్గొని ప్రత్యర్థులను మట్టికరిపించి అతి తక్కువ సమయంలో రాణించి ప్రపంచ రికార్డును నెలకొల్పి చరిత్ర పుటల్లోకి చేరింది. పారా అథ్లెటిక్స్ ఉమెన్ టీ20 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో దీప్తీ -55. 07సెకన్లలో గమ్యాన్ని ముద్దాడి స్వర్ణ పతకం సాధించి ప్రపంచ రికార్డును తిరగరాసిన తొలి తెలుగు మహిళగా ఖ్యాతి గడించింది.

ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 9 వరకు ప్యారీస్ దేశంలో నిర్వహించనున్న పారా ఒలంపిక్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించిన ఘనత దీప్తికే దక్కింది. వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన దీప్తీ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ప్రపంచ రికార్డు నెలకొల్పి జిల్లా, రాష్ట్ర, దేశానికి కీర్తి, ప్రతిష్ఠలు తీసుకరావడంతో జిల్లాలోని అథ్లెట్లు, పారా స్పోర్ట్స్ ఆఫ్ ఇండియా బాధ్యులు, తెలంగాణ రాష్ట్ర పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్‌లు అభినందించారు.

ప్రశ్నించే గొంతుకకే పట్టం కట్టాలి

వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న బక్క జడ్సన్

వడ్డెపల్లి, మే 20 : ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగ, పెన్షనర్ల, ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతకనైన తనకే ఎమ్మెల్సీగా పట్టం కట్టాలని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి బక్క జడ్సన్ అన్నారు. సోమవారం బాలసము ద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శాసనమండలికి జరుగుతున్న ఉప ఎన్నికల్లో నేనే గెలుస్తాననే అక్కసుతో అంతర్గత కుట్రతో సీఎం రేవంత్‌రెడ్డి ఒక పతకం ప్రకారం తనను కాంగ్రెస్‌పార్టీ నుంచి సస్పెండ్ చేశారని విమర్శించారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అవినీతి అక్రమాలపై నేను ఫిర్యాదు చేయడంతో రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ కళ్లు తెరువడాన్ని పట్టభద్రులు గమనించాలని అన్నారు. వరంగల్ సెంట్రల్ జైలు కుంభ కోణం, ములుగు జిల్లా పర్యాటక శాఖలో జరిగిన సుమారు రూ. 100 కోట్ల అవినీతి అక్రమాలను కాగ్ నివేదికను తాను బయట పెట్టానని బక్క జడ్సన్ చెప్పారు.రాజకీయ పదవుల కోసం తాను ఏనాడు ఎదురు చూడలేదని చెప్పారు. చట్ట సభలలో న్యాయం కోసం పోరాడే గొంతుకగా ఉంటానని పేర్కొన్నారు. పోరాడే గొంతుకను బలపర్చాలని విజ్ఞులైన పట్టభద్రులను బక్క జడ్సన్ కోరారు.

ఖబరస్తాన్ సీసీ రోడ్డు ధ్వంసం

పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ముస్లింలు



ఖబరస్తాన్‌కు వెళ్లే సీసీ రోడ్డు ధ్వంసం అయిన దృశ్యం

భీమారం, మే 20: ఒకటో డివిజన్ పలివేల్పుల గ్రామంలోని ఖబరస్తాన్‌కు వెళ్లే సీసీ రోడ్డును రాత్రికి రాత్రే గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. పలివేల్పుల శివారులోని సర్వేనెంబరు 416లోని 5 గుంటల ప్రభుత్వభూమిని ఖబరస్తాన్‌కు ప్రభుత్వం కేటాయించింది. దానికి తోడు పక్కనే ఉన్న 415 సర్వేనెంబరులోని భూమి యజమాని మరో 3 గుంటల స్థలాన్ని దానం చేశారు. అయితే 8 గుంటల స్థలానికి గాను ముస్లిం ఖబరస్తాన్‌కు వెళ్లే మార్గం కోసం సుమారు రూ. 10 లక్షల జనరల్ ఫండ్‌తో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగింది. గతంలో కూడా ఈ స్థలం కబ్జాకు కాకుండా చూడాలని పలివేల్పుల ముస్లింలు అప్పటి ఎమ్మెల్యే అరూరి రమేశ్‌ను కోరడం కూడా జరిగింది. పలివేల్పులకు చెందిన మైనార్టీ నాయకుడు ఖాదార్‌బాబా, ముస్లింలు, స్థానిక కార్పొరేటర్ కలిసి కేయూ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు మాట్లాడుతూ రోడ్డు ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని కోరారు. అదేవిధంగా సీసీ రోడ్డు పునర్‌నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

కొలతల్లో తేడాలు ఉండొద్దు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న అధికారులు

వరంగల్ సిటీ, మే 20: తూనికలు, కొలుతలు సరిగ్గా ఉండేలా చేసుకోవాలని, వినియోగదారులను మోసం చేయొద్దని జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి బి.ప్రవీణ్‌కుమార్ అన్నారు. వరల్డ్ మెట్రాలజీ డే సందర్భంగా సోమవారం లక్ష్మీపురంలోని కూరగాయల మార్కెట్‌లో లీగల్ మెట్రాలజీ అధికారులు వ్యాపారులకు, వినియోగదారులకు తూనికలు, కొలుతలు ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. వ్యాపారులు ప్రభుత్వం ద్వారా సర్టిఫికెట్ తీసుకున్న తూనికలు, కొలుతలనే ఉపయోగించాలని సూచించారు. నియమ నిబంధనలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేస్తున్నామన్నారు. తూకంలో ఎలాంటి మోసాలు జరిగినా 63049 82375కు ఫిర్యాదు చేయాలని కోరారు.

22న జాబ్ మేళా

గీసుగొండ, మే 20: ధర్మారంలోని ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో 22న అపోలో ఫార్మసీ ఆధ్వర్యంలో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ కొక్కొండ శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మసీ చేసిన నిరుద్యోగులు పూర్తి బయోడేటాతో హాజరు కావాలని కోరారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో పనిచేయాల్సి ఉంటుందని, నెలకు రూ.11వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఇస్తారని వెల్లడించారు. పూర్తి వివరాలకు 99635 91463 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రంజీ క్రీడలు ఆడేలా స్టేడియం ఏర్పాటు

(3వ పేజీ తరువాయి)

హైదరాబాద్ నగరంలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన క్రికెట్ స్టేడియం లేకపోవడం బాధకరమన్నారు. వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను ఎంపిక చేసి హైదరాబాద్ జింఖానా గ్రౌండ్, ఉప్పల్ స్టేడియంలో ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చాగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ.. హెచ్‌సీఏ సహకారంతో వరంగల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20న ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 5జిల్లా కేంద్రాలలో క్రికెట్ శిక్షణ శిబిరాలను నెల రోజుల పాటు పండుగ వాతావరణంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఆన్‌లైన్ పద్ధతిలో ప్రవేశాలు నిర్వహించగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు.

అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యావేక్షణలో అండర్-14, 16, 19, 23 బాల బాలికలకు వేసవి క్రికెట్ శిక్షణ శిబిరాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శిక్షణ శిబిరంలో పాల్గొన్నా క్రీడాకారులకు అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు పవన్‌కుమార్‌గౌడ్, హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు సర్దార్ దల్జీత్ సింగ్, సంయుక్త కార్యదర్శి బసవరాజు, అపెక్స్ కౌన్సిల్ మెంబర్లు, తెలంగాణ బాడ్మింటన్ సోసియేషన్ బాధ్యులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి ఉదయభానురావు, అంతర్జాతీయ హ్యాండ్ బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, సీనియర్ క్రీడాకారులు మట్టెడ కుమార్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.



వేసవి క్రికెట్ శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు సర్టిఫికెట్‌లను ప్రదానం చేస్తున్న జగన్‌మోహన్‌రావు

వాహనదారులకు జరిమానా..

హనుమకొండ టౌన్, మే 20 : నిబంధనలు ఉల్లంఘించిన 31 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ షుఖూర్ పేర్కొన్నారు. 31 మందిని సోమవారం కోర్టులో హాజరు పర్చగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 19 మందికి రూ. 24,200, డ్రైవింగ్ లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.1100 జరిమానాను న్యాయమూర్తి విధించారని పేర్కొన్నారు. వీరేకాకుండా 10మంది మైనర్లకు రూ. 8,600 జరిమానా విధించారని తెలిపారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్టు

వరంగల్ క్రైం, మే 20: హసన్‌పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని హసన్‌పర్తి గ్రామంలో ఆస్తి తగాదాలో జల్లి సారయ్య అనే వ్యక్తిని తన మనవళ్లు ఆదివారం హత్య చేసిన విషయం తెలిసిందే. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో మృతుడు సారయ్య కోడలు జల్లి రమాదేవి, మనవళ్లు సాయికృష్ణ, శశికిరణ్ ఉన్నారు. వీరిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపినట్లు సీఐ సురేష్ తెలిపారు.

విద్యానికేతన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

హనుమకొండ చౌరస్తా, మే 20: హనుమకొండ బ్రాహ్మణవాడలోని విద్యానికేతన్ హైస్కూల్ 1995-96 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం హనుమకొండలోని ఓ ప్రయివేట్ రెస్టారెంట్‌లో సోమవారం జరిగింది. సుమారు 28 సంవత్సరాల తర్వాత మిత్రులందరూ ఒకేచోట చేరి ఆనాటి స్మృతులను నెమరు వేసుకున్నారు. కష్టసుఖాలను పరస్పరం పంచుకున్నారు. ఈ బ్యాచ్‌లో విద్యను పూర్తి చేసి అకాల మరణం చెందిన తమ స్నేహితులను గుర్తు చేసుకొని మౌనం పాటించారు. ఒకరికి ఒకరు తోడు కావాలని తీర్మాణించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పసునూటి సుమితి, స్వప్న, శ్రీకాంత్, లక్ష్మణ్, కల్పన, చంద్రవతి, వెంకటేశ్వర్లు, కిషన్, సరళ, సాయిలీల తదితరులు పాల్గొన్నారు.

మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లెపాడు దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దామోదర్

కాళోజీ జంక్షన్, మే 20: ప్రపంచ మెట్రాలజీ డే సందర్భంగా హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా వినియోగదారుల సలహా సంఘం, కాన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సంయుక్తంగా సోమవారం నిర్వహించిన వినియోగదారుల చైతన్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా డాక్టర్ పల్లెపాడు దామోదర్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ చట్టం రూల్స్ 2011 ప్రకారం వినియోగదారులు నిత్య జీవితంలో వాడకం చేస్తున్న టీ, కాఫీ పౌడర్‌లు మొదలుకొని పాల పైడర్లు, బిస్కెట్లు, సూప్‌లు, వంటనూనెలు, బియ్యం బస్తాలు, ఉప్పు, సబ్బులు, కూల్ డ్రింక్స్, సిమెంట్ బస్తాలు, వాల్ పేయింట్స్ బహిరంగ మార్కెట్లో ప్రతీ వస్తువుపై పూర్తి సమాచారం వినియోగదారులకు అర్థమయ్యే భాషలో ఉండేలా చూడాలన్నారు. తనిఖీలు నిర్వహించే బాధ్యత తూనికలు, కొలతల శాఖదన్నారు. పెట్రోల్ బంక్‌లు, వే బ్రిడ్జిలు, భూ సర్వేలు, డాక్టర్లు ఉపయోగించే థర్మా మీటర్‌లు, బీపీ మిషన్లు, బార్ షాపుల్లో పెగ్ కొలతల్లో వినియోగదారులు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత లీగల్ మెట్రాజీ (తూనికలు, కొలతల శాఖ) అవుతుంది.

ఇటీవల వరంగల్‌లో ఒక బంగారు ఆభరణాల వర్తకుడు ఇచ్చిన బిల్లులో నాణ్యతకు సంబంధించిన వివరాలు లేనందున రూ. 25 వేల జరిమానాను లీగల్ మెట్రాలజీ అధికారులే విధించారు. వినియోగదారులు చైతనవంతులు కావాలన్నారు. తూనికలు, కొలతల్లో మోసం జరిగినప్పుడు వినియోగదారులు తూనికలు, కొలతల శాఖ అధికారులను సంప్ర దించవచ్చునని నష్ట పోయిన వినియోగదారులు, వినియోగదారుల వివాదాల పరిష్కారాల కమిషన్ ద్వారా నష్టపరిహారం పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సలహా సంఘం సభ్యులు ఎస్.కవిరాజ్, ఎస్. హైమావతి, పి. జ్యోత్స్న, జి. సతీష్, హరిత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

నవ్య డాక్టర్

మంగళవారం • 21 మే 2024


క్లోమం క్షేమం

- మద్యపానం, ధూమపానం చేయకూడదు
- ప్రతి రోజూ క్రమం తప్పక వ్యాయామం చేయాలి
- అధిక బరువు తగ్గించుకోవాలి.
- పిండిపదార్థాలు తక్కువగా తీసుకోవాలి



పాంక్రియాస్

పొట్ట నొప్పి సర్వసాధారణమే! అలాగని నొప్పి తగ్గించే మందులు వాడుకుంటూపోతే అసలు సమస్య తిరిగి సరిదిద్దలేనంతగా ముదిరిపోవచ్చు. క్లోమగ్రంథి సమస్య అలాంటిదే! తప్పుదోవ పట్టించే లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రతించి సమస్యకు తగిన చికిత్స తీసుకోవాలంటున్నారు వైద్యులు.



క్లోమం ఇలా క్షేమం

ఇన్సులిన్ ఉత్పత్తి సవ్యంగా జరగానికీ, ఆహారం జీర్ణించుకోడానికి అవసరమైన ఎంజైముల స్రావానికీ పాంక్రియాస్ తోడ్పడుతూ ఉంటుంది. కానీ పాంక్రియాస్ జబ్బు పడినప్పుడు బయల్పడే లక్షణాలు తప్పుదారి పట్టించేలా ఉండడం, క్లోమ గ్రంథి పొట్టలో అంతర్గత అవయవాల అడుగున ఉండడం వల్ల, స్కాన్‌లలో ఈ గ్రంథిని స్పష్టంగా కనిపెట్టలేకపోవడం వల్ల ఈ గ్రంథి సమస్యలు ఆలస్యంగా వెలుగులోకి వస్తుంటాయి. అలాగే క్లోమ గ్రంథికి కేన్సర్ సోకినప్పుడు, దాని పక్కన ఉండే రక్తనాళాలన్నీ ఇన్వాల్వ్ అయి ఉండడం మూలంగా చివరి దశలో సమస్యను కనిపెట్టినప్పటికీ సర్జరీ చేయలేని పరిస్థితి ఉంటుంది. అయితే సాధారణంగా పాంక్రియాస్ సమస్య అక్యూట్, క్రానిక్ అనే రెండు దశల్లో బయల్పడుతూ ఉంటుంది. ఈ రెండు సమస్యల్లో పాంక్రియాస్‌లో వాపు కనిపిస్తుంది. మద్యపానం, గాల్ స్టోన్స్ ఈ వాపుకు ప్రధాన కారణాలు. ట్రైగ్లిజరైడ్స్, క్యాల్షియం మోతాదులు ఎక్కువగా ఉన్నా, పుట్టుకతో డక్టల్ అబ్నార్మాలిటీ ఉన్నా, జన్యుపరమైన సమస్యలు ఉన్నా పాంక్రియాస్‌లో వాపు వస్తుంది.

ఆ నొప్పిని నిర్లక్ష్యం చేయకూడదు

పాంక్రియాస్ వాపులో వచ్చే 80 శాతం అటాక్స్ ప్రారంభంలో తక్కువ తీవ్రతను కలిగి ఉంటాయి. మిగతా 20% అటాక్స్ తీవ్రంగా ఉంటాయి. ఈ అటాక్స్ పొట్టలో నొప్పితో మొదలవుతాయి. బొడ్డు పైభాగంలో మొదలయ్యే నొప్పి వెన్నులోకి పాకుతూ ఉంటుంది. అక్యూట్ పాంక్రియటైటిస్‌లో ఈ నొప్పి అప్పుడప్పుడూ వేధిస్తూ ఉంటే, క్రానిక్ దశకు చేరుకున్న తర్వాత, నొప్పి సంవత్సరాల తరబడి వేధిస్తూ ఉంటుంది. భోజనం తిన్న తర్వాత నొప్పి పెరుగుతూ ఉంటుంది. క్లోమ గ్రంథిలో గడ్డలు (కేన్సర్) ఏర్పడినప్పుడు, కామెర్లు, మధుమేహం తలెత్తుతాయి. బరువు కోల్పోతారు. అలాగే మలంలో కొవ్వు పోతూ ఉంటుంది. పాంక్రియాస్ స్రావాలు తగ్గడం వల్ల ఆహారంలో ఉండే కొవ్వులు జీర్ణం అవకుండా, మలం ద్వారా బయటకు వెళ్లిపోతూ ఉంటాయి. మలవిసర్జనకు వెళ్లినప్పుడు కొవ్వులు నీళ్లలో తేలుతూ ఉండడం, నీళ్లు కొట్టినా మలం తేలికగా వదలకపోవడం లాంటివి కనిపిస్తాయి.

క్రానిక్ దశ ప్రమాదకరం

క్రానిక్ దశలో పాంక్రియాటిక్ డక్ట్‌లో రాళ్లు చేరతాయి. ఇందుకు ప్రధాన కారణం మద్యపానం, ధూమపానం. మన దేశంలో ట్రాపికల్ పాంక్రియటైటిస్ సర్వసాధారణం. 20 ఏళ్ల వయస్కుల్లో కనిపించే ఈ సమస్యలో పాంక్రియాటిక్ డక్ట్‌లో రాళ్లు చేరి, నొప్పి వేధిస్తుంది. ఆ నొప్పిని తగ్గించుకోవడం కోసం పెయిన్‌కిల్లర్స్ (ఒపియాయిడ్ అనాల్జెసిక్స్) వాడుతూ, వాటికి అలవాటు పడిపోతూ ఉంటారు. ఈ అలవాటు అడిక్షన్‌కు దారి తీసే ప్రమాదం ఉంటుంది. ఇలా దీర్ఘకాలంలో పాంక్రియాస్ దెబ్బతిని, ఇన్సులిన్ ఉత్పత్తి ఆగిపోయి, మధుమేహం కూడా తలెత్తుతుంది. ఇలా జగరకుండా ఉండాలంటే నొప్పి మొదలైన వెంటనే వైద్యులను కలిసి, సమస్య తీవ్రతను అంచనా వేసి, చికిత్స తీసుకోవాలి.



చికిత్స ఇలా...

పాంక్రియాస్ పొట్టలో అడుగున ఉంటుంది కాబట్టి అల్ట్రాసౌండ్‌లో స్పష్టంగా కనిపించకపోవచ్చు. కాబట్టి పాంక్రియాస్ సమస్యలను స్పష్టంగా తెలుసుకోవడం కోసం సిటి స్కాన్ లేదా ఎమ్మారై చేయించాలి. పాంక్రియాస్ సమస్యను మరింత కచ్చితంగా నిర్థారించుకోవడం కోసం, నోటి ద్వారా పొట్టలోకి గొట్టం పంపించి, పాంక్రియాస్‌ను దగ్గరగా పరీక్షించవచ్చు. పరీక్షలో రాళ్లు ఉన్నట్టు తేలితే ఎండోస్కోపీ ద్వారా వాటిని తొలగించుకోవచ్చు. కొందర్లో సిస్టులు కూడా ఏర్పడుతూ ఉంటాయి. అలాంటప్పుడు సర్జరీ చేసి పాంక్రియాస్‌ను తెరిచి, రాళ్లను తొలగించి, చిన్నపేగుకు జాయిన్ చేయవలసి ఉంటుంది. ప్రస్తుతం ఈ సర్జరీ కూడా కీహోల్ ద్వారా చేయగలిగే సౌలభ్యం అందుబాటులోకి వచ్చింది. అక్యూట్ పాంక్రియాటైటిస్ గాల్ స్టోన్స్ వల్ల తలెత్తితే, గాల్ స్టోన్స్‌ను తొలగిస్తే సమస్య సర్దుకుంటుంది. మద్యపానం వల్ల అక్యూట్ పాంక్రియటైటిస్ వస్తే, ఆ అలవాటు వెంటనే మానుకోవాలి. మానుకోకపోతే సమస్య క్రానిక్ దశకు చేరుకుంటుంది.

క్రానిక్ దశకు చేరుకున్న కొందర్లో క్లోమానికి రక్తప్రసరణ పూర్తిగా పోయి, క్లోమంలో కొంత భాగం కుళ్లిపోయి, ఇన్‌ఫెక్షన్ మొదలవుతుంది. ఇలాంటప్పుడు సర్జరీతో కుళ్లిపోయిన భాగాన్ని తొలగించుకోవాలి.

డాక్టర్ టి.ఎల్.వి.డి. ప్రసాద్ బాబు

సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ బేరియాట్రిక్ సర్జన్,
యశోద హస్పిటల్స్,
సికింద్రాబాద్.



మహిళల్లో...

మధ్య వయసు మహిళల్లో, యువతుల్లో క్లోమగ్రంథిలో సిస్టిక్ ట్యూమర్లు ఏర్పడుతూ ఉంటాయి. వీటిని ఒకసారి తొలగిస్తే, రెండోసారి తలెత్తవు. ఇవి ప్రమాదకరమైనవి కాకపోయినా, భవిష్యత్తులో కేన్సర్‌గా మారే అవకాశాలుంటాయి. కాబట్టి వీటిని కూడా వెంటనే తొలగించుకోవాలి.

క్లోమంలో కేన్సర్

క్రానిక్ పాంక్రియటైటిస్ సమస్య దీర్ఘకాలంలో కేన్సర్‌గా పరిణమించే ప్రమాదం ఉంది. మద్యపానం, ధూమపానం అలవాట్లు ఉన్న వాళ్లకు కూడా కేన్సర్ ముప్పు పొంచి ఉంటుంది. కొందర్లో జన్యుపరమైన సమస్యల వల్ల కూడా క్లోమ కేన్సర్ తలెత్తవచ్చు. అయితే అన్ని కేన్సర్‌లలో పాంక్రియాటిక్ కేన్సర్ అత్యంత ప్రమాదకరమైనది. ఈ కేన్సర్ వేగంగా వృద్ధి చెందడంతో పాటు, రోగి ప్రాణాలు కోల్పోయే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయి. కాబట్టి క్లోమ కేన్సర్ ప్రాణాంతకం కాకుండా



ఉండడం కోసం తొలి దశల్లోనే వ్యాధిని గుర్తించాలి. కాబట్టి మధుమేహం, కామెర్లు నిర్థారణ అయినప్పుడు, వాటి కోసమే మందులు వాడుకోవడమే కాకుండా, ఒకసారి స్కాన్ చేయించుకుని పాంక్రియాస్ పరిస్థితిని తెలుసుకోవాలి. కేన్సర్ అని నిర్థారణ అయినప్పుడు బయాప్సీ చేసి, జెనెటిక్ అనాలసిస్ చేయించి, టార్గెటెడ్ థెరపీ ద్వారా వ్యాధిని తగ్గించుకోవచ్చు. ఒకవేళ నాల్గవ దశ కేన్సర్ నిర్థారణ అయినప్పుడు, సర్జరీకి ముందు కీమోథెరపీ ఇచ్చి, తర్వాత సర్జరీ చేయవలసి ఉంటుంది. తొలి దశ కేన్సర్‌కు సర్జరీ, తర్వాత కీమో అవసరమవుతాయి.

అవేర్‌నెస్

హెర్నియాతో జాగ్రత్త

చర్మపు తిత్తిలోకి పేగులు దిగిపోయి పొత్తికడుపు లేదా గజ్జల్లో హెర్నియా కనిపిస్తే వీలైనంత తొందరగా వైద్యుల్ని సంప్రతించి చికిత్స మొదలుపెట్టాలి. లేదంటే పొట్టలో చర్మం అడుగున ఏర్పడిన రంధ్రం పెద్దదైపోతూ సమస్య మరింత జటిలమవుతుంది. కొన్ని సందర్భాల్లో ఈ తిత్తిలోకి చేరుకున్న పేగులకు రక్త ప్రసరణ అందక కుళ్లిపోవచ్చు కూడా! ఇలాంటప్పుడు ఆ పేగులు సెప్టిక్ అవుతాయి. ఇన్‌ఫెక్షన్ పెరిగి ప్రాణాలకే ప్రమాదం సంభవించవచ్చు. ఈ సమస్యను నిర్లక్ష్యం చేసే కొంతమందిలోనైతే పేగుల పనితీరు తలకిందులై మలం, ఆహారం కలిసిపోయి అవి వెళ్లే మార్గాలు తారుమారవ్వచ్చు. ఇది ఎంతో ప్రమాదకరమైన పరిస్థితి. ఇలా జరగకుండా ఉండాలంటే హెర్నియా లక్షణాలు కనిపించగానే ఆలస్యం చేయకుండా వైద్యుల్ని సంప్రదించాలి.



హెర్నియా రాకుండా...

హెర్నియా రాకుండా ఉండాలంటే పొత్తికడుపు మీద ఒత్తిడి పడే పనులకు దూరంగా ఉండాలి. అలాగే సర్జరీల కోసం అనుభవజ్ఞులైన వైద్యులను ఎంచుకోవాలి. హెర్నియా రాకుండా తీసుకోవలసిన ముందు జాగ్రత్తలు మరికొన్ని...

- సాధారణ ప్రసవం, సిజేరియన్ సర్జరీ తర్వాత తప్పనిసరిగా పొట్ట కండరాలు బలపడే వ్యాయామాలు చేయాలి.
- మలబద్ధకం లేకుండా చూసుకోవాలి.
- మధుమేహం అదుపులో ఉంచుకోవాలి.
- దగ్గు తెప్పించే ధూమపానం మానేయాలి.
- పురుషులు ప్రొస్టేట్ గ్రంథి సమస్యలను సరిదిద్దుకోవాలి.
- బరువులెత్తేటప్పుడు క్రమపద్ధతి పాటించాలి.
- ఎత్తుకు తగిన బరువు మెయింటెయిన్ చేయాలి.
- అధిక బరువు తగ్గించుకోవాలి.
- దగ్గుకి కారణమయ్యే రుగ్మతల్ని అదుపు చేయాలి.

తెలుసుకుందాం

రోజుకు ఎన్ని పోషకాలు?

ఆహారంలో సరిపడా పోషకాలున్నప్పుడే అది సమతులాహారం అవుతుంది. అందుకోసం శాకాహారులైతే రోజు మొత్తంలో 250 గ్రాముల తృణధాన్యాలు, 400 గ్రాముల కూరగాయలు, వంద గ్రాముల పండ్లు, 85 గ్రాముల పప్పుదినుసులు, 35 గ్రాముల నట్స్, 27 గ్రాముల కొవ్వులు, నూనెలు, 300 గ్రాముల పాలు/పెరుగు తీసుకోవాలి. మాంసాహారులైతే 260 గ్రాముల తృణధాన్యాలు, 400 గ్రాముల కూరగాయలు, 100 గ్రాముల పండ్లు, 55 గ్రాముల పప్పుదినుసులు, 70 గ్రాముల చికెన్/మాంసం, 30 గ్రాముల నట్స్, సీడ్స్, 27 గ్రాముల కొవ్వులు, నూనెలు, 300 గ్రాముల పాలు/పెరుగు తీసుకోవాలి. అలాగే ఆహారంలోని పోషకాలు నష్టపోకుండా అదే పనిగా బియ్యం, పప్పుదినుసులను నీళ్లలో కడగకూడదు. అలాగే కూరగాయలు, పండ్లను చిన్న చిన్న ముక్కలుగా కోసుకోకుండా, పెద్దవిగా కోసుకోవాలి. కోసిన వెంటనే వండుకోవాలి, లేదా తినేయాలి. గిన్నెల మీద మూత ఉంచి వండుకోవాలి. లేదా కుక్కర్‌లో ఉడికించుకోవాలి. ఓవెన్‌లో వంట గురించి కొందరికి అపోహలుంటాయి. సంప్రదాయబద్ధమైన వంట విధానాల్లో జరిగే పోషక నష్టానికీ, మైక్రోఓవెన్‌లో జరిగే పోషక నష్టానికి వ్యత్యాసం ఎంతో తక్కువ.



మార్గదర్శకాలు

ఆరోగ్యం సొంతం చేసుకుందాం

ఇండియన్ కౌన్సెల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎమ్ఆర్) తాజాగా 170 పేజీల ఆరోగ్య మార్గదర్శకాలతో కూడిన నివేదికను విడుదల చేసింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ సూచిస్తున్న ఈ మార్గదర్శకాలు పరిపూర్ణ ఆరోగ్యానికి దోహపడేలా రూపొందాయి.

భారతదేశం 56.4% వ్యాధుల భారంతో కుదేలవడానికి కారణం అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లే కారణమని ఆ మార్గదర్శకాలు పేర్కొంటున్నాయి. 13 ఏళ్ల తర్వాత తాజాగా సవరించిన ఆ మార్గదర్శకాలను పాటించగలిగితే అనారోగ్యకరమైన జీవనశైలి ఫలితంగా వాటిల్లే మరణాల రేటును నివారించవచ్చని ఎన్ఐఎన్ పేర్కొంటోంది. క్రమం తప్పక వ్యాయామం చేయడంతో పాటు, ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినగలిగితే హృద్రోగాలు, మధుమేహం బారిన పడే అవకాశాలు తగ్గుతాయని కూడా ఎన్ఐఎన్ పేర్కొంటోంది. అంతే కాకుండా సప్లిమెంట్లు, ప్రొటీన్ పౌడర్ల వినియోగం గురించి కూడా కొన్ని సూచనలు చేసింది.

సప్లిమెంట్లు, ప్రాసెస్డ్ ఫుడ్స్

ప్రొటీన్ సప్లిమెంట్లు ఆరోగ్యకరమైనవి కావు. కాబట్టి ప్రజలు వాటిని మానేయడమే ఉత్తమం. దీర్ఘకాలం పాటు ప్రొటీన్ పౌడర్లు తీసుకోవడం మూలంగా ఎముకల సాంద్రత తగ్గడంతో పాటు మూత్రపిండాలు కూడా పాడవుతాయి. కాబట్టి ఒక కిలో శరీర బరువుకు 1.6గ్రాముల ప్రొటీన్ చొప్పున లెక్కించి తీసుకోవడం ఉత్తమమని ఎన్ఐఎన్ సూచిస్తోంది. అలాగే ఉరుకుల పరుగుల జీవితంలో ప్రజలు వృత్తిపరమైన లక్ష్యాల మీద దృష్టి పెడుతూ, ఒక కీలకమైన అంశాన్ని విస్మరిస్తున్నారనీ, ఆరోగ్యకరమైన శరీరంతోనే శక్తి సమకూరి, జీవిత లక్ష్యాల వైపు పయనించగలిగే సామర్థ్యం, నైపుణ్యాలు సమకూరతాయనీ ఎన్ఐఎన్ పేర్కొంటోంది. ప్రాసెస్ చేసిన పదార్థాలకు బదులుగా తాజా పదార్థాలు తినడాన్నే హెల్తీ ఈటింగ్‌గా పరిగణించాలి. ప్రాసెస్ చేసిన, నిల్వ ఉన్న ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో నిల్వ పదార్థాలను జోడిస్తారు కాబట్టి పోషక నష్టం జరుగుతుంది. పైగా ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో ఉప్పు, చక్కెరలు అధికం. వీటితో జబ్బులు ఎంతో ముందుగానే సంక్రమిస్తాయి. రోజు మొత్తంలో తీసుకునే చక్కెర ఒక రోజుకు శరీరానికి సమకూరే పూర్తి శక్తిలో ఐదు శాతానికి పెరగకుండా చూసుకోవాలని ఐసిఎమ్మార్ సూచిస్తోంది. తాజా కూరగాయలు, పప్పుదినుసులు, చిక్కుళ్లు మొదలైన పదార్థాలతో కూడిన సంతులన ఆహారం తీసుకోవాలని కూడా సూచిస్తోంది. అల్ట్రాప్రాసెస్డ్ ఫుడ్స్ వల్ల ఒబెసిటీ తప్పదనీ, గుండెపోటు ముప్పు పొంచి ఉంటుందనీ, మధుమేహం దరి చేరుతుందనీ ఎన్ఐఎన్ హెచ్చరిస్తోంది. ఇన్‌స్టంట్ నూడుల్స్, బ్రేక్‌ఫాస్ట్ మిక్సెస్, సూప్ మిక్సెస్ మొదలైనవన్నీ అల్ట్రాప్రాసెస్డ్ కోవలోకే వస్తాయి. కాబట్టి వీటికి బదులుగా ఇంట్లో తయారుచేసుకున్న సంప్రదాయ వంటకాలనే ఎంచుకోవాలని ఎన్ఐఎన్ సూచిస్తోంది.

బరువు ఇలా తగ్గాలి

బరువును తగ్గించే పలు రకాల డైట్స్‌ను ఎంతో మంది ప్రయత్నిస్తూ ఉంటారు. అయితే అనుసరించేది ఎలాంటి డైట్ అయినా, రోజు మొత్తంలో తీసుకునే ఆహారం ద్వారా శరీరానికి అందే క్యాలరీలు వెయ్యికి తగ్గకుండా చూసుకోవాలి. అలాగే తీసుకునే డైట్‌లో అన్ని రకాల పోషకాలూ ఉండాలని ఐసిఎమ్మార్ అంటోంది. బరువును దీర్ఘకాలం పాటు కాలక్రమేణా తగ్గించుకోవాలనీ, హఠాత్తుగా అధిక బరువు తగ్గడం, యాంటీ ఒబేసిటీ మందులు వాడడం ఆరోగ్యానికి హానికరమని కూడా హెచ్చరిస్తోంది. అలాగే ఆరోగ్యకరమైన తీరులో బరువు తగ్గడం కోసం ఐసిఎమ్మార్ కొన్ని మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. అవేంటంటే...

- తగినన్ని కూరగాయలతో కూడిన సంతులన భోజనాన్ని ఎంచుకోవాలి. దాన్లో పీచు, పోషకాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. అప్పుడే ఆకలి అదుపులో ఉండి అదనపు క్యాలరీలు శరీరాలకు అందకుండా ఉంటాయి.
- తక్కువ క్యాలరీలు, ఎక్కువ విటమిన్లు, ఖనిజ లవణాలు, పీచు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల సమర్థంగా బరువు తగ్గవచ్చు.
- ఆహార పరిమాణం కూడా కీలకమే! అలాగే అవసరానికి మించి తినే అలవాటును కూడా మానుకోవాలి.
- పోషకభరిత ప్రత్యామ్నాయాలైన గుప్పెడు నట్స్, పెరుగు, పచ్చి కూరగాయలు లాంటివి స్నాక్స్‌గా తినాలి.
- చర్మం తీసిన చికెన్, లేత మాంసం, చేపల్లో క్యాలరీలు, శాచురేటెడ్ ఫ్యాట్స్ తక్కువగా ఉంటాయి.
- గ్రిల్లింగ్, బేకింగ్, ఆవిరి మీద ఉడికించడం లేదా సాటీయింగ్‌లలో తక్కువ నూనె పడుతుంది. కాబట్టి వేపుళ్లకు బదులుగా ఈ విధానాలనే ఎంచుకోవాలి. ఈ విధానాల వల్ల పదార్థాల్లోని పోషకాలు కూడా నష్టపోకుండా ఉంటాయి.
- శీతలపానీయాలు, పండ్ల రసాలు మానేసి హెర్బల్ టీ, గ్రీన్ టీ లాంటివి తాగాలి.
- క్యాలరీలు, శాచురేటెడ్ ఫ్యాట్స్ అదనపు చక్కెర, ఉప్పు లాంటి వివరాల కోసం ఫుడ్ లేబుల్స్ చదవాలి. ఆరోగ్యకరమైన దినుసులతో తయారైన పదార్థాలనే ఎంచుకోవాలి.



గుడ్ ఫుడ్

పదార్థాలు - ప్రత్యామ్నాయాలు



తోచింది, నచ్చింది తినడం కాదు. ఆరోగ్యానికి మేలు చేసేదీ, పోషకభరితమైనదీ తినాలి. అందుకోసం వీలున్న ప్రత్యామ్నాయాలను ఎంచుకోవాలి.

జంక్ ఫుడ్: పిజాలు, బర్గర్లు మొదలైన జంక్ ఫుడ్స్‌లో అత్యధిక క్యాలరీలుంటాయి. వీటిలోని రిఫైన్డ్ దినుసులు ఆరోగ్యానికి హానికరం కాబట్టి వీటికి బదులుగా తక్కువ క్యాలరీలున్న సలాడ్లు, మొలకలు ఎంచుకోవాలి.

పునుగులు, బజ్జీలు: ఈ స్నాక్స్ తరచూ తింటూ ఉంటాం. ఇంట్లో తయారుచేసుకున్నవే తిన్నా వీటి ద్వారా అధిక మొత్తాల్లో కొవ్వులు శరీరంలోకి చేరతాయి. కాబట్టి వీటికి బదులుగా నట్స్, సీడ్స్ తినాలి. వేరుసెనగలు, బాదం లాంటి వాటిలో ఆరోగ్యకరమైన కొవ్వులుంటాయి.

బిస్కెట్లు, కేకులు: ఈ స్నాక్స్‌లో అత్యధికంగా పాలిష్ పట్టిన దినుసులుంటాయి. అలాగే అత్యధిక కొవ్వులు, చక్కెరలు ఉంటాయి. వీటికి బదులుగా సంప్రదాయ తీపి పదార్థాలైన వేరుసెనగ చిక్కీలు, పల్లీ ముద్దలు, మిల్లెట్ ఉండలు లాంటివి తినాలి.

కూల్ డ్రింక్స్: వీటిలో చక్కెర ఎక్కువ. ఎనర్జీ డ్రింక్‌లు, జీరో షుగర్ డ్రింకులు కూడా హానికరమే! కాబట్టి వీటికి ప్రత్యామ్నాయంగా కొబ్బరినీళ్లు, మజ్జిగ, తాజా చెరకు రసాలు తాగాలి.

పళ్ల రసాలు: వీటిని ఇంట్లో తయారుచేసుకునే అలవాటు ఉండదు కాబట్టి బయట దొరికే పండ్లరసాల మీదే ఆధారపడుతూ ఉంటాం. వీటిలో చక్కెరలు ఎక్కువ. పైగా పండ్ల రసాలతో తగిన పీచు శరీరానికి అందకుండా పోతుంది. కాబట్టి పండ్ల రసాలకు బదులుగా నేరుగా పండ్లనే తినడం అలవాటు చేసుకోవాలి.

జామ్స్, సాస్, డిప్స్: వీటిలో ఉప్పు, చక్కెరలు, నిల్వ పదార్థాలు, కృత్రిమ రంగులు ఎక్కువ. వీటికి బదులుగా ఇంట్లో తయారుచేసిన పచ్చళ్లు ఎంచుకోవాలి.

హెల్త్ వెల్త్

నాడీ వ్యవస్థ నాజూగ్గా

నాడీ వ్యవస్థ కణజాలం ఆరోగ్యంగా ఉండాలంటే నాణ్యమైన కొవ్వులు ఆహారంలో చేర్చుకోవాలి. ఇందుకోసం...

అవిసె నూనె: ఈ నూనెను కూరగాయల సూప్ మీద పోసుకుని తీసుకోవచ్చు. అయితే ఈ నూనెను నేరుగా వంటకు ఉపయోగించకూడదు.

సబ్జా: వీటిని 10 నుంచి 20 నిమిషాలపాటు నీళ్లలో నానబెట్టి తాగాలి. లేదంటే రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే తాగవచ్చు. వీటిలోని ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్లు జీర్ణవ్యవస్థతో పాటు నాడీవ్యవస్థనూ ఆరోగ్యంగా ఉంచుతాయి.

అవకాడొ: మాంసకృత్తులు కలిగిన ఈ పండును ఏ సమయంలోనైనా తినవచ్చు.

నాణ్యమైన నూనెలు: ఆలివ్, అవకాడొ, కొబ్బరి, నువ్వులు, పొద్దుతిరుగుడు నూనెలు వాడుకోవచ్చు.

నెయ్యి: ఆయుర్వేదంలో నెయ్యి స్వర్ణంతో సమానం. వెన్న, నెయ్యి జీర్ణశక్తిని పెంచి, శరీర కణజాలాలకు శక్తినిస్తుంది.

మర్దన మంచిది

స్వీయ మర్దనతో సాంత్వన పొందవచ్చు. రోజూ లేదా వారంలో ఒకసారి ఇందుకోసం



తీరిక సమయం కేటాయించుకోవాలి. శరీరమంతా నూనె పట్టించి సున్నితంగా మర్దన చేసుకోవాలి. పాదాలతో మొదలుపెట్టి నాడులతో సంబంధం ఉన్న ప్రతి ప్రాంతాన్నీ మర్దన చేసుకోవాలి. పాదాలతో మొదలుపెట్టి కాలి గిలకలు, పిక్కలు, మోకాళ్లు, తొడలు, నడుము, ఉదరం, ఛాతీ, భుజాలు, చేతులు, మెడ, ముఖం... ఈ విధంగా కింద నుంచి పైకి మర్దన సాగాలి. మర్దన చేసేటప్పుడు శరీరంలోని ప్రతి అంగుళాన్నీ స్పృశించాలి. శరీరాన్ని రుద్ది, తాకి, మర్దించేటప్పుడు నాడులన్నీ ఉత్తేజితమవుతున్న అనుభూతికి లోనవ్వాలి. మర్దనతో శరీరానికి పట్టించిన నూనె చర్మంలోకి ఇంకి, నాడుల చివర్లకు చేరుతుంది. దాంతో వ్యాధుల నుంచి రక్షణ అందడంతో పాటు శరీరావయవాలకు శక్తి అందుతుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య చిత్రజ్యోతి
మంగళవారం • 21 మే 2024
cinema@andhrajyothy.com

పుట్టినరోజున కొత్త కబురు



మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్‌కు ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్, ఫ్యాన్ బేస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దానిని దృష్టిలో ఉంచుకుని తన సినిమాల ఎంపిక ఎంతో కేర్ తీసుకుంటుంటారు ఎన్టీఆర్. ప్రస్తుతం అందరి దృష్టీ ఆయన చేస్తున్న 'దేవర', 'వార్ 2' చిత్రాల మీదే ఉంది. తాజాగా ఇప్పుడు మరో భారీ చిత్రాన్ని ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ప్రకటించారు. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాలతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సినిమాకు దర్శకుడు కావడం విశేషం. 'ఎన్టీఆర్ నీల్ అనే వర్కింగ్ టైటిల్‌తో రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మించనున్నాయి.

ఎన్టీఆర్ స్టార్ పవర్, ప్రశాంత్ నీల్ విజనరీతో రూపుదిద్దుకొనే ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'కేజీఎఫ్'కు దీటుగా భారీ స్కేల్‌లో ఉంటూ ఇండస్ట్రీలో సరికొత్త బెంచ్ మార్క్ క్రియేట్ చేస్తుందంటున్నారు నిర్మాతలు. ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ 'దేవర', 'వార్ 2' చిత్రాలతో బిజీగా ఉన్నారు. ఈ రెండు ప్రాజెక్టులు పూర్తి చేసి ఆగస్టు నుంచి ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్‌లో పాల్గొంటారు.

మెగాస్టార్‌తో మరోసారి?





మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. వశిష్ఠ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా షూటింగ్ శరవేగంతో జరుగుతోంది. యూవీ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రం కోసం వేసిన భారీ సెట్‌లో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లోనే పాటలు కూడా చిత్రీకరిస్తారని సమాచారం. జులై కల్లా షూటింగ్ పార్ట్ పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ ప్రారంభించి, సంక్రాంతికి సినిమాను సిద్ధం చేయాలని నిర్మాతల ప్లానింగ్. 'విశ్వంభర' చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నప్పటికీ తదుపరి చిత్రం మీద దృష్టి పెట్టారు చిరంజీవి. ఆయన కుమార్తె సుస్మిత నిర్మించే ఈ సినిమాకు కల్యాణ్‌కృష్ణ దర్శకత్వం వహిస్తారని అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత ఈ సినిమా గురించి వివరాలు ఏమీ బయటకు రాలేదు. తాజాగా ఈ ప్రాజెక్ట్‌ను దర్శకుడు మోహన్‌రాజాకు అప్పగించినట్లు చెబుతున్నారు. మెగాస్టార్ హీరోగా రూపొందిన 'గాడ్ ఫాదర్' చిత్రానికి ఆయన దర్శకత్వం వహించారు. మోహన్‌రాజా స్క్రిప్ట్ నేరేషన్ ఇచ్చారనీ, మెగాస్టార్ దాన్ని ఓకే చేశారని సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో అధికారికంగా ప్రకటిస్తారని అంటున్నారు.



పవర్‌ఫుల్ అవతార్‌లో...

మంచు మనోజ్ ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి రీ ఎంట్రీ ఇస్తున్నారు. ఆయన ప్రతినాయకుడిగా నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తుండగా, టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. సోమవారం మంచు మనోజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన పాత్ర గ్లింప్స్‌ను 'ద బ్లాక్ స్వోర్డ్' పేరుతో విడుదల చేశారు. ఈ గ్లింప్స్‌లో ఆయన చాలా పవర్‌ఫుల్ అవతార్‌లో కనిపించారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ "మిరాయ్' కథ విన్నప్పుడు అద్భుతంగా అనిపించింది. ఈ సినిమా రెండు పార్టులుగా తెరకెక్కుతోంది. ఇంతటి చాలెంజింగ్ రోల్‌తో మళ్లీ ఇండస్ట్రీలో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది" అని అన్నారు. దర్శకుడు కార్తీక్ ఘట్టమనేని మాట్లాడుతూ "ఈ సినిమాలో మనోజ్ భాగమవ్వటం అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన కమ్‌బ్యాక్ ఎంతో ఆనందాన్ని ఇస్తోంది" అని చెప్పారు. పీరియాడికల్ సూపర్ హీరో ఫాంటసీగా తెరకెక్కుతున్న 'మిరాయ్' చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 18న ఎనిమిది భాషల్లో 2డి, 3డి వెర్షన్స్‌లో విడుదలవుతోంది.

ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా

రచయిత విజయేంద్ర ప్రసాద్



'బేబీ'తో సూపర్ హిట్ కొట్టిన తర్వాత ఆనంద్ దేవరకొండ నటించిన చిత్రం 'గం గం గణేశా'. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు ఉదయ్ శెట్టి దర్శకత్వం వహించారు. కేదార్ శెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించారు. మే 31న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. సోమవారం ఈ మూవీ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రచయిత విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ "ఈ సినిమా ఘనవిజయం సాధించాలని కోరుకుంటున్నా" అని చెప్పారు. సినిమా దర్శకుడు ఉదయ్ శెట్టి మాట్లాడుతూ "వినాయక చవితి చుట్టూ తిరిగే కథతో ఈ సినిమాని రూపొందించాం. వినోదంతో పాటు ఇందులోని ట్విస్ట్‌లు, థ్రిల్‌లు ఆకట్టుకుంటాయి" అని అన్నారు. "నేను ఇప్పటిదాకా రియలిస్టిక్ పాత్రలు పోషించాను. ఈ సినిమాలో నా పాత్ర ఫుల్ ఎనర్జిటిక్‌గా ఉంటుంది. ఇది టిపికల్ క్రైమ్ కామెడీ జానర్" అని ఆనంద్ దేవరకొండ అన్నారు. ఈ చిత్రంలో ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిశోర్, జబర్దస్త్ ఇమ్మాన్యుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం: చేతన్ భరద్వాజ్, సహ నిర్మాత: అనురాగ్ పర్వతనేని.

ఈ సినిమానే నా ఫేవరెట్



'సత్యభామ' సినిమాతో పవర్‌ఫుల్ పోలీస్ అధికారి పాత్రలో ప్రేక్షకులని పలకరించడానికి సిద్ధమయ్యారు కాజల్ అగర్వాల్. నవీన్ చంద్ర, ప్రకాశ్ రాజ్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి సుమన్ చిక్కాల దర్శకత్వం వహించారు. ఈ నెల 31న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్ర బృందం ప్రమోషన్స్‌ను వేగం చేసింది. ఈ సందర్భంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో కాజల్ మీడియాతో పలు విషయాలు పంచుకున్నారు. "దర్శకుడు చెప్పిన ఈ క్రైమ్ థ్రిల్లర్ విన్నవెంటనే ఆకట్టుకుంది. నేను ప్రస్తుతం నటించిన 'సత్యభామ' సినిమానే నా సినిమాల్లో ఫేవరెట్. ఎవరైనా సరే వారు ప్రస్తుతం నటించిన చిత్రాన్నే ఇష్టపడాలి. అందుకే నాకు ఈ సినిమానే నా ఫేవరెట్. ఈ సినిమా కోసం నేను మొదటిసారి పోలీసు పాత్రలో కనిపిస్తున్నా. తెరపై కొత్త కాజల్‌ను ఈ సినిమాతో చూస్తారు" అని చెప్పారు.



పాత సినిమా.. కొత్త వివాదం

పాయల్ రాజ్‌పుత్ నాలుగేళ్ల క్రితం నటించిన 'రక్షణ' చిత్రం విషయంలో మొదలైన వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. తనకు ఇవ్వాల్సిన డబ్బు చెల్లిస్తేనే సినిమా ప్రమోషన్స్‌కు వస్తానని పాయల్, ఆమె ప్రమోషన్స్‌కు వచ్చిన తర్వాతే డబ్బు ఇస్తానని దర్శకనిర్మాత ప్రణదీప్ ఠాకూర్.. అంటూ మెట్టు దిగక పోవడంతో వివాదం మరింత జటిలమైంది. ఈ విషయంలో ప్రణదీప్ ఠాకూర్ మార్చి 28న తెలుగు నిర్మాతలమండలిని ఆశ్రయించారు. 'పాయల్ రాజ్‌పుత్ మా సినిమా కోసం 50 కాల్షీట్లు ఇచ్చింది. అందులో 47 రోజులు వర్క్ చేసింది. మిగిలిన ఆ మూడు రోజులు ప్రమోషన్స్ కోసం రమ్మని అడుగుతుంటే ఆమె సహకరించడం లేదు' అని ఆయన తెలుగునిర్మాతలమండలికి ఫిర్యాదు చేశారు. పాయల్ రాజ్‌పుత్‌కు ఇవ్వాల్సిన రూ. ఆరు లక్షలు ఇవ్వడానికి తను సిద్ధమేనని ఆయన వెల్లడించారు. నిర్మాత ఫిర్యాదును తెలుగు నిర్మాతలమండలి మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు పంపించింది. అయితే ఆమె అందులో సభ్యురాలు కాకపోవడంతో తమ పరిధిలో లేని వ్యవహారమని 'మా' స్పష్టం చేయడంతో ఈ వ్యవహారాన్ని ముంబైలో ఉన్న ఫిల్మ్ ఫెడరేషన్‌కు దృష్టికి తీసుకెళ్లింది తెలుగు నిర్మాతలమండలి. ఈ లోగానే 'నాకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వకుండా 'రక్షణ' చిత్ర నిర్మాత వేధిస్తున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి నన్ను బ్యాన్ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు' అంటూ పాయల్ రాజ్‌పుత్ రెండు రోజుల క్రితం సోషల్ మీడియా ద్వారా ఆరోపించి, వివాదాన్ని సరికొత్త మలుపు తిప్పారు. దీనిపై తెలుగు నిర్మాతలమండలి స్పందిస్తూ పాయల్‌ను బ్యాన్ చేసే ఆలోచన తమకి లేదని ఏ సమస్యనైనా శాంతియుతంగా పరిష్కరించడమే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. తెలుగు నిర్మాతలమండలి జోక్యంతో పాయల్ కొంత దారికి వచ్చిందని చెప్పాలి. ఆమె స్వరం కూడా మారింది. వివాదం పెద్దగా చేయడం ఎందుకని ఆమె అనుకున్నారో ఏమో ఈ విషయంపై వివరణ ఇస్తూ గంటల వ్యవధిలోనే మరో పోస్టింగ్ పెట్టారు. 'రక్షణ' సినిమా కోసం చిత్ర బృందం ఎంత కష్టపడ్డారో తెలుసు. ఈ సినిమాకు పనిచేసిన వారెవరికీ నష్టాలు రాకూడదనేది నా తాపత్రయం. 2020లో ఈ సినిమాకు ఎలా సపోర్ట్ చేశానో ఇప్పుడూ అంతే సహకారం అందిస్తాను. నా విన్నపం ఒకటే.. నాతో సంప్రదింపులు జరిపాకే ఈ సినిమా విషయంలో ఎటువంటి నిర్ణయమైనా తీసుకోండి. నేను ఎవరికీ హాని తలపెట్టాలని చూడటం లేదు. చిత్ర బృందం నుంచి పిలుపు కోసం.. ఈ సమస్యను పరిష్కరించడానికి నా టీమ్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తోంది" అని ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు.

క్రైమ్ కామెడీ థ్రిల్లర్



దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్న క్రైమ్ కామెడీ థ్రిల్లర్ 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. తెలుగు, కన్నడ భాషల్లో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి అభిషేక్ దర్శకత్వం వహిస్తున్నారు. బృందా ఆచార్య కథానాయిక. హెచ్.కె. ప్రకాశ్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌లో దీక్షిత్ శెట్టి గన్‌తో షూట్ చేస్తూ, కాలికి టైగర్ మాస్క్ పెట్టుకుని కనిపించారు. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 26న విడుదల చేయనున్నట్లు నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: జుధాన్ శ్యాండీ, ఫొటోగ్రఫీ: అభిషేక్ జే, ఎడిటింగ్: తేజస్ ఆర్.

దీవిలో తుపాన్



ఇటీవల విడుదలైన 'లవ్‌గురు' చిత్రంతో విజయాన్ని అందుకొన్న తమిళ హీరో విజయ్ ఆంటోనీ తాజా చిత్రం 'తుపాన్'. విజయ్ ఆంటోనీతో ఇంతకుముందు 'రాఘవన్', 'హత్య' చిత్రాలను నిర్మించిన కమల్ బరా, డి.లలిత, బి. ప్రదీప్, పంకజ్ బోరా ఈ సినిమాకు నిర్మాతలు. పోయెటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా దీనిని దర్శకుడు విజయ్ మిల్టర్ రూపొందిస్తున్నారు. 'తనని చిన్నచూపు చూసే సమాజం భవితను మార్చేసిన వ్యక్తి కథ ఇది. ప్రస్తుతం చిత్రీకరణ తుది దశలో ఉంది. ఓ దీవి నేపథ్యంగా సాగే ఈ సినిమా షూటింగ్ అండమాన్, డయ్యూ, డామన్‌లో జరిపాం. ఈ నెల 29న టీజర్ విడుదల చేసి, త్వరలోనే చిత్రాన్ని రిలీజ్ చేస్తాం' అని నిర్మాతలు చెప్పారు. శరత్‌కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాశ్, మురళీశర్మ, పృథ్వీ, శరణ్య తదితరులు చిత్రంలో నటిస్తున్నారు.

ఆటోతో టుక్ టుక్



చిత్ర వాహినీ, ఆర్‌వైజీ సంస్థలు నిర్మిస్తున్న 'టుక్ టుక్' పోస్టర్‌ను విడుదల చేశారు. విచిత్రమైన ఆటోతో ఈ పోస్టర్ ఆకర్షణీయంగా ఉంది. సుప్రీత్ సి.కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హీరోలు హర్షరోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు ఓ ఆటో బొమ్మను ఆసక్తికరంగా చూస్తున్నారు. అసలు ఆ ఆటో బొమ్మ ఏమిటి, దానికీ, చిత్రకథకు ఉన్న సంబంధం ఏమిటి అనే అంశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి. సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని రాహుల్ రెడ్డి, లోక్కు, సాయివరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మించారు. ఈ సినిమాకు సంగీతం: సంతు ఓంకార్, ఫొటోగ్రఫీ: హార్దిక్ శ్రీకుమార్.



కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్



రామ్ తేజ్, వర్షిని, మౌనిక హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మల్లె మొగ్గ'. తోట వెంకట నాగేశ్వరరావు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై మంచి టాక్‌ను సంపాదించుకుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం సక్సెస్ మీట్‌ను నిర్వహించడంతో పాటు రామ్ తేజ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'తథాస్తు' సినిమా పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక నిర్మాత తోట వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ "మల్లె మొగ్గ' సినిమాకు బీసీ సెంటర్లలో ఆదరణ బాగుంది. విజయాన్ని అందించిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ప్రస్తుతం చేస్తున్న 'తథాస్తు' మూవీ కంప్లీట్ మాస్ ఎంటర్‌టైనర్" అని చెప్పారు. హీరో రామ్ తేజ్ మాట్లాడుతూ "మల్లె మొగ్గ' సినిమా రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. ఈ సినిమాను ఆదరించినట్టే 'తథాస్తు' చిత్రాన్ని కూడా ఆదరిస్తారని కోరుకుంటున్నా" అని అన్నారు. నటుడు భానుచందర్ మాట్లాడుతూ "చాలా మంచి కథతో తెరకెక్కిన చిత్రం 'మల్లె మొగ్గ'. ఇందులో గుర్తుండిపోయే పాత్ర పోషించాను" అని చెప్పారు.

యాక్షన్‌తో నిండిన ఫ్యామిలీ డ్రామా



శివ కంఠంనేని, శ్రీసూర్య, ప్రియా హెగ్డే, ప్రీతి శుక్లా నటించిన చిత్రం 'బిగ్ బ్రదర్'. గోసంగి సుబ్బారావు దర్శకత్వం వహించారు. కె. శివశంకరరావు, ఆర్.వెంకటేశ్వరరావు నిర్మించారు. ఈ నెల 24న 'బిగ్ బ్రదర్' విడుదలవుతున్న సందర్భంగా సోమవారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు మాట్లాడుతూ "ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేస్తున్నాం" అని అన్నారు. దర్శకుడు గోసంగి సుబ్బారావు మాట్లాడుతూ "ఈ సినిమా యాక్షన్‌తో నిండిన ఫ్యామిలీ డ్రామా. ఇది సినిమా ప్రేమికులందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. హీరో శివ కంఠంనేని మాట్లాడుతూ "ఈ సినిమాలో నటిస్తున్నందుకు ఆనందంగా ఉంది" అని అన్నారు. నటుడు మురళీ మోహన్ మాట్లాడుతూ "ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ సాధిస్తుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: సంతోశ్, కెమెరా: ప్రకాశ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఘంటా శ్రీనివాసరావు.

అమ్మాయిలతో జాగ్రత్త!



సూర్యరాజ్, మెరీనా సింగ్ జంటగా నటించిన చిత్రం 'ఏ 20'. అమ్మాయిలతో జాగ్రత్త అనేది ట్యాగ్‌లైన్. నూగూరి రవీంద్ర దర్శకత్వంలో పి.బి. మహేంద్ర నిర్మించిన ఈ చిత్రంలోని పాటలు, ప్రచార చిత్రం విడుదల చేశారు. మధుర ఆడియో సంస్థ ద్వారా ఈ చిత్రం పాటలు విడుదల అయ్యాయి. తెలుగు నిర్మాతలమండలి అధ్యక్షుడు దామోదర ప్రసాద్, దర్శకనిర్మాత సాయివెంకట్, వి.సముద్ర ముఖ్య అతిథులుగా హాజరై చిత్రం విజయం సాధించాలని ఆకాంక్షించారు. సంగీత దర్శకుడు యెలేందర్, గీత రచయిత దేవకరణ్, సినిమాటోగ్రాఫర్ రామ్‌ప్రసాద్, కొరియోగ్రాఫర్స్ శైలజ, శ్యామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టికెట్ మిషన్ పనిచేయడం లేదని... పురుషులకు నో ఎంట్రీ!

» ఆర్టీసీ బస్సు కండక్టర్ నిర్వాకం

» భద్రాద్రి జిల్లాలో ఘటన

కరకగూడెం, మే 20: టికెట్ మిషన్ పనిచేయడం లేదని పురుషులు బస్సు ఎక్కేందుకు ఓ కండక్టర్ నిరాకరించాడు. ఉచిత ప్రయాణ సదుపాయం ఉండడంతో మహిళలను మాత్రమే బస్సులో ఎక్కించుకొని వెళ్లాడు. దాంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ ఘటన భద్రాద్రి జిల్లా పినపాక మండలం కరకగూడెంలో సోమవారం జరిగింది. మణుగూరు డిపో నుంచి కరకగూడెం, రంగాపురం, గుండాలకు ఆర్టీసీ సర్వీసులు నడుస్తున్నాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం 7 గంటల సమయంలో గుండాల నుంచి మణుగూరు వెళ్తున్న ఒక పల్లెవెలుగు బస్సులో టికెట్ మిషన్ పనిచేయడం లేదని కరకగూడెం తదితర ప్రాంతాల్లో కండక్టర్ పురుషులను బస్సు ఎక్కించుకోలేదు. భార్యభర్తలు ఉంటే.. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కారణంగా భార్యను మాత్రమే బస్సులోకి అనుమతించాడు. దాంతో పలు పరీక్షలకు వెళ్లే విద్యార్థులు, ఇతర ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయమై మణుగూరు ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. విషయం తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో తిరిగే బస్సుల్లో కొత్త టికెట్ మిషన్లు అందించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. విఎషన్ పనిచేయకపోతే ఉన్నతాధికారులకు విషయం తెలియజేసి పేపర్‌పై టికెట్ ఇచ్చి ప్రయాణికులను గమ్యస్థలాలకు చేర్చాలని కండక్టర్లకు సూచించారు.

మూలాలు మరచిపోకూడదు

» విద్యార్థులు సమాజానికి కీర్తి తెచ్చేలా ఎదగాలి: జస్టిస్ ఎన్వీ రమణ



నరసరావుపేట లీగల్, మే 20 : విద్యార్థులు ఉన్నత చదువులు చదివినా మూలాలు మరచి పోకూడదని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకట రమణ అన్నారు. సోమవారం పల్నాడు జిల్లా నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి వద్ద నూతనంగా ఏర్పాటైన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మెరుగైన సమాజానికి కీర్తి తెచ్చే విధంగా ఎదగాలని ఆకాంక్షించారు. తాను విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు అధిక శాతం గ్రామీణ ప్రాంతాల నుంచి ఉన్నత విద్యను అభ్యసించి వచ్చిన వారే కనపడుతున్నారన్నారు. ప్రపంచంలో భారతదేశం అగ్రగామిగా ఉండబోతోందని, ప్రపంచానికి నాయకత్వం వహించే స్థాయికి ఎదుగుతున్నామన్నారు. వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి పాఠశాల అందుబాటులోకి రావటం రైతుల పిల్లలకు వరం లాంటిదంటూ నిర్వాహకులైన డాక్టర్ నాగోతు ప్రకాశరావు కుటుంబ సభ్యులను అభినందించారు.

తిరుమలలో మళ్లీ చిరుతల కలకలం

» దివ్యారామం వద్ద కనిపించినట్లు భక్తుల ఫిర్యాదు

» అప్రమత్తమైన అటవీ, విజిలెన్స్ అధికారులు

తిరుమల, మే 20(ఆంధ్రజ్యోతి): తిరుమలకు నడిచి వెళ్లే అలిపిరి మార్గంలో మరోసారి చిరుతల సంచారంతో కలకలం రేగింది. అలిపిరి మెట్లు ముగిసే దివ్యారామం వద్ద రెండు చిరుతలను చూశామంటూ కొంతమంది భక్తులు చెప్పడంతో ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అలిపిరి మెట్లు ముగిసే జీఎన్సీకి సమీపంలో రెండు చిరుతలు కనిపించడంతో సమీపంలో కాలినడకన వెళ్తున్న భక్తులు పెద్దగా కేకలు వేశారు. వెంటనే సమీపంలోని విజిలెన్స్ సిబ్బందికి సమాచారమిచ్చారు. హుటాహుటిన ఫారెస్ట్, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. అప్పటికే భక్తుల కేకలతో చిరుతలు అడవిలోకి వెళ్లిపోయాయి. అధికారులు కాలినడక భక్తులను అప్రమత్తం చేసి, గుంపులుగా అనుమతిస్తున్నారు. గతంలో జరిగిన ఘటనలను దృష్టిలో పెట్టుకుని ఉన్నతాధికారులు వివిధ విభాగాల అధికారులను అప్రమత్తం చేశారు. నిరంతరం కాలినడక మార్గంలో నిఘా ఉంచాలని ఆదేశించారు.

మా ఆవిడ నన్ను కొడుతోంది కాపాడండి

» అర్ధనగ్నంగా వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేసిన భర్త

» కామారెడ్డి జిల్లా బాన్సువాడలో ఘటన

బాన్సువాడ, మే 20 : పోలీసులను ఆశ్రయిస్తున్న భార్యా బాధితులు ఇటీవల అధికమవుతున్నారు. చిత్రహింసలకు గురి చేస్తోన్న భార్య నుంచి తనని రక్షించాలంటూ హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆదివారం మీడియా ముందు వేడుకున్న సంగతి మరువక ముందే అదే తరహా ఘటన మరొకటి రాష్ట్రంలో వెలుగు చూసింది. తన భార్య తనని తరచూ చితకబాదుతుందంటూ కామారెడ్డి జిల్లా బాన్సువాడకు చెందిన ఓ వ్యక్తి అర్ధనగ్నంగా వెళ్లి పోలీసులను ఆశ్రయించాడు. బాన్సువాడలోని రాజారాం దుబ్బాకు చెందిన గంగారాం కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. అయితే, ఆదివారం అర్ధరాత్రి స్థానిక పోలీసు స్టేషన్‌కు అర్ధనగ్నంగా వెళ్లిన గంగారాం.. తన భార్యపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. భార్య తరచూ తనపై దాడి చేస్తోందని, ఆమెపై కేసు నమోదు చేసి తనని కాపాడాలని వేడుకున్నాడు. అయితే, గంగారాం ఫిర్యాదుకు కంగుతిన్న పోలీసులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

పట్టభద్రుల ఉపఎన్నికలో కాంగ్రెస్‌కే మద్దతు: సీపీఐ

హైదరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉమ్మడి జిల్లాల శాసన మండలి పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్‌కు తమ పార్టీ మద్దతు ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శాసన మండలి ఉపఎన్నికలో మద్దతివ్వాలని కాంగ్రెస్ చేసిన విజ్ఞప్తి గురించి పార్టీలో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయం కోసం కృషి చేయాలని సీపీఐ శ్రేణులు, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజాసంఘాలకు కూనంనేని పిలుపునిచ్చారు.

జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు దరఖాస్తును 'స్థానిక బార్ నిబంధన'తో తిరస్కరించొద్దు

» సుప్రీంకోర్టు ఆదేశం.. హైకోర్టు రిజిస్ట్రీకి నోటీసులు

న్యూఢిల్లీ/హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థికి స్థానిక బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం లేదన్న కారణంతో జూనియర్ సివిల్ జడ్జి పోస్టుకు చేసుకున్న దరఖాస్తును తిరస్కరించవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ పిటిషన్‌పై పూర్తిస్థాయి విచారణ చేపట్టడానికి అంగీకరించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అనుమతి ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆధ్వర్యంలో నిర్వహించే జూనియర్ సివిల్ జడ్జి పోస్టులకు దరఖాస్తు చేయాలంటే రాష్ట్ర పరిధిలోని స్థానిక కోర్టు బార్ అసోసియేషన్‌లో సభ్యత్వం ఉండాలనే నిబంధన ఉంది. దీంతోపాటు పలు ఇతర నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను ఇటీవల తెలంగాణ హైకోర్టు కొట్టేసింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో ఎన్‌రోల్ అయిన న్యాయవాది వీ రాకేశ్ రెడ్డి సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ హృషీకేశ్‌రాయ్, జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం ఈ నిబంధనతో దరఖాస్తును తిరస్కరించరాదని ఆదేశించింది. జిల్లా జడ్జి పోస్టుల విషయంలో ఇదే తరహా నిబంధనలను సవాల్ చేస్తూ ఇప్పటికే దాఖలైన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చామని, వాటితో కలిపి ఈ పిటిషన్‌పైనా విచారణ చేపడతామని పేర్కొంది.



తిరువేంకటపతి అలంకార సేవలో అర్చకులు, అధికారులు

యాదగిరీశుడి జయంత్యుత్సవాలు

» కన్నులపండువగా శ్రీకారం

భువనగిరి అర్బన్, మే 20: యాదగిరి గుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వామివారి జయంత్యుత్సవాలు పాంచరాత్రాగమ రీతిలో సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలకు స్వస్తివాచనంతో శ్రీకారం చుట్టారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం తదితర కార్యక్రమాలు ఆలయ ప్రధానార్చకుడు నల్లంథీఘళ్ లక్ష్మీనరసింహాచార్యుల ఆధ్వర్యంలో జరిగాయి. ఉదయం తిరువేంకటపతిగా అలంకార సేవతో తిరువీధుల్లో ఊరేగించారు. రాత్రి గరుడ వాహనంపై పరమవాసుదేవ అలంకార సేవలు నిర్వహించారు. ఆలయ ఖజానాకు సోమవారం రూ.56,27,107 ఆదాయం సమకూరింది. కాగా, గుట్ట క్షేత్రంలో సంగీత సభల నిర్వహణకు ఆలయ తూర్పు దిశ ఈశాన్యంలో వేదిక ఏర్పాటు చేస్తున్నారు. నిత్యం జరిగే కైంకర్యాల వివరాలు తెలిపేందుకు ఎల్‌సీడీ స్క్రీన్లను మండపం సమీపంలో సిద్ధం చేస్తున్నారు. ఆలయ విశిష్టతను తెలిపే క్యూఆర్ కోడ్‌ను కూడా అందుబాటులోకి తేనున్నారు.

తిరుమలలో సిఫారసు లేఖల స్వీకరణ

» టీటీడీ విజ్ఞప్తికి ఈసీ ఓకే

తిరుమల, మే 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనానికి సోమవారం నుంచి టీటీడీ తిరిగి సిఫారసు లేఖలు తీసుకుంటోంది. గత నెల 16నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రాజకీయ ప్రముఖుల నుంచి బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలను తీసుకునే విధానాన్ని టీటీడీ రద్దు చేసింది. స్వయంగా వచ్చే ప్రొటోకాల్ పరిధిలోని ప్రముఖులకు మాత్రమే బ్రేక్ దర్శనాలను కల్పిస్తోంది. ఈనెల 13న ఎన్నికల ప్రక్రియ ముగియడంతో పాటు రద్దీ పెరుగుతున్న క్రమంలో టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఈ నెల 15న ఈసీకి లేఖ రాశారు. భక్తుల రద్దీ పెరిగిన క్రమంలో సిఫారసు లేఖలపై వీఐపీ బ్రేక్ దర్శనాన్ని తిరిగి ప్రారంభించాలనే డిమాండ్ ఉందని, అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. టీటీడీ అభ్యర్థనను పరిశీలించిన ఈసీ సానుకూలంగా స్పందించింది.

విమానం రద్దు.. ప్రయాణికుల నిరసన

రేణిగుంట: తిరుపతి విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం ఒక విమాన సర్వీసు రద్దు కావడంతో ప్రయాణికులు నిరసన తెలిపారు. బెంగళూరు నుంచి సాయంత్రం 3.10 గంటలకు తిరుపతి చేరుకుని తిరిగి 4.20 గంటలకు గుల్బర్గాకు స్టార్ ఎయిర్‌లైన్స్ విమానం వెళ్లాల్సి ఉంది. అయితే సాంకేతిక సమస్య కారణంగా సర్వీసు రద్దయింది. అయితే గంటన్నర ముందుగానే 32 మంది ప్రయాణికులు విమానాశ్రయానికి చేరుకున్నారు. విమాన సర్వీసు రద్దయిన విషయం తెలిసి ఆందోళన వ్యక్తం చేశారు. స్టార్ ఎయిర్‌లైన్స్ యాజమాన్యం స్పందించకపోవడంతో టికెట్ బుకింగ్ కౌంటర్ వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. మంగళవారం వస్తే గుల్బర్గాకు పంపిస్తామని చెప్పడంతో కొంతమంది ఆ ప్రతిపాదనకు అంగీకరించారని సమాచారం. మరికొందరు టికెట్ డబ్బులు తీసుకుని వెళ్లిపోయారు.

కంగనా.. గో బ్యాక్!

సిమ్లా, మే 20: నటి కంగనా రనౌత్‌కు ఎన్నికల ప్రచారంలో నిరసన సెగ తగిలింది. బీజేపీ తరఫున మండీ లోక్‌సభ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆమె సోమవారం లాహల్ స్పితి లోయలోని కాజా ప్రాంతానికి వెళ్లారు. అక్కడ స్థానికులు 'కంగనా గో బ్యాక్' అంటూ నినాదాలు చేశారు. నల్ల జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. గతేడాది కంగన బౌద్ధ గురువు దలైలామాపై వివాదాస్పద ట్వీట్ చేశారు. దీనిపై అభ్యంతరాలు రాగా.. ఆమె క్షమాపణలు చెప్పా రు. తాజాగా, అదే ఘటనపై కాజాలో స్థానికులు కంగన పట్ల నిరసన వ్యక్తం చేశారు.

మత్తు మజా.. మస్త్ మజా!

హైదరాబాద్ వ్యాపారి బర్త్ డే సందర్భంగా బెంగళూరులోని ఫాం హౌస్‌లో రేవ్ పార్టీ

» పార్టీలో ఏపీ రాజకీయ, సినీ ప్రముఖులు

» విమానాల్లో తరలించిన నిర్వాహకులు

» 75 శాతంపైగా ఏపీ, తెలంగాణ వాసులే

» కన్నడ సీరియల్ నటులు, మోడల్స్ సైతం..

» భారీగా డ్రగ్స్ స్వాధీనం.. ఐదుగురిపై కేసు

బెంగళూరు, హైదరాబాద్ సిటీ, మే 20 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో మత్తులో ఊగుతూ మస్త్‌గా ఎంజాయ్ చేస్తూ.. ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు పట్టుబడ్డారు. వారిలో పలువురు సీరియల్ నటులు, మోడల్స్ ఉన్నట్టు సమాచారం. హైదరాబాద్‌కు చెందిన బడా వ్యాపారి బర్త్‌డే సందర్భంగా బెంగళూరులోని ఓ ఫాంహౌస్‌లో ఈ రేవ్ పార్టీ నిర్వహించారు. పార్టీలో భారీగా డ్రగ్స్ వినియోగిస్తున్నారనే సమాచారం మేరకు బెంగళూరు సీసీబీ పోలీసులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆ ఫాంహౌస్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ నేతలతోపాటు.. టాలీవుడ్ నటులు, మోడల్స్ మాదక ద్రవ్యాలు వినియోగిస్తూ అడ్డంగా దొరికిపోయారు. ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ నార్కోటిక్ బ్యూరో అధికారులు మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపుతుండటంతో సదరు వ్యాపారి.. బెంగళూరు ఎలక్ట్రానిక్ సిటీ పరిధిలోని జీఆర్ ఫాంహౌస్‌లో బర్త్ డే పార్టీ పేరుతో రహస్యంగా రేవ్ పార్టీ నిర్వహించినట్లు తెలుస్తోంది. ఈ పార్టీకి హాజరైన వారిలో తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలు, సినీ, టీవీ నటులు, మోడల్స్ కూడా ఉన్నట్లు తెలిసింది. పార్టీలో మద్యంతో పాటు పెద్ద ఎత్తున డ్రగ్స్ వినియోగించినట్లు తెలిసింది. ఆదివారం సాయంత్రం ప్రారంభమైన పార్టీ రాత్రి 12 గంటలకు ముగియాల్సి ఉన్నా.. ఆ తర్వాత కూడా డీజేలతో హోరెత్తించడంతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. దీంతో స్థానికులు హెబ్బగూడి పోలీసులకు సమాచారమిచ్చారు. దీంతో బెంగళూరు సీసీబీ (సిటీ క్రైమ్ బ్రాంచి) పోలీసులు ఈ ఫాంహౌస్‌పై దాడి చేసి పార్టీలో పాల్గొన్న సుమారు 100 మంది యువతీ యువకులను అదుపులోకి తీసుకున్నారు. వారిలో 75 శాతం మందికిపైగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వాసులని వారిలో రాజకీయ, సినీ ప్రముఖులు ఉన్నారని సమాచారం. కన్నడ సీరియల్ నటులతోపాటు 20 మందికిపైగా మోడల్స్ పార్టీలో పాల్గొన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో 17 గ్రాముల ఎండీఎంఏ, కొకైన్‌తోపాటు 15 ఖరీదైన కార్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అక్కడ వైసీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధనరెడ్డి పేరుతో పాస్ ఉన్న కారు సైతం లభ్యమైందని తెలిసింది. ఐతే.. ఈ ఆరోపణలను కాకాణి ఖండించారు. ఆ కారుతో తనకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. కారుపై ఉన్న స్టిక్కర్ నిజమైనదో కాదో పోలీసులు తేల్చుతారన్నారు. ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఫాంహౌస్ నుంచి బయటకు వస్తున్న యువకులు

వైద్య పరీక్షలు..

ఈ పార్టీలో పాల్గొన్న 30 మంది యువతులు, 70 మంది యువకులు ఏపీ, హైదరాబాద్ నుంచి బెంగళూరుకు విమానంలో వచ్చినట్టు తెలుస్తోంది. ఈవెంట్ కోసం ఫాం హౌస్ నిర్వాహకులకు రూ.30 నుంచి రూ.50 లక్షల వరకూ చెల్లించినట్టు సమాచారం. రేవ్ పార్టీలో పాల్గొన్న వారిలో సినీ, రాజకీయ ప్రముఖులు ఎంతమంది ఉన్నారు..? వారిలో ఎవరెవరు డ్రగ్స్ తీసుకున్నారు..? అనేది తెలియరాలేదు. అందుకోసం మెడికల్ టెస్టులు నిర్వహించడానికి ప్రత్యేక వైద్య బృందాన్ని రప్పించినట్లు ఎలక్ట్రానిక్ సిటీ పోలీసులు వెల్లడించారు. పట్టుబడ్డ వారికి ప్రస్తుతం వైద్యపరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఆ తర్వాతనే పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు స్పష్టం చేశారు.

పార్టీలో లేనన్న హేమ... ఉందన్న పోలీసులు..?

పార్టీలో పాల్గొన్న వారిలో టాలీవుడ్ సినీ నటులు, టీవీ నటులు, మోడల్స్ ఉన్నట్లు తేలడంతో పాటు.. ప్రముఖ తెలుగు నటి హేమ కూడా ఉన్నారని మీడియాలో వార్తలు వైరల్ అయ్యాయి. మీడియాలో వస్తున్న కథనాలు తెలుసుకున్న హేమ.. రేవ్ పార్టీలో తాను పాల్గొనలేదని, హైదరాబాద్‌లోనే ఫాంహౌస్‌లో చిల్ అవుతున్నానని ఓ వీడియో రిలీజ్ చేశారు. బెంగళూరులో పట్టుబడినట్టు మీడియాలో వస్తున్న వార్తలను ఖండించారు. అయితే సాయంత్రానికి నటి హేమ తమ అధీనంలోనే ఉందని బెంగళూరు పోలీసులు వెల్లడించినట్టు వార్తలొచ్చాయి. హేమ రిలీజ్ చేసిన వీడి యో నిజం కాదని, అందరినీ తప్పుదోవ పట్టించడానికి యత్నించినట్లు పోలీసులు తెలిపినట్టు సమాచారం.

నాకు పార్టీలకు వెళ్లే అలవాటు లేదు: శ్రీకాంత్

బెంగళూరులో జరిగిన రేవ్‌పార్టీలో పట్టుబడ్డ వారిలో ప్రముఖ తెలుగు సినీనటుడు శ్రీకాంత్ కూడా ఉన్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. దాంతో వెంటనే స్పందించిన శ్రీకాంత్.. హైదరాబాద్‌లోని తన ఇంట్లోంచి బయటకు వచ్చి ఒక వీడియో విడుదల చేశారు. నాకు పార్టీలకు, పబ్‌లకు వెళ్లే అలవాటులేదని పేర్కొన్నారు. ఎక్కడైనా బర్త్‌డే పార్టీలకు వెళ్లినా కొద్దిసేపు ఉండి వెంటనే వచ్చేస్తానన్నారు. అయితే బెంగళూరు పోలీసులకు పట్టుబడ్డ వారిలో ఒక వ్యక్తి అచ్చం నాలాగే కనిపించడంతో మీడియా మిత్రులు పొరపాటుపడి ఉంటారని, అందులో వారి తప్పేంలేదని వీడియోలో స్పష్టం చేశారు.

లంచావతారాలు





ఏసీబీకి చిక్కిన నానాజీపూర్ కార్యదర్శి రాధిక, బిల్ కలెక్టర్ బాల్‌రాజ్, కమలాపూర్ తహసీల్దార్ మాధవీలత

» ఇంటి నంబర్ కేటాయించేందుకు 35 వేలు తీసుకున్న పంచాయతీ కార్యదర్శి

» భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.5 వేలు వసూలు చేసిన తహసీల్దార్

» ఫైలు ఉన్నతాధికారికి పంపేందుకు రూ.7వేలు తీసుకున్న సీనియర్ అసిస్టెంట్

హైదరాబాద్, కమలాపూర్, సిరిసిల్ల క్రైం, శంషాబాద్/శంషాబాద్ రూరల్, మే 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని పలువురు ప్రభుత్వ ఉద్యోగులు లంచాలు తీసుకుంటూ సోమవారం అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కి చిక్కారు. ఇంటి నెంబరు కేటాయించేందుకు రూ.35 వేలు లంచం తీసుకుంటూ రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం నానాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాధిక, ఆమెకు సహకరించిన బిల్ కలెక్టర్ బాల్‌రాజ్ ఏసీబీకి పట్టుబడ్డారు. మరో ఘటనలో వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్‌కు రూ.5వేలు లంచం తీసుకున్న హనుమకొండ జిల్లా కమలాపూర్ తహసీల్దార్ మాధవీలతను ఏసీబీ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంది. కమలాపూర్ మండలం కన్నూరుకు చెందిన కసరబోయిన గోపాల్ తన తండ్రి రాజయ్య పేర ఉన్న 3.02 ఎకరాల వ్యవసాయ భూమిని గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి ఈ నెల 9 ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నాడు. రిజిస్ట్రేషన్ చేయాలంటే తనకు రూ.5వేలు, ధరణి ఆపరేటర్ రాకేష్‌కు రూ.వెయ్యి లంచం ఇవ్వాలని తహసీల్దార్ తేల్చి చెప్పడంతో గోపాల్ ఏసీబీని ఆశ్రయించారు. మరో ఘటనలో కాంట్రాక్టర్ నుంచి రూ.7 వేలు లంచం తీసుకున్న రాజన్న సిరిసిల్ల జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఓ సీనియర్ అసిస్టెంట్ ఏసీబీకి పట్టుబడ్డాడు. జిల్లాలోని గంభీరావుపేట మండలం లింగన్నపేటకు చెందిన వెంకటేశం అనే కాంట్రాక్టర్ తమ గ్రామంలోని శ్మశాన వాటిక ప్రహరీ నిర్మాణం చేపట్టారు. రూ.4.50 లక్షలతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లు ఫైలును చీఫ్ ప్లానింగ్ అధికారికి పంపేందుకు భాస్కర్‌రావు రూ.8వేలు లంచం డిమాండ్ చేశాడు. వెంకటేశం ఏసీబీకి ఫిర్యాదు చేయగా అధికారులు భాస్కర్‌రావు రూ.7వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఈ ఏడాది ఇప్పటిదాకా ఏసీబీ ట్రాప్, ఆదాయానికి మించిన ఆస్తులకు సంబంధించి మొత్తం 67 కేసులు నమోదు చేసింది. గతంతో పోలిస్తే ఐదు నెలల్లో ఇన్ని కేసులు నమోదు కావడం విశేషం.

అవినీతిపై ఫిర్యాదులకు సోషల్ మీడియా

అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగులపై సోషల్ మీడియా ద్వారా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కూడా ఏసీబీ స్వీకరిస్తుంది. ఎక్స్(ట్విట్టర్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వేదికగా బాధితులు ఫిర్యాదు చేసే అవకాశం కల్పించింది. ప్రజలు ఏసీబీకి www.acb.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ ఫిర్యాదులు అందజేయవచ్చు. లేదా 94404 46106 నెంబర్‌కు వాట్సాప్ చేయవచ్చు. టోల్ ఫ్రీ నెం 1064కు డయల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చు. ఏసీబీ తెలంగాణ ఫేస్‌బుక్ ఖాతా ద్వారా కూడా ఫిర్యాదులు చేయవచ్చు.

సిబ్బంది కొరతతో మరుగున పడుతున్న కీలక కేసులు

అవినీతికి పాల్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో దూకుడుగా ఉంటున్న ఏసీబీకి సిబ్బంది కొరత సమస్యగా మారింది. ఆ విభాగంలో సిబ్బంది కొరత వల్ల కొన్ని కీలక కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండిపోతుంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీ కేసు ఇందుకు ఉదాహరణ. ఈ కేసు దర్యాప్తు తొలుత దూకుడుగా సాగినా క్రమంగా నెమ్మదించింది. ఈ కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ప్రైవేటు వ్యక్తులు దుబాయ్‌లో తల దాచుకున్నట్లు గుర్తించిన అధికారులు వారి విషయంలో ఎలాంటి ముందడుగు వేయలేకపోయారు. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కేసు దర్యాప్తు కూడా ఇలానే నెమ్మదించింది.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం!

» 24న వాయుగుండంగా మారే అవకాశం

» నేడు, రేపు వానలు.. 40 డిగ్రీలపైనే ఎండలు

» పిడుగుపాటుకు ఇద్దరి మృతి



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో బుధవారం అల్పపీడనం ఏర్పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సోమవారం వెల్లడించింది. ఈ అల్పపీడనం తొలుత వాయవ్య దిశగా కదిలి ఈనెల 24వ తేదీ నాటికి మధ్య బంగాళాఖాతం ప్రాంతంలో వాయుగుండంగా బలపడే అవకాశముందని తెలిపింది. ఇక మంగళ, బుధ వారాల్లో రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని వివరించింది. అలాగే ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. ఈ రెండ్రోజులు రాష్ట్రంలోని సగానికిపైగా జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగానే నమోదవుతాయని పేర్కొంది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

హైదరాబాద్, వికారాబాద్‌లో వానలు!

హైదరాబాద్, వికారాబాద్ జిల్లాతో పాటు అక్కడక్కడ సోమవారం సాయంత్రం వర్షాలు కురిశాయి. పొద్దంతా ఎప్పటిలాగే ఎండలు మండిపోయాయి. ఆదిలాబాద్ జిల్లా బేలలో అత్యధికంగా 42.6 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. హైదరాబాద్‌లోని శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, నాంపల్లి, మోతీనగర్, మూసాపేట, హైదరాబాద్ యూనివర్సిటీ, బాలాజీనగర్, జీడిమెట్ల, జియాగూడ, కూకట్‌పల్లి, బండ్లగూడ, హయత్‌నగర్, మియాపూర్, ఖైరతాబాద్, బషీర్‌బాగ్ ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. వర్షానికి పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వికారాబాద్ జిల్లాలో పలుచోట్ల చెట్లు విరిగిపడగా, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగి సరఫరాలో అంతరాయం ఏర్పడింది. జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. అకాల వర్షాలతో మర్పల్లి మండలంలోని ఉల్లి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాలకు పొలాల దగ్గర నిల్వ చేసిన ఉల్లి పంట కుళ్లిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, వికారా బాద్ జిల్లాలోని రుద్రారం, తాండూరులలో పిడుగుపాటుకు ఇద్దరు మరణించగా.. మరొకరు గాయపడ్డారు. యాలాల మండల పరిధిలోని హాజీపూర్ శివారులో పిడుగు పడి మొగులప్పకు చెందిన ఐదు మేకలు మృతి చెందాయి.

అర్హత లేకున్నా వైద్యం.. కాలం చెల్లిన ఔషధాలు

» నల్లగొండ జిల్లాలో నకిలీ ఆర్‌ఎంపీపై కేసు

పెద్దఅడిశర్లపల్లి, మే 20: అర్హత లేకున్నా వైద్యం చేస్తూ, ధ్రువీకరణ పత్రాలు లేకున్నా ఔషధాలు విక్రయిస్తున్న ఆర్‌ఎంపీపై ఔషధశాఖ అధికారులు కేసు నమోదు చేశారు. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం అజ్మాపురం గ్రామంలో బండి సైదిరెడ్డి 20 సంవత్సరాలుగా క్లీనిక్ నడుపుతున్నారు. ఆయన అర్హత లేకున్నా ఆర్‌ఎంపీ పేరిట చలామణి అవుతూ లైసెన్స్ లేకుండా కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నారనే ఫిర్యాదు అందడంతో సోమవారం ఔషధశాఖ అధికారులు సైదిరెడ్డి క్లినిక్‌లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీలో భాగంగా రూ.71వేల విలువైన 42 రకాల ఔషధాలను సీజ్ చేశారు. అనుమతి లేకుండా విక్రయిస్తున్న 31 రకాల ఔషధాలు, రెండు రకాల కాలం చెల్లిన మందులు, తొమ్మిది రకాల ఫిజీషియన్ శాంపిల్స్‌ను సీజ్ చేశారు. సైదిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనతో మండలంలోని అన్నీ మెడికల్ దుకాణాలను మూసివేశారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

నవాబ్‌పేట, మే 20 : తోటి కూలీలతో కలిసి ఉపాధి పనుల్లో పాల్గొన్న కొద్దిసేపటికే ఓ కూలీ గుండె పోటుతో మృతి చెందాడు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొండాపూర్‌లో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కావటి వెంకటయ్య (63) తోటి కూలీలతో కలిసి గ్రామ శివారులో ఉన్న తూం చెరువులో ఒండ్రు మట్టి తరలింపునకు వెళ్లి అక్కడ పని చేస్తుండగా ఉదయం 11 గంటల సమయంలో చాతీలో నొప్పి తీవ్రంగా రావడంతో ఫీల్డ్ అసిస్టెంట్ శంకరయ్యకు చెప్పాడు. వెంటనే ఆసుపత్రికి వెళ్లమని చెప్పి అక్కడి నుంచి ఇంటికి పంపగా ఇంటివద్ద నొప్పి తీవ్రమై అక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు వైద్యుడి దగ్గరకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.



ఎల్లారెడ్డి- నాందేడ్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు

నిజాంసాగర్‌లో రైతుల ధర్నా

» ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై మండిపాటు

నిజాంసాగర్, మే 20: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం, కోత విధించడంపై ఆగ్రహించిన కామారెడ్డి జిల్లా రైతులు సోమవారం నిజాంసాగర్‌లో ధర్నా చేశారు. సుమారు 50 మంది రైతులు రాస్తారోకో నిర్వహించి ఎల్లారెడ్డి-నాందేడ్ ప్రధాన రహదారిని నిర్బంధించారు. 6 వేల బస్తాల వరకు ధాన్యం నిల్వ ఉన్నప్పటికీ రైస్‌మిల్లర్లు ఆంక్షలు విధిస్తూ ధాన్యంలో కోత విధిస్తున్నారని రైతులు ఆరోపించారు. ఇటీవల నిజామాబాద్ జిల్లాలోని రైస్‌మిల్లర్లు బస్తాకు 42 కిలోల 600 గ్రాములుంటేనే వరి ధాన్యం తీసుకుంటామని తెలిపారన్నారు. అయితే ఇప్పటి వరకు 31,10,039 బస్తాల ధాన్యం వివిధ రైస్‌మిల్లులకు వెళ్లినట్లు విండో అధికారులు తెలిపారు. 40 లారీల్లో ఆయా రైస్‌మిల్లులకు పంపగా, కోత విధించలేదని వారు చెబుతున్నారు. రహదారిపై రాస్తారోకో చేయడంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడకు వచ్చి రైతులకు నచ్చజెప్పి ధర్నా విరమింపజేశారు.

దేశంలో పెనుమార్పు: రాహుల్

న్యూఢిల్లీ, రాయబరేలీ(యూపీ), మే 20: దేశంలో పెనుమార్పు సంభవిస్తోందని రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజలు అండగా ఉన్నారన్నారు. అయిదో దశలో భాగంగా సోమవారం ఆరు రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో 49 స్థానాలకు ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా రాహుల్ ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. మొదటి నాలుగు దశల్లో ప్రజలు రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు అండగా నిలిచారని స్పష్టమయిందని ఆయన తెలిపారు. దేశం విద్వేష రాజకీయాలు రాజకీయాలతో విసిగిపోయి ఉందని, ప్రస్తుతం ప్రజలు అసలైన సమస్యల గురించి ఆలోచించి ఓటు వేస్తున్నారని, బీజేపీతో పోరాడుతున్నారని అన్నారు. తాను పోటీ చేస్తున్న రాయబరేలీలోని పలు పోలింగ్ కేంద్రాలను రాహుల్ సందర్శించారు. రాయబరేలీలోని ఓ హనుమాన్ ఆలయానికి వెళ్లి పూజలు చేశారు.

మెగసెసె నుంచి వైఎస్ వరకు





విమాన, హెలికాప్టర్ ప్రమాదాల్లో పలువురు నేతల దుర్మరణం

- నటి సౌందర్య, భారత తొలి సీడీఎస్ బిపిన్ రావత్ వంటి ప్రముఖులూ

న్యూఢిల్లీ, మే 20: హెలికాప్టర్ కూలిపోయిన దుర్ఘటనల్లో వివిధ దేశాలకు చెందిన అధ్యక్షులు పలువురు గతంలో ప్రాణాలు కోల్పోయారు. ఇంకొందరు ప్రజాదరణ పొందిన నాయకులూ మృతిచెందారు. ఫిలిప్పీన్స్ ఏడో అధ్యక్షుడిగా పనిచేస్తూ, అవినీతిపై ఉక్కుపాదం మోపిన రమోన్ మెగసెసే నుంచి ఉమ్మడి ఏపీకి సీఎంగా వ్యవహరించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వంటి వారు ఉన్నారు. మెగసెసే 1957లో చనిపోయారు. వివిధ రంగాల్లో సేవలందిస్తున్నవారికి ఇస్తున్న ప్రతిష్ఠాత్మక మెగసెసే అవార్డు 'రమోన్ మెగసెసే' స్మృత్యర్థం నెలకొల్పిందే. వైఎస్ 2009లో మృతిచెందారు. భారత్ విషయానికి వస్తే లోక్‌సభ స్పీకర్‌గా ఉన్న ఏపీకి చెందిన నాయకుడు జీఎంసీ బాలయోగి 2002లో, ప్రముఖ నటి సౌందర్య 2004లో హెలికాప్టర్ ప్రమాదాల్లో అకాల మరణం పాలయ్యారు. భారత తొలి సీడీఎస్ బిపిన్ రావత్ 2021 డిసెంబరులో జరిగిన ఘటనలో చనిపోయారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ కుమారుడు సంజయ్‌గాంధీ (1980), కాంగ్రెస్ అగ్రనేత మాధవరావు సింధియా (2001) విమానాలు కూలడంతో మృతిచెందారు. మాధవరావు కుమారుడు జ్యోతిరాదిత్య సింధియా ప్రస్తుతం విమానయాన శాఖ మంత్రిగా ఉండడం గమనార్హం. మరోవైపు పాకిస్థాన్ అధ్యక్షుడు జనరల్ జియా ఉల్ హక్ (1988), స్వీడన్ ప్రధాని అర్విడ్ లిండ్‌మాన్ (1936), బ్రెజిల్ అధ్యక్షులు రామోస్ (1958), ఇరాక్ అధ్యక్షుడు అబ్దుల్ సలామ్ ఆరిఫ్ (1966)లు విమాన ప్రమాదాల్లో అర్థంతరంగా తనువు చాలించారు. 2020లో ప్రఖ్యాత బాస్కెట్ బాల్ ఆటగాడు కోబ్ బ్రయాంట్ కుమార్తెతో సహా హెలికాప్టర్ ప్రమాదంలో చనిపోయారు.

ఇరాన్‌లో సంబరాలు జరుపుకొన్న ప్రజలు!

- ఇజ్రాయెల్ పనేనంటూ నెటిజన్ల ట్రోల్

టెహ్రాన్/టెల్అవీవ్, మే 20: ఇబ్రహీం రైసీ మరణంపై నెటిజన్లు భిన్నంగా స్పందించారు. ఇది ఇజ్రాయెల్ పనేనా? అంటూ ఎక్కువ మంది ట్రోల్ చేశారు. రైసీ ఆదివారం ఉదయం డ్యామ్ ప్రారంభోత్సవం నిమిత్తం అజర్‌బైజాన్ దేశానికి వెళ్లారని, ఆ దేశానికి ఇజ్రాయెల్‌తో సత్సంబంధాలున్నాయని నెటిజన్లు గుర్తుచేశారు. అజర్‌బైజాన్ సరిహద్దుకు 20 కిలోమీటర్ల దూరంలో రైసీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ కూలిపోవడం ఇజ్రాయెల్ పనేనంటూ నెటిజన్లు పోస్టులు పెట్టారు. ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండించింది. హెలికాప్టర్ ప్రమాదానికి తమ దేశానికి ఎలాంటి సంబంధం లేదని వివరించింది. ఇదిలా ఉండగా, రైసీ హెలికాప్టర్ కూలిపోయిందని ఆదివారం సాయంత్రం వార్తలు రావడంతోనే.. టెహ్రాన్‌తోపాటు.. పలు నగరాల్లో ఇరానీయులు సంబురాలు జరుపుకొన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కఠిన శిక్షలకు కేంద్ర బిందువుగా ఉన్న రైసీ మరణం తమకు సంతోషంగా ఉందని పలువురు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. రెండేళ్ల క్రితం హిజాబ్‌కు వ్యతిరేకంగా ఇరాన్‌లో జరిగిన ఆందోళనలను అణచివేయడంలో రైసీది కీలక భూమిక అని, ఆ సందర్భంలో ప్రభుత్వం చేతిలో 500 మందికి పైగా మరణించారని గుర్తుచేస్తున్నారు.

హెలికాప్టర్ ప్రమాదంలో.. ఇరాన్ అధ్యక్షుడి దుర్మరణం

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నాయి. హెలికాప్టర్ కూలిపోగానే చెలరేగిన మంటల్లో రైసీ, ఇరాన్ విదేశాంగ మంత్రి ఆమిర్ అబ్దుల్లాహియాన్(60), తూర్పు అజర్‌బైజాన్ గవర్నర్ మాలిక్ రహ్మతీ, తబ్రీజ్ ప్రావిన్స్ ఇమామ్ సహా.. మొత్తం ఎనిమిది మంది మృతిచెందినట్లు గుర్తించారు. ఉదయం 8 గంటల సమయంలో ఇరాన్ ప్రభుత్వం ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. హెలికాప్టర్ శకలాలు, మృతదేహాలను తరలిస్తున్న చిత్రాలను మీడియాకు అందజేసింది. టెహ్రాన్‌లో బుధవారం రైసీ అంత్యక్రియలు జరుగుతాయని వివరించింది. అత్యవసరంగా భేటీ అయిన ఇరాన్ క్యాబినెట్.. ఐదు రోజులపాటు సంతాపదినాలను ప్రకటించింది. కాగా.. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీకి రైసీ నమ్మిన బంటు. ఖమేనీకి రైసీనే వారసుడని సుప్రీంలీడర్‌ను ఎన్నుకునే 88 మంది సభ్యులున్న 'అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ కమిటీ' సభ్యులంతా విశ్వసించేవారు. మరణించే వరకు రైసీ ఆ కమిటీకి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఇబ్రహీం రైసీ 1960 నవంబరులో మషాద్‌లో జన్మించారు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మికత వైపు మొగ్గుచూపేవారు. అలా కోమ్ నగరంలో యువ మతగురువుగా ప్రజాక్షేత్రంలోకి వచ్చారు. రైసీకి ఖమేనీతో కోమ్‌లోనే పరిచయం ఏర్పడింది. పాశ్చాత్య మద్దతు ఉన్న షా పాలనకు వ్యతిరేకంగా 1979లో జరిగిన విప్లవోద్యమంలో రైసీ పాల్గొన్నారు. కాగా, ప్రమాదంపై దర్యాప్తునకు ఖమేనీ ఆదేశాలు జారీ చేశారు. వైమానికదళం చీఫ్ అబ్దుల్లాహీకి దర్యాప్తు బాధ్యతలు అప్పగించారు.

రైసీ అలియాస్ డెత్ కమిషన్!

యుద్ధ ఖైదీల పట్ల రైసీ అత్యంత క్రూరంగా వ్యవహరించేవారని, అందుకే ఆయనను 'డెత్ కమిషన్' అని పిలుస్తారని చెబుతుంటారు. 1988 ఇరాన్-ఇరాక్ యుద్ధ ఖైదీల విచారణకు రైసీ దేశవ్యాప్తంగా 'డెత్ కమిషన్'లను నియమించారు. యుద్ధ ఖైదీలపై ఎలాంటి విచారణ లేకుండానే మరణ శిక్షలను విధించడం 'డెత్ కమిషన్' లక్ష్యం..! ఇలా అప్పట్లో 5 వేల మందికి పైగా యుద్ధ ఖైదీలను దారుణంగా హతమార్చారనే అభియోగాలున్నాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ కూడా ఈ దారుణాలపై రైసీని విచారించాలని పిలుపునిచ్చింది. ఇరాన్‌లో మరణ శిక్ష అంటే ఉరి ఒక్కటే కాదు..! రాళ్లతో కొట్టి చంపడం, కొండ శిఖరాల నుంచి కిందకు తోసేయడం వంటి శిక్షలు ఉంటాయి. యుద్ధ ఖైదీలే కాకుండా.. ప్రభుత్వ విధానాలను విమర్శించే వారినీ ఇలాగే చిత్ర హింసలు పెట్టి, చంపేవారని సెంటర్ ఫర్ హ్యూమన్ రైట్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హాదీ ఘేమీ పేర్కొన్నారు. అలా క్రూరమైన శిక్షలతో రాజకీయ ప్రత్యర్థులను వణికించిన రైసీ దారుణాలు 2017 అధ్యక్ష ఎన్నికల సమయంలో వెలుగులోకి వచ్చాయి. ఆ ఎన్నికల్లో హసన్ రౌహానీ చేతిలో రైసీ ఓడిపోయారు. డెత్ కమిషన్‌పై విచారణ జరిపించిన అమెరికా 2019లో రైసీపై ఆంక్షలను విధించింది. 2021 ఎన్నికల్లో రైసీ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. హమాస్, హౌతీ, హిజ్బుల్లా, ఇస్లామిక్ జిహాద్ ఉగ్రసంస్థలను రైసీ పెంచి, పోషించారనే ఆరోపణలున్నాయి.


ప్రమాద స్థలం నుంచి మృతదేహాలను తరలిస్తున్న దృశ్యం.

ప్రపంచ దేశాధినేతల దిగ్భ్రాంతి

రైసీ మృతిపట్ల ప్రపంచ దేశాధినేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రైసీ మరణం ఇరానీయులు తీరని లోటని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ అన్నారు. చైనా ఓ మంచి మిత్రుణ్ని కోల్పోయిందని వ్యాఖ్యానించారు. కాగా, రైసీ గౌరవార్థం న్యూఢిల్లీలోని ఇరాన్ ఎంబసీ సోమవారం రాయబార కార్యాలయంలోని ఇరాన్ జెండాను అవనతం చేసింది.

రైసీ మృతి దిగ్భ్రాంతిని కలిగించింది

రైసీ మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. భారత్-ఇరాన్ సంబంధాల బలోపేతానికి ఆయన చేసిన కృషి మరవలేనిది. ఆయన కుటుంబ సభ్యులకు, ఇరాన్ ప్రజలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ విచార సమయంలో ఇరాన్‌కు అండగా ఉంటాం. రైసీ, అబ్దుల్లాహియాన్, ఇతర అధికారుల సంస్మరణార్థం భారత్‌లో ఒక రోజు సంతాప దినాన్ని ప్రకటిస్తున్నాను. - భారత ప్రధాని నరేంద్ర మోదీ

తాత్కాలిక అధ్యక్షుడిగా మొఖ్బేర్

రైసీ మరణంతో ఇరాన్ తాత్కాలిక అధ్యక్షుడిగా మహమ్మద్ మొఖ్బేర్ నియమితులయ్యారు. ప్రస్తుతం మొఖ్బేర్ మొదటి ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం అధ్యక్షుడు మరణించినా.. రాజీనామా చేసినా.. ఉపాధ్యక్షుల్లో మొదటి స్థానంలో ఉన్నవారిని తాత్కాలిక అధ్యక్షుడిగా నియమిస్తారు. ఆ తర్వాత 50 రోజుల్లో అధ్యక్ష ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. రైసీతోపాటు హెలికాప్టర్‌లో ఉన్న విదేశాంగ మంత్రి ఆమిర్ అబ్దుల్లాహియాన్ మరణించిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో మహమ్మద్ అలీ బఘేరీని నియమిస్తూ ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేని ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా, కొత్త అధ్యక్షుడిని ఎన్నుకునే తేదీని ఇరాన్ ఎన్నికల కమిషన్ ప్రకటించింది. జూన్ 29న కొత్త అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని తెలిపింది.

టెక్నాలజీలో వెనకంజలో ఇరాన్!

వెపన్ గ్రేడ్ యురేనియం తయారీలో ఇరాన్ ముందున్నా.. టెక్నాలజీలో వెనకంజలో ఉన్నట్లు తాజా హెలికాప్టర్ ప్రమాదం స్పష్టం చేస్తోంది. రైసీ ప్రయాణానికి వినియోగించిన హెలికాప్టర్ బెల్-212 కేటగిరీకి చెందినది. ఇది అమెరికా తయారీ. 1970లలో కొనుగోలు చేసిన హెలికాప్టర్. ఇదొక్కటే కాదు.. ఇరాన్ సైన్యం వాడుతున్న హెలికాప్టర్లు, యుద్ధ విమానాల్లో సింహభాగం కాలం చెల్లినవే..! ఇరాన్‌పై ఆంక్షల కారణంగా వీటి మరమ్మతులకు విడిభాగాలను కూడా దిగుమతి చేసుకోలేని స్థితిలో ఇరాన్ ఉంది. ప్రతికూల వాతావరణానికి.. దాదాపుగా కాలం చెల్లిన హెలికాప్టర్ తోడవ్వడంతో ఈ ప్రమాదం జరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు.. కూలిన హెలికాప్టర్‌ను గాలించడంలో ఇరాన్ విఫలమైనట్లు స్పష్టమవుతోంది. హెలికాప్టర్ ఆదివారం మధ్యాహ్నం కూలిపోతే.. సోమవారం తెల్లవారుజాము వరకు దాని జాడను కనుక్కోలేకపోయారు. రాత్రిళ్లు అడవుల్లో గాలింపు చేపట్టే టెక్నాలజీకి కూడా ఇరాన్ నోచుకోలేదు. తుర్కియే, జోర్డాన్ వంటి దేశాలు ముందుకు రావడంతోనే.. రాత్రంతా గాలింపు సులభమైంది. హెలికాప్టర్ పైలట్ వాడిన సెల్‌ఫోన్ లొకేషన్‌ను గుర్తించడంలోనూ తుర్కియే సాంకేతిక సమాచారం అందించింది.

ఇరాన్ ప్రగతిలో రైసీ ముద్ర

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి



ఇబ్రహీం రైసీ హయాంలో ఇరాన్ బలీయమైన శక్తిగా ఎదిగింది. ఉద్రిక్తతలు, అశాంతికి నెలవైన మధ్య ప్రాచ్య దేశాల్లో.. ఆర్థిక ఆంక్షలు, అంతర్గత నిరసనల మధ్య కూడ ఇరాన్ ప్రగతిని సాధించడంలో రైసీ కీలకపాత్ర పోషించారు. రైసీ తన పదవీకాలంలో సంక్లిష్టమైన ఇజ్రాయెల్-పాలస్తీనా ఉద్రిక్తతను మరింత పెంచారు. ఇజ్రాయెల్ చరిత్రలో మొదటిసారిగా గత అక్టోబరులో హమాస్ జరిపిన క్షిపణి దాడులకు ఇరాన్ లోపాయికారీగా పూర్తి మద్దతు ఇచ్చింది. తదనంతరం గాజాపై ఇజ్రాయెల్ సృష్టించిన మారణకాండ వల్ల అరబ్ దేశాలు అయోమయ స్థితిని ఎదుర్కొంటున్నాయి. ఈ యుద్ధం ద్వారా అరబ్ దేశాలు ఇజ్రాయెల్ దగ్గరకు చేరకుండా ఇరాన్ వ్యూహాత్మకంగా వ్యవహరించిందని విశ్లేషకుల అభిప్రాయం. గల్ఫ్‌కు పొరుగున ఉన్న కీలకమైన యెమెన్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించడంలో కూడా రైసీ విజయం సాధించారు. హూతి సాయుధ షియా వర్గాల ద్వార ఎర్ర సముద్రంలో ఇజ్రాయెల్‌కు వెళ్లే నౌకలపై దాడులతో ప్రపంచం నివ్వెరపోయింది. ఇజ్రాయెల్ పొరుగున ఉన్న లెబనాన్, సిరియా దేశాల్లోని షియా వర్గాల సహాయంతో ఇజ్రాయెల్, అమెరికాలకు పెద్ద అవరోధంగా మారారు. ఇప్పటికే చైనాలో ఒకసారి ప్రధాని మోదీతో సమావేశమైన ఇబ్రహీం రైసీ త్వరలోనే భారత్‌లో పర్యటించాలని అనుకున్నారు. భారతీయులు ముందస్తు వీసా అవసరం లేకుండా 15 రోజుల పాటు ఇరాన్‌లో పర్యటించడానికి వెసులుబాటు కూడ ఇచ్చారు. నాలుగేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న రైసీ అనూహ్యంగా చనిపోయారు. ఇరాన్‌లో అధ్యక్షుడి కంటే రహబర్(మార్గదర్శకుడు, సర్వాధికారాలు కలిగిన నేత) పదవి అత్యున్నతమైనది. ప్రస్తుతం ఈ పదవిలో కొనసాగుతున్న అలీ హుస్సేన్ ఖమెనీ(85) రైసీ వారసుడిగా పగ్గాలు చేపడతారని విశ్లేషకులు భావిస్తున్నారు.

మమతకు భారత్ సేవాశ్రమ్ సంఘ్ నోటీసులు

కోల్‌కతా, మే 20: తమ సంస్థ ప్రతిష్ఠను దిగజార్చే విధంగా చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ ముర్షిదాబాద్‌లోని భారత్ సేవాశ్రమ్ సంఘ్‌కు చెందిన స్వామి ప్రదీప్తానంద మహరాజ్ పశ్చిమ బెంగాల్ సీఎం మమత బెనర్జీకి సోమవారం లీగల్ నోటీసులు పంపారు. మమత తనను వ్యక్తిగతంగా విమర్శించారని, ఆధ్యాత్మిక నేతలమైన తాము అలాంటి వాటిని పట్టించుకోమని ప్రదీప్తానంద మహరాజ్ తెలిపారు. కానీ, సేవా కార్యక్రమాలు నిర్వహించే తమ సంస్థపై నిందలు వేస్తే సహించమని అందుకే నోటీసులు పంపామని వివరించారు. ఆరమ్‌బాగ్ లోక్‌సభ నియోజకవర్గంలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మమత మాట్లాడుతూ.. రామకృష్ణ మిషన్, భారత్ సేవాశ్రమ్ సంఘ్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఢిల్లీలోని బీజేపీ నేతల కోసం పని చేస్తున్నారని ఆరోపించారు.

ఆప్ ఖాతాలో రూ.7 కోట్ల విదేశీ నిధులు:ఈడీ

న్యూఢిల్లీ, మే 20: విదేశీ విరాళాల నియంత్రణ చట్టం(ఎఫ్‌సీఆర్‌ఏ) నిబంధనలకు విరుద్ధంగా ఆమ్ ఆద్మీ పార్టీ 2014-2022 నడుమ రూ.7 కోట్ల మేర విదేశీ నిధులను అందుకున్నట్టు ఈడీ ఆరోపించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖకు ఈడీ గత ఏడాది ఆగస్టులోనే ఒక లేఖ రాసింది. తాజాగా దీనికి సంబంధించి మరింత సమాచారాన్ని కేంద్ర హోం శాఖకు ఈడీ అందజేసింది. ఢిల్లీలోని ఏడు లోక్‌సభ నియోజకవర్గాలకూ సార్వత్రిక ఎన్నికల ఆరో దశ అయిన మే 25న పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. అలాగే పంజాబ్‌లో జూన్ 1న ఎన్నికలు జరగనున్నాయి. ఆప్ బలంగా ఉన్న ఆ రెండు రాష్ట్రాల్లో ఎన్నికలకు ముందు ఈడీ ఈ వ్యవహారాన్ని మళ్లీ బయటకు తీసుకురావడం గమనార్హం. 2014-22 నడుమ విదేశాల్లో ఉంటున్న వారి నుంచి రూ.7.08 కోట్ల మేర విదేశీ విరాళాలు అందుకున్న ఆప్.. దాతల వివరాలను తప్పుగా ప్రకటించిందని, వారికి సంబంధించిన కొన్ని వివరాలను దాచిపెట్టిందని ఈడీ ఆరోపిస్తోంది. ఎఫ్‌సీఆర్‌ఏ నిబంధనల ఉల్లంఘనకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు బాధ్యత సీబీఐది కాబట్టి.. ఈకేసును సీబీఐకి అప్పగిస్తూ లేఖ రాయాలని హోం శాఖను కోరింది. అయితే.. ఈడీ ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఆప్‌నేత ఆతిషీ కొట్టిపారేశారు. ఇది ఎన్నికల ముందు ఆప్‌ను అపఖ్యాతిపాలు చేసేందుకు మోదీ పన్నిన కుట్ర అని మండిపడ్డారు.

బాలికపై అత్యాచారం కేసులో రాజస్థాన్‌లో ఇద్దరికి మరణ శిక్ష

జైపూర్, మే 20: మైనర్ బాలికపై అత్యాచారం చేసి ఆపై బొగ్గుల కొలిమిలో సజీవ దహనం చేసిన కేసులో ఇద్దరికి మరణ శిక్ష విధిస్తూ రాజస్థాన్‌లోని బిల్వారాలో ఉన్న పోక్సో ప్రత్యేక కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. ముద్దాయిలైన కాలూ, కన్హాలకు ఈ శిక్ష విధించిందని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహావీర్ సింగ్ కిష్నావత్ చెప్పారు. సాక్ష్యాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలపై మరో ఏడుగురిపై కేసులు పెట్టినప్పటికీ ఇందుకు తగిన ఆధారాలు లేవంటూ వారిని నిర్దోషులుగా విడుదల చేసిందని తెలిపారు. దీనిపై హైకోర్టులో అప్పీలు చేస్తామని చెప్పారు. సంఘటన జరిగిన పది నెలల్లో నిందితులకు శిక్ష పడిందని తెలిపారు. గత ఏడాది ఆగస్టు రెండో తేదీన పశువులు మేపడానికి వెళ్లిన 14 ఏళ్ల బాలికపై ముద్దాయిలు ఇద్దరు అత్యాచారం చేశారు. అనంతరం కర్రలతో తీవ్రంగా కొట్టారు. చనిపోయిందని భావించి మండుతున్న బొగ్గుల కొలిమిలో పడేశారు. దీనిపై అప్పటి అశోక్ గెహ్లోత్ ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితులను అరెస్టు చేసింది. నిందితులు నేరం చేసినట్టు శనివారం పోక్సో కోర్టు ధ్రువీకరించి శిక్ష విధించింది.

మణిపూర్‌లో 75 మంది మహిళల్ని కాపాడిన సైన్యం

ఇంఫాల్, మే 20: మణిపూర్‌లో మైతీ తెగకు చెందిన 75 మంది మహిళలను కుకీ మిలిటెంట్ల బారి నుంచి సైన్యం, అసోం రైఫిల్స్ జవాన్లు కాపాడారు. విష్ణుపూర్ జిల్లా వారియోసింగ్ ప్రాంతంలో శుక్రవారం రాత్రి జరిగిందీ ఘటన. గతేడాది కుకీ, మైతీ తెగల మధ్య ఘర్షణలో సుమారు 225 మంది మరణించగా, 50 వేల మందికిపైగా సురక్షిత ప్రాంతాలకు తరలిపోయిన విషయం తెలిసిందే. సైన్యం, అసోం రైఫిల్స్ ఇక్కడ క్యాంపులు ఏర్పాటు చేసి శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారు. వారియోసింగ్ ప్రాంతంలోని బఫర్ జోన్‌లో ఉన్న గ్రామస్థులకు రక్షణగా రాత్రివేళ 75 మంది మీరా పైబీస్(మహిళా కార్యకర్తలు) పహారా కాస్తున్నారు. శుక్రవారం రాత్రి సుమారు 10.30 గంటల సమయంలో వారివైపు మిలిటెంట్లు రాగా.. అసోం రైఫిల్స్ బలగాలు అప్రమత్తమై వారివైపు కాల్పులు జరిపాయి.

దక్షిణాది మాదే

అక్కడ అన్ని పార్టీల కంటే ఎక్కువ సీట్లు బీజేపీకే

- దేశవ్యాప్తంగా ఎన్డీయేకు 400 సీట్లు
- పీటీఐకి ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ



భువనేశ్వర్, మే 20: దక్షిణాది రాష్ట్రాల్లో అన్ని పార్టీల కన్నా బీజేపీకి ఎక్కువ సీట్లు వస్తాయని ప్రధాని మోదీ అన్నారు. దక్షిణాది భారీ విజయాలతో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలతో కలిపి 400 సీట్లు దాటుతామని విశ్వాసం వ్యక్తం చేశారు. "మరోసారి మోదీ సర్కారు... నాలుగో తారీఖున 400 సీట్లు" నినాదంతో దేశవ్యాప్త ప్రచారం చేసినట్లు చెప్పారు. ఆదివారం రాత్రి ఆయన పీటీఐ వారాసంస్థకు ఇంటర్వ్యూ ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీకి బలం లేదన్న ప్రచారాన్ని ఈసారి ఎన్నికల్లో పటాపంచలు చేస్తామన్నారు. తమ మిత్రపక్షాలు కూడా దక్షిణాదిలో పెద్ద ఎత్తున సీట్లు గెలవబోతున్నాయని చెప్పారు. ఓట్లశాతం భారీగా పెరగనుందని ప్రకటించారు. దక్షిణాదిలో 131 సీట్లుంటే గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 29 సీట్లు గెలిచి, దక్షిణాదిలో అతిపెద్ద పార్టీగా నిలిచింది. ఒడిసా, బెంగాల్లో కూడా బీజేపీకి పెరుగుతున్న మద్దతు చూసి ఇతర పార్టీలకు, మీడియా సంస్థలకు రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. రెడ్ కారిడార్‌గా పేరొందిన ప్రాంతం కాషాయ కారిడార్‌గా మారిపోనుందని ప్రకటించారు. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండీ కూటమి గత నాలుగు దశల ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల్లో ఖాతా తెరవని పరిస్థితి నెలకొందని చెప్పారు. తాము ఏ రాష్ట్రానికి సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా దేశ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని తీసుకుంటామని అన్నారు. బీజేపీ అంటే ఉత్తరాది పార్టీయని, బనియా-బ్రాహ్మిణ్ పార్టీ అని పథకం ప్రకారం చేసిన దుష్ప్రచారాన్ని ఈ ఎన్నికలతో పటాపంచలు చేస్తామని మోదీ ప్రకటించారు. మూడోసారి అధికారానికి రాగానే ఉమ్మడి పౌర స్మృతి, జమిలి ఎన్నికలను కచ్చితంగా అమలు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉన్న అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే 100 రోజుల్లో అమలు చేయాల్సిన అంశాలను ఇంతకుముందే సిద్ధం చేశామని, వాటిని 125 రోజుల్లో అమలు చేస్తామని ప్రధాని ప్రకటించారు. తాను మైనారిటీలకు వ్యతిరేకంగా ఎన్నడూ మాట్లాడలేదని, బీజేపీ ఎప్పుడూ మైనారిటీలకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని మోదీ చెప్పారు. ఎవరినీ ప్రత్యేక పౌరులుగా గుర్తించడానికి తాను సిద్ధంగా లేనన్నారు. కాంగ్రెస్ మైనారిటీల ఓట్ల కోసం రాజ్యాంగంలోని లౌకిక స్ఫూర్తిని ఉల్లంఘిస్తోందని, దాన్ని మాత్రమే తాను ప్రస్తావిస్తున్నానని చెప్పారు. కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చిన పార్టీ బీజేపీయేనని మోదీ ప్రస్తావించారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లను మొత్తం రిజర్వేషన్లను ముడి పెట్టి మాట్లాడటం సరికాదని ప్రధాని అన్నారు. ఈసారి కాంగ్రెస్ కార్యకర్తలే ఆ పార్టీకి ఓటేయడానికి బయటకు రాలేదని, అందుకే పోలింగ్ శాతం తక్కువగా నమోదైందని వ్యాఖ్యానించారు. టెంపో నిండా డబ్బు పంపితే అదానీ-అంబానీలకు వ్యతిరేకంగా మాట్లాడనని స్వయంగా కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ అన్నారని మోదీ ప్రస్తావించారు.

ఐదో దశలో 60.09%

న్యూఢిల్లీ, మే 20 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ఐదో దశలో దేశవ్యాప్తంగా 60.09% పోలింగ్ నమోదైంది. సోమవారం రాత్రి 11.30 గంటల వరకు అందిన సమాచారాన్ని బట్టి ఈమేరకు పోలింగ్ శాతం నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. జమ్మూకశ్మీర్‌లోని బారాముల్లా నియోజకవర్గంలో గత 35 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. 54.49 శాతం పోలింగ్ బారాముల్లాలో నమోదైనట్లు ఈసీ తెలిపింది. ఐదో దశలో భాగంగా సోమవారం 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 49 పార్లమెంటు స్థానాలలో ఎన్నికలు జరిగాయి. ఐదో దశ పూర్తికావడంతో ఇప్పటి వరకు దేశవ్యాప్తంగా 25 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 428 సీట్లకు ఎన్నికలు పూర్తయ్యాయి. ఒడిశాలోని 63 అసెంబ్లీ సీట్లకు ఎన్నికలు ముగిశాయి. కాగా, టీఎంసీ అధినేత్రి మమత బెనర్జీ సోదరుడు బాబు బెనర్జీ ఓటరు జాబితాలో పేరు లేక ఓటు వేయలేకపోయారు.

428లో ఎన్ని సాధిస్తాం?

- ఎన్నికల్లో పార్టీ సాధించే సీట్లపై బీజేపీ పెద్దల సమీక్ష
- చివరి 2 దశల్లో 90 సీట్ల సాధనే లక్ష్యంగా ప్రణాళిక

న్యూఢిల్లీ, మే 20(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఇప్పటి వరకూ అయిదు దశల్లో పోలింగ్ ముగిసిన 428 స్థానాల్లో.. ఎన్ని సీట్లను సాధించగలదనే అంశంపై బీజేపీ నేతలు సోమవారం చర్చలు జరిపారు. ఢిల్లీలోని బీజేపీ జాతీయ కార్యాలయంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) బీఎల్ సంతోష్, కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటి వరకూ ఎన్నికలు జరిగిన రాష్ట్రాలవారీగా బీజేపీ సాధించబోయే ఫలితాలను వారు అంచనా వేసినట్లు తెలిసింది. మిగిలిన 115 స్థానాల్లో 90కి పైగా సీట్లు గెలిచేందుకు పకడ్బందీగా వ్యూహరచన చేయాలని వారు నిర్ణయించారు. ప్రస్తుతం లోక్ సభలో ఎన్డీఏ సంఖ్యాబలం 342. బీజేపీ చెబుతున్నట్టుగా 400 సీట్లు సాధించాలంటే.. మరో 58 సీట్లు కావాలి. ఇందుకు పశ్చిమబెంగాల్, ఒడిశాలోని 63 సీట్లలో బీజేపీ 90% సీట్లు సాధించాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో ఒడిశాలో బీజేపీ 21 సీట్లలో 8 సీట్లు గెలుచుకున్న సంగతి తెలిసిందే. ఈసారి మహా అయితే మరో నాలుగు సీట్లు అదనంగా గెలుచుకుంటుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇక పశ్చిమ బెంగాల్‌లోని 42 సీట్లలో.. 2019లో 18 సీట్లు గెలుచుకున్న బీజేపీ ఈ సారి రెట్టింపుస్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్డీఏ గతంలో భారీ విజయాలు సాధించిన బిహార్, మహారాష్ట్రలో ఈసారి వ్యతిరేక పవనాలు ఎదుర్కొంటోందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. 2019 ఎన్నికల్లో మహారాష్ట్రలో శివసేనతో కలిసి బీజేపీ పోటీ చేయడంతో 48 స్థానాలకు గాను 41 సీట్లు గెలుచుకోలిగింది. ఈసారి శివసేన దూరం కావడంతో బీజేపీకి 20 సీట్లు కూడా కష్టమేనని అంచనాలు వినపడుతున్నాయి. ఇక బిహార్‌లో మొత్తం 40 స్థానాల్లో గతంలో ఎన్డీయే కూటమి 39 స్థానాలు గెలుచుకుంది. ఈసారి కూడా జేడీ(యు), లోక్ జనశక్తితో కలిసి బీజేపీ పోటీ చేస్తున్నప్పటికీ నితీశ్ ప్రభ తగ్గడం, తేజస్వీ బలం పెరగడంతో ఇక్కడ కూడా ఏన్డీయేకి సగం సీట్లు దక్కడమే గగనం అంటున్నారు. అంటే ఒక్క బిహార్, మహారాష్ట్రలోనే ఎన్డీఏ దాదాపు 40 సీట్లు కోల్పోతుందని ఇండియా కూటమి వర్గాలు అంటున్నాయి. ఇక ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హరియాణా, ఢిల్లీ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లో ఎన్డీయే చెప్పుకోదగ్గ సంఖ్యలో సీట్లు కోల్పోతుందని అంచనా. ఈ నేపథ్యంలో మిగిలిన 115 స్థానాల్లో బీజేపీ మరిన్ని ఎక్కువ సీట్లు సాధించేందుకు ప్రయత్నిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇక దక్షిణాదిన కర్ణాటకలో అయిదారు సీట్లు కోల్పోయినా.. ఏపీ, తెలంగాణలో ఈ నష్టాన్ని పూడ్చుకుంటామని బీజేపీ నేతలు ఈ సమావేశంలో ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసినట్లు తెలిసింది. తెలంగాణలో 8-10 సీట్లు దక్కే అవకాశాలున్నాయని తరుణ్ చుగ్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

అదేం అధ్యయనం?

- కొవాగ్జిన్ దుష్ప్రభావాలపై బీహెచ్‌యు స్టడీని తప్పుపట్టిన భారత వైద్య పరిశోధన మండలి

న్యూఢిల్లీ, మే 20: భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన కొవాగ్జిన్ దుష్ప్రభావాలపై బనారస్ హిందూ యూనివర్సిటీ (బీహెచ్‌యు) అధ్యయనం సరైన పద్ధతిలో జరగలేదని ఐసీఎంఆర్ స్పష్టం చేసింది. ఈ అధ్యయనం కోసం అనుసరించిన మెథడాలజీని తప్పుబట్టింది. వర్సిటీ తన నివేదికలో.. తప్పుదోవ పట్టించేలా తమ పేరును ఉటంకించిందని, కాబట్టి, వెంటనే అందులోంచి పేరును తొలగించడమే కాక, పేరును తప్పుగా ఉటంకించినట్టుగా పేర్కొంటూ సవరణ వేయాలని నివేదికను ప్రచురించిన డ్రగ్ సేఫ్టీ జర్నల్ సంపాదకుడు నితిన్ జోషికి ఐసీఎంఆర్ డీజీ రాజీవ్ బహ్ల్ లేఖ రాశారు. లేకపోతే న్యాయపరమైన, పాలనాపరమైన చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. వ్యాక్సిన్ దుష్ప్రభావాలపై అధ్యయనం చేయాలంటే.. టీకా వేయించుకున్న, వేయించుకోని గ్రూపులు రెండింటినీ పోల్చిచూడాలని, కానీ అలా చేయలేదని, కాబట్టి టీకా వల్ల కలిగిన దుష్ప్రభావాలుగా అధ్యయన నివేదికలో పేర్కొన్న సమస్యలకు, కొవిడ్-19 టీకాకు సంబంధం ఉందని చెప్పలేమని పేర్కొన్నారు.1024 మందిని వ్యాక్సిన్ వేయించుకున్న ఏడాది తర్వాత ఫోన్ ద్వారా సంప్రదించిన బీహెచ్‌యూ... '12 నెలల వ్యవధిలో ఏవైనా ఆరోగ్య సమస్యలు వచ్చాయా' అని అడిగింది. వారు చెప్పిన వివరాలను నమోదు చేసుకుంది తప్ప.. ఎలాంటి వైద్య రికార్డులనూ పరిశీలించి, ధ్రువీకరించుకోలేదు.

లోయలో ప్రాణాలు బోల్తా!

చర్ల, మే 20: రోజు కూలీకి వెళ్తే తప్ప ఐదువేళ్లు నోట్లోకి వెళ్లలేని పరిస్థితి ఆ గిరిజన కుటుంబాలది! పొద్దున్నే అడవుల్లోకి వెళ్లి చెట్టూ పుట్టా తిరిగి తునికాకు (బీడీలు చుట్టే ఆకు) సేకరిస్తారు. సోమవారం కూడా ఉదయమే ఇళ్లలోని పిల్లలు, వృద్ధుల కోసం వంట చేసి.. పని కోసం మినీ ట్రక్కులో బయలుదేరారు. అయితే వీరిలో ఏ ఒక్కరూ మళ్లీ ఇల్లు చేరలేదు. ఓ మాయదారి లోయ కొందరి ప్రాణాలను నిర్దాక్షిణ్యంగా మింగేసింది. ఇంకొందరిని తీవ్రగాయాలపాల్జేసింది. రోడ్డు మీద వేగంగా వెళుతూ అదుపు తప్పిన ట్రక్కు ఓ 20 అడుగుల లోయలోకి బోల్తా కొట్టింది. అంతెత్తునుంచి పడిపోవడంతో 19 మంది దుర్మరణంపాలయ్యారు. ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి ఛత్తీస్‌గఢ్‌లోని కబీర్‌ధామ్ జిల్లాలో ఈ ఘోరం జరిగింది. డ్రైవర్ మినహా మృతులు, క్షతగాత్రులంతా మహిళలే. పైగా ఒకే ఊరివారు. మృతుల్లో కొందరు ఒకే కుటుంబానికి చెందినవారైతే.. ఇంకొందరు బంధువులు ఉన్నారు. కబీర్‌ధామ్ జిల్లా సెమ్హరా గ్రామంలోని బైగా తెగకు చెందిన 25 మంది మహిళలు సోమవారం ఉదయం ఓ పికప్ వాహనంలో తునికాకు సేకరణకు బయలుదేరారు. ఆకు సేకరించడం పూర్తయ్యాక అదే వాహనంలో ఊరికి తిరుగుముఖంపట్టారు. వాహనం కుక్‌దూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బహపానీ గ్రామానికి చేరుకోగానే అదుపుతప్పి పక్కనే ఉన్న లోయలోకి పడిపోయింది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. డ్రైవర్ అతివేగంగా నడపడంతోనే ప్రమాదం జరిగిందని క్షతగాత్రులు చెప్పారు.

లోకం తీరు



ఆలయ భూములకు జియో ట్యాగ్!

» దేవాదాయశాఖపై నేడు మంత్రి సమీక్ష

హైదరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగానే ఆలయ భూముల్ని ఆధునిక పద్ధతిలో రికార్డు చేసేందుకు సిద్ధమైంది. సర్వే జరిపి వాటిని జియో ట్యాగ్‌తో పరిరక్షించేందుకు చర్యలు చేపట్టింది. ఆలయ భూముల జియో ట్యాగింగ్, ఫెన్సింగ్, ధరణి రికార్డుల్లో భూముల వివరాల నమోదు తదితర అంశాలపై దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నతాధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించనున్నారు. దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొంటారు. తెలంగాణలో ఆలయాలకు ఉన్న మొత్తం భూములు, వాటి జియో ట్యాగింగ్‌పై చర్చించనున్నారు. భూముల ధరలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో.. ఆయా జిల్లాల పరిధిలోని ఆలయాల భూములపై రికార్డులు దేవాదాయశాఖ ఆధీనంలోనే ఉన్నాయా ? ఆ భూములను ఎవరైనా ఆక్రమించుకున్నారా? ఒకవేళ ఆక్రమించుకుంటే తిరిగి రాబట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు.. వంటి అంశాలపై మంత్రి సమీక్ష నిర్వహించనున్నారు. భక్తులు తమ ఇష్టదైవానికి ఆన్‌లైన్‌లో డొనేషన్లు సమర్పించేందుకు, ఎంపిక చేసిన ఆలయాల్లో సేవా టికెట్లు పొందేందుకు కామన్ పోర్టల్ ఏర్పాటుపై చర్చిస్తారు.

వర్షాకాలంలో పారిశుధ్యంపై దృష్టి పెట్టండి: సీతక్క



వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో శానిటేషన్‌పై దృష్టిపెట్టాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. పీఆర్ఆర్‌డీ, మిషన్ భగీరథ అధికారులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, డ్రైనేజీలు, రోడ్లపై నీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

తెలుగు రాష్ట్రాల రిసోర్స్ పర్సన్లకు శిక్షణ షురూ

ఖైరతాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎం శ్రీ) పథకంలో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపికైన రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)లకు శిక్షణా శిబిరం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరగనున్న ఈ శిబిరాన్ని సోమవారం మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో తెలంగాణ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ మల్లయ్య భట్టు ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ నుంచి 45 మంది, ఆంధ్రప్రదేశ్ నుంచి 50 మంది ఆర్‌పీలుగా ఎంపికయ్యారని, వీరికి ఎన్సీఈఆర్టీకి చెందిన జాతీయస్థాయి రిసోర్స్ పర్సన్లు శిక్షణ ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఇక్కడ శిక్షణ పొందిన ఆర్‌పీలు తమ రాష్ట్రాల్లో ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తారన్నారు. విద్యార్థులకు మరింత గుణాత్మక విద్యను అందించేందుకు, పాఠశాలలకు కావాల్సిన మెరుగైన భౌతిక, మానవ వనరులు అందించేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని మల్లయ్య భట్టు పేర్కొన్నారు.

యాసంగి రుణ పంపిణీ 72 శాతమే పూర్తి

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి పంటరుణాల పంపిణీ లక్ష్యంలో 72 శాతం మాత్రమే పూర్తయ్యింది. 2023-24 యాసంగి సీజన్‌లో రూ. 29,374 కోట్లు పంపిణీ చేస్తామని బ్యాంకర్లు రుణ ప్రణాళిక విడుదల చేసినప్పటికీ రూ. 21,173 కోట్లు మాత్రమే పంపిణీ చేశారు. 18.85 లక్షల మంది రైతులకు యాసంగి రుణాలిచ్చినట్లు బ్యాంకర్లు తెలిపారు. గతేడాది యాసంగి సీజన్‌లో పంటరుణాల పంపిణీ లక్ష్యం రూ. 27,147 కోట్లుగా పెట్టుకున్నప్పటికీ అంతకు మించి రూ. 35,168 కోట్ల రుణాలిచ్చారు. ఈ సంవత్సరం లక్ష్యం స్వల్పంగా పెరిగింది కానీ పంపిణీ మాత్రం గణనీయంగా తగ్గిపోయింది. 2023-34 వానాకాలం, యాసంగి సీజన్లు కలిపి మొత్తం 73,439 కోట్ల రుణాలిస్తామని ప్రకటించిన బ్యాంకర్లు రూ.రూ.56,196 కోట్లే పంపిణీ చేశారు. వార్షిక సగటు ప్రకారం లక్ష్యం 76.52 శాతమే నెరవేరింది. వానాకాలంలో 27.72 లక్షల మంది, యాసంగిలో 18.85 లక్షల మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు.

జలవనరుల సంస్థ ఎండీగా విజయభాస్కర్‌రెడ్డి

తెలంగాణ జలవనరుల అభివృద్ధి సంస్థ(టీడబ్ల్యూఆర్‌డీసీఎల్) మేనేజింగ్ డైరెక్టర్(ఎండీ)గా ఎస్ఈ విజయభాస్కర్‌రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. విజయభాస్కర్‌రెడ్డి ప్రస్తుతం నాగర్‌కర్నూలు చీఫ్ ఇంజనీర్‌గా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

శిక్ష పడినా ప్రాథమిక హక్కులు దూరం కావు

» జైల్లో హత్యకు గురైన ఖైదీ కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

» ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): జైలుశిక్ష పడినంత మాత్రాన ఖైదీలు తమ ప్రాథమిక హక్కులను కోల్పోరని హైకోర్టు స్పష్టం చేసింది. జైల్లో హత్యకు గురైన ఖైదీ కుటుంబానికి పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీచేసింది. ఓ హత్య కేసులో 2012 నుంచి జీవిత ఖైదు శిక్ష అనుభవిస్తున్న మెదక్ జిల్లా టేక్మాల్ మండలం కొనంగి గ్రామానికి చెందిన కరోళ్ల వెంకయ్య.. తనకు విధించిన శిక్షను సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇది పెండింగ్‌లో ఉండగానే 2012 జూలై నెలలో చర్లపల్లి జైల్లో దాసరి నర్సింహులు అనే తోటి ఖైదీ చేసిన దాడిలో మృత్యువాతపడ్డారు. తన భర్త మరణానికి జైలు అధికారుల నిర్లక్ష్యమే కారణమని, కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.10 లక్షల పరిహారం ఇప్పించాలని అతడి భార్య జయమ్మ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్ రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ తరఫున ప్రభుత్వ న్యాయవాది వాదిస్తూ.. తోటి ఖైదీ చేసిన పనికి పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉండదని పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. జైల్లో ఉన్న ప్రతి ఖైదీ ప్రాణాలకు భద్రత కల్పించాల్సిన బాధ్యత అధికారులకు ఉంటుందని తెలిపింది. జైలుశిక్ష పడినంత మాత్రాన జైల్లో ఉన్న ఖైదీలు ప్రాథమిక, రాజ్యాంగ హక్కులను కోల్పోరని స్పష్టంచేసింది. నైపుణ్యం లేని కూలీకి ఇచ్చే రోజువారీ కనీస వేతనం ఆధారంగా పరిహారాన్ని లెక్కించినట్టు తెలిపింది. అందులో ఇప్పటికే ప్రభుత్వం చెల్లించిన రూ.లక్ష పోగా మిగిలిన రూ.6.20 లక్షలను 6 శాతం వడ్డీతో కలిపి మూడునెలల్లో చెల్లించాలని తుది తీర్పు వెలువరించింది.



పుట్టంగండి జీరోపాయింట్ వద్ద నిర్మిస్తున్న అడ్డుకట్ట

పుట్టంగండి వద్ద నీటికి అడ్డు కట్ట

» జీరో పాయింట్ వద్ద రాళ్లు, ఇసుకతో నిర్మాణం

» హైదరాబాద్‌కు తాగునీటికి ఇబ్బందుల్లేకుండా కృషి

పెద్దఅడిశర్లపల్లి, మే 20 : నాగార్జున సాగర్ జలాశయంలో నీటి నిల్వలు తగ్గినా.. హైదరాబాద్‌కు తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లయ్ అండ్ సీవరేజ్ బోర్డు(హెచ్ఎండబ్ల్యూఎస్) అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పుట్టంగండి జీరో పాయింట్ వద్ద నీటి నిల్వను పెంచడంతో పాటు గ్రావిటీ కాల్వలోకి నీటిని ఎత్తిపోస్తున్నప్పుడు వెనక్కి వస్తున్న నీటికి అడ్డుకట్ట వేసేందుకు జీరో పాయింట్ వద్ద కట్టను నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 20 నుంచి జీరోపాయింట్ వద్ద ఏర్పాటు చేసిన 10 మోటార్ల ద్వారా గ్రావిటీ కాల్వలో నీటిని ఎత్తిపోసి పుట్టంగండి పంప్ హౌస్‌కు తరలిస్తున్నారు. అయితే, సాగర్ నీటిమట్టం 504.80 అడుగులకు చేరడంతో మూడు మోటార్లకు నీరు అందడం లేదు. ప్రస్తుతం ఏడు మోటర్ల ద్వారా పుట్టంగండి పంప్ హౌస్ గ్రావిటీ కాల్వలోకి నీటిని ఎత్తిపోస్తున్నారు. దీంతో పంప్ హౌస్‌కు సరిపడా నీరందడం లేదు. దీనిని అరికట్టేందుకు పుట్టంగండి జీరో పాయింట్ వద్ద రాళ్లు, ఇసుక బస్తాలతో అధికారులు కట్టను నిర్మిస్తున్నారు. తద్వారా పంప్ హౌస్‌కు పూర్తి స్థాయిలో నీరందేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం పుట్టంగండి పంప్‌హౌస్‌లో ఉన్న మూడు మోటార్లలో ఒక్క మోటారు ద్వారానే అక్కంపల్లి రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోస్తున్నారు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు నీటిని తరలిస్తున్నారు. అక్కంపల్లి రిజర్వాయర్‌లో 15 రోజులకు సరిపడా నీటి నిల్వ ఉంది. అయితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా పుట్టంగండి వద్ద అడ్డుకట్టను నిర్మిస్తున్నారు. ఈ పనులు మంగళవారంతో పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు.

సన్నాలకు బోనస్

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. కేబినెట్ భేటీలో ప్రధానంగా రైతుల పంట కొనుగోళ్లు, పాఠశాలల్లోని సమస్యలు, కాళేశ్వరం ప్రాజెక్టుపై నేషనల్ ఎన్‌డీఎస్‌ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికపై చర్చించామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం, సంక్షేమ హాస్టళ్లు, రూ.2కే కిలో బియ్యం పథకాలకుగాను రాష్ట్రంలో ఏటా 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరముంటాయని మంత్రి పొంగులేటి తెలిపారు. పైగా ఎన్నికల సమయంలో సన్న బియ్యం ఇస్తామని హామీ ఇచ్చామని పేర్కొన్నారు. అయితే ఈ సన్నబియ్యాన్ని బయటి ప్రాంతాల నుంచి కొనకుండా రాష్ట్రంలోని రైతులు పండించిన సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 చొప్పున ఈ సీజన్ నుంచే బోనస్ ఇవ్వాలని నిర్ణయించామని తెలిపారు.



తడిసిన ధాన్యానికీ కనీస మద్దతు ధర..

రాష్ట్రంలో ఈసారి పండించిన పంటలో ఇప్పటివరకు 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పౌరసరఫరాల సంస్థ సేకరించిందని, ఈ ధాన్యానికి గతంలో ఎన్నడూ లేనివిధంగా మూడు రోజుల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు వేశామని మంత్రి పొంగులేటి చెప్పారు. నిజానికి దేశంలో పౌరసరఫరాల సంస్థల ద్వారా ఇంత తొందరగా ధాన్యాన్ని సేకరించిన దాఖలాలు ఎప్పుడూ లేవన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ధాన్యాన్ని సేకరించడమే కాకుండా.. మూడు రోజుల్లోనే డబ్బు చెల్లించడం జరిగిందని పేర్కొన్నారు. ఇక గతంలో ఎప్పుడూ లేనివిధంగా పది రోజులుగా రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నాయని, ప్రభుత్వం ఎన్ని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నా కొంత ధాన్యం తడిసిందని అన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నామని, దీనిని కూడా మద్దతు ధరకే కొనాలంటూ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. ఇక ఇప్పటికే వానాకాలం సీజన్ ప్రారంభమైందని, విత్తనాలు, ఎరువుల విషయంలో రైతులు ఇబ్బంది పడొద్దన్నది ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. రైతులకు నకిలీ విత్తనాలు సరఫరా కాకుండా అరికట్టాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. నకిలీ విత్తనాలు సృష్టించేవారు, అమ్మేవారు, నకిలీ రసీదులు ఇచ్చేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. రైతులు కూడా అధికారికంగా కంపెనీల వద్దే విత్తనాలను కొనాలని, ఆ రసీదులను పంట పూర్తయ్యేవరకు ఉంచుకోవాలని సూచించారు. కాగా, జూన్ 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కాబోతున్నందున వాటిలో మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వం రూ.600 కోట్లను కేటాయించిందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. ఇప్పటికే రూ.120 కోట్లను అడ్వాన్సుగా ఇచ్చినట్లు తెలిపారు. స్కూళ్ల పునరుద్ధరణకు మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ఉప సంఘాన్ని ఏర్పాటు చేశామన్నారు.

బ్యారేజీల్లో నీటిని నిల్వ ఉంచవద్దన్న ఎన్‌డీఎస్ఏ

కాళేశ్వరం ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల్లోనూ ప్రస్తుతానికి నీటిని నిల్వ చేయరాదని మంత్రివర్గం నిర్ణయించినట్లు పొంగులేటి తెలిపారు. ఈ బ్యారేజీల్లో చుక్క నీటిని కూడా నిల్వ చేయడానికి వీల్లేదంటూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) చెప్పినందున ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు చెప్పారు. అయితే రైతు ప్రయోజనాల దృష్ట్యా ర్యాక్ ఫిల్ డ్యామ్‌ను ఏర్పాటు చేసి, నీటిని సరఫరా చేసే తాత్కాలిక ఏర్పాట్లపై పరిశీలించాల్సిందిగా అధికారులను ఆదేశించామన్నారు.. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎన్‌డీఎస్ఏ చెప్పినట్లుగానే నడుచుకోవాలని, నిపుణుల సూచనల మేరకు ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్ఏ ఇచ్చిన మధ్యంతర నివేదికలో మూడు అంశాలను స్పష్టంగా పేర్కొన్నదని అన్నారు. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో లీకేజీలు ఉన్నాయని, సుందిళ్ల కూడా ప్రమాదంలో ఉందని కమిటీ చెప్పిందని తెలిపారు. ఈ మూడు బ్యారేజీల గేట్లను తెరిచి ఉంచాలి తప్ప.. ఏ బ్యారేజీలోనూ చుక్క నీటిని కూడా నిల్వ చేయవద్దని సూచించిందన్నారు. మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతు చేసినా, నిధులు వ్యయం చేసినా.. ఆ బ్యారేజీ ఉంటుందో, లేదో తాము చెప్పలేమని తెలిపిందని వెల్లడించారు. డ్యామ్ సేఫ్టీ పరీక్షలను ఒకే కంపెనీతో కాకుండా మూడు కంపెనీలతో చేయించాల్సిందిగా పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వానికి చెందిన మూడు కంపెనీలను కమిటీ సూచించిందని తెలిపారు. ఈ మూడింటిలో రెండింటి అభిప్రాయాలు తీసుకుని బ్యారేజీలకు మరమ్మతులు చేయాలని కేబినెట్ నిర్ణయించిందన్నారు. గత ప్రభుత్వం ఖర్చు పెట్టిన డబ్బు వృథా పోకుండా ఉండడానికి నిపుణుల సూచనల మేరకు తాత్కాలిక ఏర్పాట్ల ద్వారా నీటిని ఇవ్వాలన్నదే ప్రభుత్వ యోచన అని స్పష్టం చేశారు.

కాళేశ్వరం రిపేర్లు కాంట్రాక్టు సంస్థే చేస్తుంది

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో కాంట్రాక్టు సంస్థదే బాధ్యత అని, మరమ్మతులను ఆ సంస్థే చేయాల్సి ఉంటుందని ఓ ప్రశ్నకు సమాధానంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఎల్అండ్‌టీకి దొంగ సర్టిఫికెట్లు ఇచ్చిన విషయంలో తప్పు చేసినవారికి శిక్ష తప్పదని హెచ్చరించారు. మేడిగడ్డ నుంచి పంపింగ్ సాధ్యం కాకపోతే.. రైతులను ఇబ్బంది పెట్టడం తమ ప్రభుత్వ ఉద్దేశం కాదని, ఇదే అంశంపై కేబినెట్‌లో చర్చించామని అన్నారు. ఇక ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణ విషయంలో పేద, మధ్య తరగతి కుటుంబాలవారికి అండగా నిలవాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూతపడిన 6వేల పాఠశాలలను తిరిగి తెరిచే ఆలోచన చేస్తామన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు మాజీ సీఎంను ఆహ్వానిస్తారా? అని ప్రశ్నించగా... అందరినీ ఆహ్వానిస్తామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

స్కూళ్ల అభివృద్ధికి రూ.600 కోట్లు!

» పాఠశాలల్లో వెంటనే మరమ్మతు పనులు

» విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు,

» నోట్‌బుక్స్, యూనిఫారాల పంపిణీ

» కేబినెట్ భేటీలో విద్యాశాఖపై ప్రత్యేక చర్చ

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పాఠశాలలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు సకాలంలో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందించడంతోపాటు స్కూళ్లు ప్రారంభమైన వెంటనే ప్రత్యేకంగా బడిబాట కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో విద్యాశాఖపై ప్రత్యేకంగా చర్చించారు. ఈ సందర్భంగా స్కూళ్లలో వెంటనే చేపట్టే మరమ్మతు పనుల కోసం రూ.600 కోట్లను ఖర్చు చేయాలని నిర్ణయించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో అత్యవసర నిర్వహణ పనులను చేయించాలని తీర్మానించారు. ముఖ్యంగా తాగునీటి వసతి, తరగతి గదుల విద్యుదీకరణ, చిన్నతరహా మరమ్మతు పనులు, టాయిలెట్ల పునరుద్ధరణ, నిర్వహణ, బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్ల నిర్మాణం వంటి పనులను చేపట్టనున్నారు. రాష్ట్రంలోని మొత్తం 21,19,439 మంది విద్యార్థులకు ఉచితంగా రెండు జతల యూనిఫారాలనూ అందించాలని నిర్ణయించారు. యూనిఫారాల కుట్టు పనిని 30 వేల స్వయం సహాయక బృందాలకు అప్పగించనున్నారు. జూన్ 10వ తేదీ నాటికి అన్ని జిల్లాలకు ఈ యూనిఫారాలను అందించేవిధంగా చర్యలు తీసుకోనున్నారు. అలాగే 6 నుంచి 12వ తరగతి విద్యార్థుల కోసం 1,11,97,976 నోట్‌బుక్స్‌ను పంపిణీ చేయాలని నిర్ణయించారు. జూన్ 12వ తేదీ నాటికి విద్యార్థులందరికీ వీటిని అందించనున్నారు. కాగా, స్కూళ్లలో విద్యార్థులను చేర్పించడానికి వీలుగా ప్రతి ఏడాది నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని ఈ ఏడాది ప్రత్యేకంగా చేపట్టనున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు పది రోజులపాటు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

సోనియాకు అభినందన సభ



సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చి జూన్ 2 నాటికి పదేళ్లు పూర్తవుతున్నందున.. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు ఆమెను అభినందించాలని కేబినెట్‌లో నిర్ణయించినట్లు పొంగులేటి తెలిపారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చేసిన సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. దీంతోపాటు రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన పెద్దలందరినీ పిలిచి బహిరంగ సభలో సన్మానించాలని, ఇందుకు అనుమతి కోసం ఈసీకి లేఖ రాయాలని నిర్ణయించామని అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం ఏర్పాటైందని, ప్రతిపక్షానిది మొసలి కన్నీరు మాత్రమేనని వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి వ్యవసాయం, విద్య, ప్రజలకిచ్చిన వాగ్దానాలే ప్రాధాన్య అంశాలన్నారు. ఒక్క గింజ కూడా తరుగు లేకుండా, రైతులు గత దశాబ్ద కాలంలో పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ధాన్యం సేకరణను కొనసాగిస్తున్నామన్నారు. మార్కెట్‌లోకి వచ్చిన పంటను కూడా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వ విస్మరించిందని, పాఠశాల, సాంకేతిక, ఉన్నత విద్య విషయంలో రాబోయే కాలంలో మార్పును చూపించాలని తాము నిర్ణయించామని చెప్పారు. రాబోయే కాలంలో గొప్ప మానవ వనరులను తయారు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కాగా, తాను ఏం మాట్లాడాలన్నా జూన్ 5న మాట్లాడతానని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రైతులపై ఏ ప్రభుత్వానికి ప్రేమ ఉందో అందరికీ తెలుసునన్నారు. ధర్నాల పేరిట ఎవరు ఎన్ని నాటకాలాడినా.. తమ నల్లగొండ జిల్లాలో 99.9 శాతం ధాన్యం సేకరణ పూర్తయిందని చెప్పారు. భువనగిరి, ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో వర్షాల కారణంగా సేకరణ నిలిచిపోయిందని, దీనిని వారం రోజుల్లో పూర్తి చేయాలని సీఎం ఆదేశించారని తెలిపారు. గత ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణాలను ఆరేడు విడతలుగా అమలు చేసిందని, తాము ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేయబోతున్నామని అన్నారు. గత పదేళ్లలో 5600 పాఠశాలలు మూతపడ్డాయని, ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని విమర్శించారు. విద్యారంగంలో రూ.20 వేల కోట్ల బడ్జెట్‌ను పెట్టిన ఇందిరమ్మ ప్రభుత్వం ఇది అని చెప్పారు.

నేటితో ముగియనున్న వీసీల పదవీకాలం

» ఇంకా మొదలవ్వని సెర్చ్ కమిటీల భేటీలు

» ప్రక్రియ పూర్తయ్యేదాకా ఇన్‌చార్జిలే!

» హడావుడిగా పాత బిల్లుల చెల్లింపు

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల వీసీల పదవీకాలం మంగళవారం (21వ తేదీ)తో ముగియనుంది. కొత్త వీసీల నియామకానికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉండటంతో ఇన్‌చార్జి వీసీలను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. యూనివర్సిటీల వీసీల ఎంపిక కోసం ప్రభుత్వం ఇప్పటికే నోటిఫికేషన్ ఇచ్చింది. ఇందులో భాగంగా ప్రొఫెసర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ వీసీ పోస్టులకు మొత్తం 312 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకుంటే అన్ని యూనివర్సిటీలకు కలిపి 1,382 దరఖాస్తులొచ్చాయి. దరఖాస్తులను పరిశీలించి, వీసీల పేర్లను సిఫారసు చేయడం కోసం సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రక్రియ మొదలవ్వడంతో వీసీల నియామకంలో కొంత జాప్యం జరిగింది. ఎన్నికల సంఘం నుంచి అనుమతి తీసుకున్నాక నాలుగు రోజుల క్రితమే సర్కారు సెర్చ్ కమిటీలను ఏర్పాటు చేసింది. అయితే కమిటీల సమావేశాలు ఇంకా జరగలేదు. ఫలితంగా కొత్త వీసీల నియామకానికి ఇంకొంత సమయం పట్టే అవకాశం కనిపిస్తోంది. ఈ క్రమంలో కొన్ని రోజుల పాటు ఆయా యూనివర్సిటీలకు ఇన్‌చార్జిలను నియమించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఈ ఇన్‌చార్జిలుగా ఐఏఎస్ అధికారులను నియమించే అవకాశం కనిస్తోంది. కాగా, తమ పదవీకాలం ముగుస్తుండటంతో పలు యూనివర్సిటీల వీసీలు హడావుడిగా బిల్లులను క్లియర్ చేస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. గత మూడేళ్లుగా కొనసాగుతున్న వీసీలు తమ పదవీకాలం చివరి దశలో ఇలా పెండింగ్ బిల్లులను క్లియర్ చేయడం పట్ల పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉస్మానియా, జేఎన్‌ఏఎఫ్ఏ వంటి పలు యూనివర్సిటీల్లో రూ.కోట్లలో పాత బిల్లులను చెల్లించినట్లు తెలిసింది.

బిష్కెక్‌లో భారతీయ విద్యార్థులు క్షేమం

కిర్గిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో జరిగిన ఘటనలపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఉన్నతాధికారుల నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు సీఎం సూచన మేరకు అధికారులు బిష్కెక్‌లోని భారత రాయబారి అరుణ్ కుమార్ చటర్జీని సంప్రదించి వివరాలను సేకరించారు. భారతీయ విద్యార్థులంతా సురక్షితంగా ఉన్నారని అధికారులకు చటర్జీ చెప్పారు.

రెవెన్యూశాఖలో పదోన్నతులకు డీపీసీ ఏర్పాటు

రెవెన్యూశాఖలో అర్హులైన అధికారులకు పదోన్నతులు ఇచ్చేందుకు ప్రభుత్వం డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ)ని నియమించింది. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిత్తల్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. కమిటీకి చైర్‌పర్సన్ లేదా కన్వీనర్‌గా సీసీఎల్ఏ (చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్), మెంబర్లుగా కమిషనర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నుంచి ఒకరు, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ నుంచి డిప్యూటీ సెక్రటరీ లేదా జాయింట్ సెక్రటరీ ఉండనున్నారు.

మేడిగడ్డ ఎగువన రాతికట్ట!

2.5 మీటర్ల ఎత్తుతో తాత్కాలికంగా నిర్మించాలని నిర్ణయం.. గ్యాబియన్ వాల్ పద్ధతిలో నదీ ప్రవాహంలో నిర్మాణం

» ప్రాణహిత నీటిని పంప్‌హౌస్‌కు మళ్లించి పంపింగ్

» నెలలో 3 బ్యారేజీల మరమ్మతులు పూర్తి

» డిసెంబరు లోగా మేడిగడ్డ దగ్గర పంపింగ్‌కు సిద్ధం

» ఎన్‌డీఎస్ఏ నివేదిక అమలుకు నిర్ణయం



హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రాణహితకు వర్షాకాలం వచ్చే వరద తగ్గుముఖం పట్టాక మేడిగడ్డ బ్యారేజీకి ఎగువన తాత్కాలికంగా రాతికట్ట కట్టి, నదీ ప్రవాహాన్ని లక్ష్మీ పంప్‌హౌస్‌కు మళ్లించి, అన్నారం బ్యారేజీలోకి ఎత్తిపోయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. మేడిగడ్డ బ్యారేజీ వద్ద ప్రస్తుతం నీటిని నిల్వ చేసే అవకాశం లేనందున ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్యాబియన్ వాల్ పద్ధతిలో ఇనుప వల మధ్యలో రాళ్లను కూర్చి 2.5 మీటర్ల ఎత్తుతో ఈ కట్టను నిర్మిస్తారు. మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాకు కుంగిపోయి, మరమ్మతులు, బ్యారేజీ పునరుద్ధరణ ఇప్పట్లో కుదిరే పని కాకపోవడంతో రాతి గోడ నిర్మాణం నిర్ణయం తీసుకున్నారు. వచ్చే సీజన్‌లో మేడిగడ్డ ఎగువన ఉన్న పంప్‌హౌస్‌ల నుంచి పంపింగ్‌ను యుద్ధప్రాతిపదికన చేపట్టి, నీటిని ప్రాజెక్టు పరిధిలోని జలాశయాల్లో నింపి, తాగు, సాగు నీటి అవసరాలకు అందించనున్నారు. సోమవారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. మూడు బ్యారేజీల పరిస్థితిపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) ఇచ్చిన మధ్యంతర నివేదికను ఈ సమావేశంలో చర్చించారు. ఏటా గోదావరి బేసిన్‌లో నవంబరు దాకా భారీగా వరదలు ఉంటాయని అధికారులు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో బ్యారేజీల పరిస్థితి ఏమిటి? వాటి పునరుద్ధరణకు ఏం చేయాలి? అనే విషయమై ఏకకాలంలో మూడు కేంద్ర సంస్థలతో అధ్యయనం చేయించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఢిల్లీకి చెందిన కేంద్ర మృత్తిక, ఇతర భూపదార్థాల పరిశోధన కేంద్రం(సీఎస్ఎంఆర్ఎస్), పుణెలోని కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థ (సీడబ్ల్యూపీఆర్ఎస్), హైదరాబాద్‌లోని జాతీయ భూభౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ) ఈ అధ్యయనాలు చేపడతాయి. ఈ మూడు సంస్థలతో బ్యారేజీలకు సంబంధించి భూభౌతిక, భూసాంకేతిక పరీక్షలు చేయించాలని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) ఇప్పటికే చెప్పింది. ఒక్కో బ్యారేజీని ఏకకాలంలో రెండేసి కేంద్ర సంస్థలతో విడివిడిగా అధ్యయనం చేయిస్తారు. వాటితో పాటుగా మూడు బ్యారేజీల్లో లీకేజీలను అరికట్టడానికి, డ్యామేజీ మరింత పెరగకుండా చూడటానికి తాత్కాలిక మరమ్మతులను చేపడతారు. అధ్యయనం, మరమ్మతులు సమాంతరంగా చేపట్టి, నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని నిర్ణయించారు. తద్వారా మేడిగడ్డ ఎగువన తక్కువ సమస్యలు ఉన్న సుందిళ్ల, అన్నారం బ్యారేజీలు నెల రోజుల్లోనే నీటి నిల్వకు సిద్ధమవుతాయి. అన్నారం, సుందిళ్లలో సీపేజీల కట్టడికి సిమెంట్/కాంక్రీట్ మిశ్రమంతో చర్యలు చేపడితే వానాకాలంలోనే వాటి నుంచి నీటిని పంపింగ్ చేసే అవకాశం దొరుకుతుందని అధికారులు చెప్పారు. మేడిగడ్డలో బ్యారేజీ ఎగువ భాగంలో తాత్కాలికంగా కట్టను కట్టి, వచ్చిన వరదను వచ్చినట్లే పంప్‌హౌస్‌లోకి మళ్లించి, పంపింగ్ చేస్తే ప్రయోజనం ఉంటుందని అధికారులు ప్రతిపాదించగా ఎంత ఖర్చవుతుందని మంత్రులు ఆరా తీశారు. గ్యాబియన్ రాక్‌వాల్ పద్ధతిలో తక్కువ ఖర్చుతో దీన్ని పూర్తి చేయవచ్చని అధికారులు చెప్పారు. కేంద్ర ఆనకట్టల భద్రత సంస్థ సలహా తీసుకొని అక్టోబరు లేదా నవంబరులో వరద తగ్గుముఖం పట్టగానే గ్యాబియన్ వాల్ పద్ధతిలో కట్ట నిర్మాణ పనులు చేపట్టాలని మంత్రివర్గం నిర్ణయించింది. సాధారణంగా మేడిగడ్డ నుంచి నీళ్ల ఎత్తిపోసే అవసరం డిసెంబరులో వస్తుంది. సుందిళ్ల, అన్నారం బ్యారేజీల మరమ్మతులు వచ్చే నెల రోజుల్లోనే పూర్తి చేయాలని నిర్ణయించినందున డిసెంబరులో ఎత్తిపోతలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆనకట్టల భద్రత జాతీయ సంస్థ నివేదికను పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించారు. పెద్దగా సమస్యలు లేని సుందిళ్లలో ఇప్పటికే మరమ్మతులు మొదలయ్యాయి.

అవసరమైన పత్రాలివ్వండి: మంత్రివర్గం

కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరుపుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిటీకి అవసరమైన పత్రాలన్నీ అందించాలని మంత్రివర్గం నీటి పారుదల శాఖకు స్పష్టం చేసింది. గతేడాది అక్టోబరులో జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ నివేదికతో పాటు తాజాగా అందించిన మధ్యంతర నివేదికను, కాగ్ రిపోర్టుతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మధ్యంతర నివేదికను కమిషన్‌కు అందించి, విచారణకు పూర్తి సహకారం అందించాలని మంత్రివర్గం అధికారులకు సూచించింది. విచారణ నివేదిక చేతికి అందాక దోషులపై చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.

ఖర్చంతా నిర్మాణ సంస్థలదే

బ్యారేజీల మరమ్మతుల బాధ్యత నిర్మాణ సంస్థలదేనని మంత్రివర్గం స్పష్టం చేసింది. 2019 జూన్‌లో మూడు బ్యారేజీలు ప్రారంభం కాగా... అదే సంవత్సరం వచ్చిన వరదలకు బ్యారేజీలు దెబ్బ తిన్నాయని, 2019 నవంబరులోనే లోపాలు బయట పడ్డాయని నీటిపారుదల శాఖ అధికారులు మంత్రివర్గానికి నివేదించారు. అధ్యయనం ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని, మరమ్మతుల ఖర్చు నిర్మాణ సంస్థలు భరించేలా చూడాలని అధికారులను మంత్రివర్గం ఆదేశించింది. నిర్మాణ సంస్థలు ముందుకు రాకున్నా మరమ్మతుల ప్రక్రియ ఆగకూడదని స్పష్టం చేసింది.

కమిటీ సమన్వయం చేసుకోవాలి

జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) నివేదిక అమలు కోసం వేసిన ఆరుగురు ఉన్నతాధికారుల కమిటీ బ్యారేజీల అధ్యయనం, మరమ్మతుల ప్రక్రియను సమన్వయం చేసుకుంటూ అమలు చేయాలని మంత్రివర్గం నిర్దేశించింది. ఒక్కో బ్యారేజీని రెండేసి సంస్థలతో అధ్యయనం చేయించడం వల్ల రెండు నివేదికల సమాచారాన్ని క్రాస్ చెక్ చేసుకోవచ్చని భావించారు.

అన్నారం పంప్‌హౌస్ వద్ద రక్షణగోడ

పెద్దపల్లి, మే 20 (ఆంధ్రజ్యోతి): అన్నారం (సరస్వతి) పంప్‌హౌస్ నీట మునగకుండా రక్షణ గోడ(సేఫ్టీ వాల్)ను నిర్మిస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా ఈ గోడను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అన్నారం పంప్‌హౌస్‌ను రిజర్వాయర్ గరిష్ఠ నీటి మట్టం కన్నా తక్కువ ఎత్తులో నిర్మించారు. దీంతో 2022లో కురిసిన భారీ వర్షాలకు పెద్ద ఎత్తున వచ్చిన వరద పంప్‌హౌస్‌లోకి చేరింది. భవిష్యత్తులో అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా 950మీటర్ల సేఫ్టీ వాల్‌ను నిర్మిస్తున్నారు. ఇప్పటికే 650 మీటర్ల మేర నిర్మాణం పూర్తి కాగా, నెల రోజుల్లో పనులన్నీ పూర్తి చేయాలని అధికారులు భావిస్తున్నారు. అలాగే సుందిళ్ల బ్యారేజీ అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్‌లో అక్కడక్కడ పడిన రంధ్రాలను పూడ్చివేసేందుకూ చర్యలు చేపట్టారు.



అన్నారం పంప్‌హౌస్ వద్ద నిర్మిస్తున్న రక్షణ గోడ

టెట్ తొలి రోజు 77% హాజరు

హైదరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టెట్ పరీక్షలు సోమవారం మొదలయ్యాయి. మొత్తం 74 కేంద్రాల్లో ఈ పరీక్షలు ప్రారంభం కాగా, మొదటి రోజు సుమారు 77.81 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం నిర్వహించిన మొదటి సెషన్ పరీక్షకు 17,231 మంది హాజరుకావాల్సి ఉండగా, ఇందులో 13,110 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 17,205 మందికిగానూ 13,686 మంది హాజరయ్యారు. మొదటి సెషన్‌లో 76.08 శాతం మంది, రెండవ సెషన్‌లో 79.55 శాతం మంది పరీక్ష రాశారు. రెండు సెషన్లు కలిపి మొత్తం 77.81 శాతం అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు.

ఏపీఈఏపీసెట్‌కు 94.37 శాతం హాజరు

జేఎన్టీయూకే, మే 20: ఏపీఈఏపీసెట్-2024 ఆన్‌లైన్ ప్రవేశపరీక్షకు సంబంధించి ఏపీ, హైదరాబాద్‌లోని 49 ప్రాంతీయ కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగం ప్రవేశ పరీక్ష ఐదవ రోజు సాఫీగా జరిగినట్లు సెట్ ఛైర్మన్, వీసీ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం సోమవారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 61,330 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 57,880 మంది హాజరయ్యారని 3450 మంది గైర్హాజరు కాగా మొత్తం 94.37 శాతం హాజరు నమోదైందన్నారు.

ఈ-సెట్‌లో 95 శాతం అర్హత

హైదరాబాద్, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఈ-సెట్(ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్) ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ఈ ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఈ-సెట్‌లో 95.86 శాతం మంది అభ్యర్థులు అర్హతను సాధించారు. ఇందులో పురుషుల కంటే మహిళల శాతం ఎక్కువగా ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 23,330 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, వారిలో 22,365 మంది అభ్యర్థులు అర్హతను పొందారు. అయితే, సీట్ల భర్తీ ప్రక్రియను వచ్చే నెలలో చేపట్టనున్నట్లు ప్రొఫెసర్ లింబాద్రి తెలిపారు. జూన్‌లో ఐటీ సీట్ల భర్తీకి సంబంధించిన ప్రక్రియ మొదలు కానుందని, అనంతరం ఇంజనీరింగ్ సీట్ల భర్తీని చేపట్టనున్నట్లు చెప్పారు.

స్టైపండ్ ఆలస్యంపై రేపటి నుంచి జూ.డాల సమ్మె

హైదరాబాద్, మే 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తమకు సకాలంలో స్టైపండ్ నిధులను విడుదల చేయకపోవడంపై జూనియర్ డాక్టర్లు బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్త సమ్మె నిర్వహించనున్నారు. ఈ మేరకు జూనియర్ డాక్టర్ల అసోసియేషన్ సభ్యులు సమ్మె నోటీసును డీఎంఈ వాణికి అందజేశారు. ఈ సందర్భంగా జూనియర్ డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ హర్ష సాయి మాట్లాడుతూ.. రెండు నెలల నుంచి స్టైపండ్ రావడం లేదన్నారు. స్టైపండ్‌కు సంబంధించిన టోకెన్ నంబర్ తీసుకొని సెక్రటేరియట్, డీఎంఈ ఆఫీసుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

వచ్చే నెల 8న చేప ప్రసాదం పంపిణీ


మాట్లాడుతున్న బత్తిని అమర్‌నాథ్ గౌడ్

పంజాగుట్ట, మే 20 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 8వ తేదీ మృగశిర రోజున ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో చేప ప్రసాదాన్ని పంపిణీ చేయబోతున్నట్లు నిర్వాహకులైన బత్తిని అమర్‌నాథ్ గౌడ్ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడారు. ఆస్తమా, దగ్గు, ఉబ్బసం తదితర దీర్ఘకాలిక శ్వాస సంబంధిత వ్యాధులకు గడిచిన 191 ఏళ్లుగా నియమనిష్ఠలతో తయారు చేసిన చేప ప్రసాదాన్ని అందిస్తున్నామని చెప్పారు. జూన్ 8 ఉదయం 11 గంటల నుంచి 9వ తేదీ ఉదయం 11 గంటల వరకు చేప ప్రసాదం పంపిణీ కొనసాగుతుందని వెల్లడించారు. మత్స్య శాఖ అందజేసిన చిన్న కొర్రమీను చేపతో ప్రసాదాన్ని ఉచితంగానే పంపిణీ చేస్తామన్నారు. దేశ, విదేశాల నుంచి వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

కవిత కస్టడీ మళ్లీ పొడిగింపు

- ఢిల్లీ మద్యం స్కాంలో సీబీఐ, ఈడీ కేసుల్లో..

3 వరకు పొడిగించిన రౌస్ ఎవెన్యూ కోర్టు

న్యూఢిల్లీ, మే 20 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జ్యుడీషియల్ కస్టడీని న్యాయస్థానం మరోసారి పొడిగించింది. సీబీఐ, ఈడీ కేసులు రెండింట్లోనూ కవిత కస్టడీని జూన్ 3 వరకు పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు న్యాయమూర్తి కావేరి బవేజా ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పొడిగించిన రిమాండ్ గడువు సోమవారంతో ముగియడంతో సీబీఐ అధికారులు కవితను తిహాడ్ జైలు నుంచే వర్చువల్‌గా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అయితే ఆమె రిమాండ్‌ను మరోసారి పొడిగిస్తూ న్యాయమూర్తి నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు మనీలాండరింగ్ కేసులోనూ కవిత జ్యుడీషియల్ కస్టడీని పొడిగించాలని ఈడీ న్యాయవాదులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అయితే ఈడీ చార్జిషీట్ దాఖలు చేసినందున ఆమెను కస్టడీలో ఉంచాల్సిన అవసరం లేదని, విడుదల చేయాలని కవిత తరఫు న్యాయవాది నితీశ్ రాణా కోరారు. ఇరువురి వాదనలు విన్న న్యాయమూర్తి ఈడీ కేసులోనూ కస్టడీని పొడిగించారు. కాగా, మద్యం విధానంలో కవితతోపాటు మరో నలుగురి పాత్రపై ఈడీ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకునే అంశంపైనా న్యాయమూర్తి కావేరి బవేజా విచారణ జరిపారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో హవాలా రూపంలో డబ్బులు మళ్లించేందుకు కరెన్సీ నోట్ల సీరియల్ నంబర్లను టోకెన్లుగా నిందితులు వాడారని న్యాయస్థానానికి ఈడీ తెలిపింది. అక్రమంగా నిధుల మళ్లింపు వ్యవహారంలో నిందితుల పాత్రపై ఆధారాలను.. అనుబంధ చార్జిషీట్‌లో పొందుపరిచినట్లు ఈడీ తరఫు న్యాయవాదులు పేర్కొన్నారు. అయితే నిందితుల పాత్రను వివరించే క్రమంలో ఈడీ తొలుత కవిత గురించి ప్రస్తావించగా.. న్యాయమూర్తి అభ్యంతరం తెలిపారు. కవిత మినహా మిగతా నిందితుల గురించి చెప్పాలని ఈడీకి సూచించారు. దీంతో ఐదుగురు నిందితుల్లో.. చారియట్ మీడియా సంస్థ ఉద్యోగిగా పనిచేసిన ప్రిన్స్‌కుమార్, ఇండియా ఎహెడ్ న్యూస్ చానల్ మాజీ ఉద్యోగి అర్వింద్‌సింగ్ గురించి ఈడీ న్యాయవాదులు కోర్టుకు వివరిస్తూ.. నిధుల తరలింపులో భాగంగా రూ.16 లక్షలు ప్రిన్స్‌కుమార్‌కు అందాయని తెలిపారు. మూడు విడతలలో మూడు కరెన్సీ నోట్ల సీరియల్ నంబర్లను టోకెన్లుగా వాడి ప్రిన్స్‌కుమార్ డబ్బులు తీసుకున్నారని పేర్కొన్నారు. అయితే కొన్ని అంశాలపై ఈడీ న్యాయవాదులు తగిన వివరణ ఇవ్వకపోవడంతో అనుబంధ చార్జిషీట్ పరిగణనలోకి తీసుకునే అంశంపై విచారణను న్యాయమూర్తి మంగళవారానికి వాయిదా వేశారు.

అవి ప్రాణాంతక దాడులే!

కుట్ర కోణమూ ఉంది!!.. ఇంత తీవ్రత ఉన్న కేసుల్లో పోలీసుల దర్యాప్తు లోపభూయిష్టం

- ఏపీలో హింసపై 'సిట్' ప్రాథమిక నివేదిక
- డీజీపీకి సమర్పించిన ఐజీ బ్రిజ్‌లాల్
- 33 కేసుల్లో నిందితులు 1,370 మంది
- అరెస్టు చేసింది మాత్రం 124 మందినే
- మిగతావారినీ త్వరగా పట్టుకోవాలి
- ప్రత్యేక దర్యాప్తు బృందం సూచనలు


డీజీపీ హరీశ్ గుప్తాకు నివేదిక సమర్పిస్తున్న సిట్ చీఫ్ ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్

అమరావతి, మే 20 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ రోజు, ఆ తర్వాత రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక ఘటనలన్నీ ప్రాణాంతకమైనవేనని ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) తేల్చింది. ఇంతటి తీవ్రమైన కేసుల్లో స్థానిక పోలీసుల దర్యాప్తు లోపభూయిష్టంగా ఉందని ఆక్షేపించింది. పల్నాడు, అనంతపురం, తిరుపతి జిల్లాల్లో నమోదైన 33 కేసుల్లో 1,370 మంది నిందితులు ఉంటే కేవలం 124 మందినే స్థానిక పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపింది. ఎఫ్ఐఆర్‌లలో నమోదు చేసిన సెక్షన్లకు అదనపు సెక్షన్లను చేర్చాలని స్థానిక ఎస్‌హెచ్‌వోలను ఆదేశించింది. సిట్ అధిపతి ఐజీ వినీత్ బ్రిజ్‌లాల్, ఏసీబీ ఎస్పీ రమాదేవి సోమవారమిక్కడ మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు 150 పేజీల రహస్య ప్రాథమిక నివేదికను అందజేశారు. రెండ్రోజుల పాటు మూడు జిల్లాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రత్యక్ష సాక్షులు, బాధితులతో మాట్లాడిన సిట్ బృందాలు హింస తీవ్రత, కుట్ర కోణాన్ని గుర్తించాయి. అందుకు అనుగుణంగా పోలీసులు సెక్షన్లు నమోదు చేయకపోవడం, అల్లర్ల కేసుల్లో నిందితులుగా ఉన్న 1,370 మందిలో కనీసం పదిశాతం మందిని కూడా అరెస్టు చేయక పోవడానికి కారణాలను నివేదికలో పొందుపరచింది. ప్రాణాంతకమైన ఇనుప రాడ్లు, కత్తులు, సమ్మెటలు, రాళ్ల దాడులు బీభత్సంగా జరిగినా ఎఫ్ఐఆర్‌లలో ఆ స్థాయి ఐపీసీ సెక్షన్లు నమోదు చేయలేదని తేల్చింది. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు పోలింగ్ రోజు జరిగిన విధ్వంసం కేసుల్లో ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రస్తావనే లేకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని పేర్కొంది. నేరం తీవ్రత, లభించిన ఆధారాలకు అనుగుణంగా చర్యలు లేవని పెదవి విరిచింది. నలుగురు డీఎస్పీల నేతృత్వంలో 12 మంది సభ్యులతో కూడిన సిట్ బృందాలు మూడు జిల్లాలకు వెళ్లి విచారణ జరిపాయి. పల్నాడు జిల్లాలో 8 పోలీసు స్టేషన్ల పరిధిలో నమోదైన 22 కేసులు, అనంతపురం జిల్లాలో నమోదైన 7 కేసులు, తిరుపతి జిల్లాలో నాలుగు కేసులకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లను క్షుణ్ణంగా పరిశీలించాయి. నేరం/ఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి అన్ని వర్గాలతో మాట్లాడి, నాటి దృశ్యాలను వీక్షించి, సాక్షుల వాంగ్మూలాలతో ధ్రువీకరించుకుని అన్ని అంశాలను నివేదికలో పొందుపరచింది. బాధ్యులెవరు.. బాధితులెవరు.. నిందితుల వెనకున్నది ఎవరు.. వారికి సహకరించిన పోలీసుల పాత్రేంటి.. రాజకీయ పార్టీల నేతల కుట్రలు ఏమైనా ఉన్నాయా.. తదితర కోణాల్లో పరిశీలించింది. పలు ఎఫ్ఐఆర్‌లలో కొన్ని సెక్షన్లు చేర్చాలని.. బయటే ఉన్న 90శాతాని(1,246మంది)కి పైగా నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేయాలని సూచించింది. ఇప్పటికే జిల్లా స్థాయిలో ఏర్పాటైన దర్యాప్తు బృందాలను మరింత బలోపేతం చేసి టెక్నాలజీ వినియోగించి ఎక్కడున్నా అరెస్టు చేయాలని నిర్దేశించింది. సిట్ నివేదికపై డీజీపీ సంతృప్తి వ్యక్తం చేశారు. సిట్ బృందం సూచనలను పరిగణనలోకి తీసుకుని పకడ్బందీగా దర్యాప్తు పూర్తి చేయాలని జిల్లాల ఎస్పీలను ఆదేశించారు. ఈ నివేదికను కేంద్ర ఎన్నికల కమిషన్ (సీఈసీ)కి పంపించారు.

వైసీపీకి ఓటు.. ఎస్సైకి నోటు!

దర్శి, మే 20: రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అధికార పార్టీ వైసీపీ చేసిన అవినీతి, అక్రమాలు, ప్రలోభాలు వెలుగులోకి వస్తున్నాయి. కొంతమంది అధికారులు ఏకపక్షంగా అధికార పార్టీకి కొమ్ముకాశారని తేలిపోయింది. ఒక ఎస్సైకి వైసీపీ నాయకులు రూ.5 వేలు ఇచ్చి ఓటు వేయించుకున్న వ్యవహారం వెలుగు చూసింది. ప్రకాశం జిల్లా దర్శి పట్టణానికి చెందిన ఖాజా బాబు మంగళగిరిలో ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఆయనకు దర్శిలో ఓటు ఉంది. వైసీపీ నాయకులు ఈయన ఓటుకు ఖరీదు కట్టి రూ.5 వేలను ఫోన్‌పే ద్వారా ఖాజా బాబు ఖాతాకు పంపారు. అనంతరం, ఆయన తన ఓటును పోస్టల్ బ్యాలెట్ ద్వారా పంపించారు. అయితే.. ఓటుకు నోటు తీసుకున్న విషయాన్ని పసిగట్టిన టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దర్శి పోలీసులు ఈ నెల 7న ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశారు. దీనిపై జిల్లా అధికారులు విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపారు. ఎస్ఐ ఖాజా బాబు ఓటుకు రూ.5 వేలు తీసుకున్నట్లు ఆధారాలు లభించటంతో గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి.. ఎస్సైని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

కేసీఆర్‌లాగే జగన్‌కు ఓటమి

- అహంకారానికి గుణపాఠం తప్పదు
- ఏపీలో కూటమిదే అధికారం: కిషన్‌రెడ్డి

హైదరాబాద్/న్యూఢిల్లీ, మే 20(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించినట్లే, ఏపీలో జగన్‌ను అక్కడి ప్రజలు ఓడించడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్‌ను అహంకారం ఓడించింది.. ఇప్పుడు జగన్ విషయంలోనూ అదే జరగబోతోందని అన్నారు. జగన్ ఇచ్చిన ఉచితాలకు ఆయన ఇంట్లో కూర్చుని గెలవాలని.. కానీ అక్కడ అంత సీన్ లేదని పేర్కొన్నారు. అభివృద్ధిపై దృష్టి పెడితే మరోలా ఉండేదని అన్నారు. ఏపీలో కూటమిదే అధికారమని స్పష్టం చేశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్ చేశారు. ఖమ్మం-వరంగల్-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ విజయం ఖాయమని అన్నారు. బీఆర్ఎస్ ప్రభావం ఎక్కడా లేదని, కాంగ్రెస్ అభ్యర్థికి క్యాడర్ సహకరించడం లేదని కిషన్‌రెడ్డి వివరించారు. పార్లమెంటు ఎన్నికలు ముగియగానే ఎమ్మెల్సీ ఎన్నిక రావడం తమకు కలిసివచ్చిందని కిషన్‌రెడ్డి అన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కూడా కాకముందే రూ.13 వేల కోట్ల అప్పులు చేసిందని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆయన ఢిల్లీలో నిర్మలతో భేటీ అయ్యారు. గత ప్రభుత్వం అనేక కార్పొరేషన్లను ఏర్పాటు చేసి రుణాలు పొందగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరిన్ని కార్పొరేషన్లను ఏర్పాటు చేసి భారీగా రుణాలు పొందటానికి ప్రయత్నం చేస్తోందని తెలిపారు.

కాంగ్రెస్ నేతలది పూటకో మాట: కొండా

మద్యం కుంభ కోణంలో కాంగ్రెస్ నేతలు పూటకో మాట మాట్లాడుతున్నారని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయాలని డిమాండ్ చేసిన ఆ పార్టీ నేతలు.. కేజ్రీవాల్‌కు ఎలా మద్దతు పలుకుతారని ప్రశ్నించారు. ఢిల్లీలో తెలంగాణ భవన్ వద్ద కొండా మీడియాతో మాట్లాడారు. రిజర్వేషన్ల అంశంపై తెలంగాణలో కాంగ్రెస్ దుష్ప్రచారం చేసిందని.. కానీ, రాయ్‌బరేలీ, అమేఠీలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి రిజర్వేషన్లు అమలు కావడం లేదని విమర్శించారు.

ప్రమాదాలపై వ్యాసం రాయండి

- ట్రాఫిక్ పోలీసులతో కలిసి పని చేయండి
- మైనర్‌కు బెయిల్ షరతులు విధించిన జువెనైల్ జస్టిస్ బోర్డు
- మద్యంమత్తులో కారు నడిపి ఇద్దరిమృతికి కారకుడైన మైనర్

పుణె, మే 20: మద్యం మత్తులో కారు నడిపి ఇద్దరు మహిళల మృతికి కారకుడైన ఓ టీనేజర్‌కు పుణెలోని జువెనైల్ జస్టిస్ బోర్డు పలు షరతులతో బెయిల్ మంజూరు చేసింది. నిందితుడు మైనర్ కావడంతో అతనిలో మార్పు కలిగేలా షరతులను పెట్టింది. 'రోడ్డు ప్రమాదాల ప్రభావం-పరిష్కార మార్గాలు' అనే అంశంపై 300 పదాల వ్యాసం రాయాలని తెలిపింది. దీంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి యరవాడ ట్రాఫిక్ పోలీసులతో కలిసి 15 రోజులపాటు పనిచేయాలని, మద్యం వ్యసనాన్ని తొలగించుకోవడానికి చికిత్స చేయించుకోవాలని, మానసిక వైద్య నిపుణుడ్ని సంప్రదించాలంటూ షరతులు పెట్టింది. మరోవైపు ఆ టీనేజర్‌కు కారు ఇచ్చిన తండ్రిపైనా, మద్యాన్ని విక్రయించిన బార్ యజమానిపైనా పోలీసులు కేసు పెట్టారు. నిందితుని వయసు 17 ఏళ్లు కాగా, ఆయన తండ్రి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. పుణెలోని కల్యాణ్‌నగర్‌లో ఆదివారం వేకువజామున లగ్జరీ కారును వేగంగా నడిపిస్తూ వెళ్లిన ఆ యువకుడు ఓ బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో అనిస్ అవధియా, అశ్విని కోస్టా అనే ఇద్దరు యువతులు మరణించారు. ఆ టీనేజర్‌పై పోలీసులు కేసు పెట్టి అరెస్టు చేశారు. అయితే నిందితుడు మైనర్ కావడంతో జువెనైల్ బోర్డు 14గంటల వ్యవధిలోనే బెయిల్ మంజూరు చేసింది. నేరం అంత తీవ్రమైనది కాకపోవడంతో బెయిల్ ఇస్తున్నట్టు తెలిపింది. నిందితుడు మైనర్ అని చెప్పడంతో వయసును రుజువు చేసే పత్రాలను తనిఖీ చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితునికి బెయిల్ మంజూరు కావడంపై ప్రజాగ్రహం వ్యక్తం కావడంతో పుణె పోలీసు కమిషనర్ అమితేష్ కుమార్ స్పందించారు. జరిగిన ఘటన తీవ్రమైనది కావడంతో నిందితుడ్ని మేజర్‌గా పరిగణించాల్సి ఉంటుందని చెప్పారు. దీనిపై హైకోర్టులో అప్పీలు చేశామని చెప్పారు. జువెనైల్ జస్టిస్ చట్టంలోని సెక్షన్-2 ప్రకారం దీన్ని తీవ్రమైన నేరంగా పరిగణించాలని కోరినా జువైనెల్ జస్టిస్ బోర్డు పట్టించుకోలేదని చెప్పారు. మృతురాలి బంధువు అఖిలేష్ అవధియా మాట్లాడుతూ బోర్డు విధించిన షరతులు హాస్యాస్పదంగా ఉన్నాయని అన్నారు.

హైదరాబాదీ సూత్రధారిగా కిడ్నీ రాకెట్!

మానవ అక్రమ రవాణా.. కేరళ వాసి అరెస్టుతో వెలుగులోకి

కొచ్చి, మే 20: అమాయకులకు పెద్ద మొత్తంలో డబ్బు ఆశ చూపి, అవయవ దానానికి ఒప్పించి మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాకు చెందిన ఓ వ్యక్తిని కేరళ పోలీసులు అరెస్టు చేశారు. కేరళలోని త్రిస్సూర్‌కు చెందిన సబిత్ నాసర్(30)ను కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. విచారణలో సబిత్ మానవ అక్రమ రవాణాకు సంబంధించి సంచలన విషయాలు బయటపెట్టాడని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. అవయవాల సేకరణ కోసం హైదరాబాద్, బెంగళూరుకు చెందిన పలువురితోపాటు కేరళలోని పాలక్కడ్‌కు చెందిన ఓ వ్యక్తిని విదేశాలకు తరలించినట్టు సబిత్ విచారణలో అంగీకరించాడు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ద్వారా ఈ అక్రమ రవాణా జరుగుతుందని చెప్పాడు. తాను ఉద్యోగం చేస్తోన్న ఓ పశ్చిమాసియా దేశానికి భారతీయులను తరలిస్తున్నట్టు పేర్కొన్నాడు. తాము విదేశాలకు తరలించిన వారిలో హైదరాబాద్, బెంగళూరుకు చెందిన వారే అధికంగా ఉన్నారని తెలిపాడు. పోలీసుల కథనం ప్రకారం.. విదేశీయులకు మూత్రపిండాలను దానం చేస్తే ఆ దేశ చట్టాల ప్రకారం పరిహారం ఇప్పిస్తామని నమ్మించి సబిత్ ముఠా మోసాలకు పాల్పడుతుంది.

క్రిమినల్ చట్టాలపై 'పిల్' తిరస్కరణ

న్యూఢిల్లీ, మే 20: నూతన క్రిమినల్ చట్టాలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సోమవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఈ మూడు చట్టాల్లో చాలా లోపాలు ఉన్నందున ఇవి అమలు కాకుండా స్టే ఇవ్వాలని కోరుతూ న్యాయవాది విశాల్‌తివారీ ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్ ధర్మాసనం..చాలా యథాలాపంగా పిటిషన్ దాఖలు చేశారంటూ తిరస్కరించింది.

అధికవడ్డీ ఆశపెట్టి.. 200 కోట్లు కొల్లగొట్టి

(మొదటిపేజీ తరువాయి)

పెడితే 10-18 శాతం దాకా వడ్డీ ఇస్తాం' అని ఆశపెట్టి రూ.200 కోట్ల దాకా సేకరించింది. కొన్నాళ్లు వడ్డీ టంచనుగానే ఇస్తూ వచ్చినా, గత ఐదు నెలల నుంచి ఇవ్వడం లేదు. డిపాజిటర్ల నుంచి ఒత్తిడి పెరగడంతో రాత్రికి రాత్రే భర్త, కుమారుడితో కలిసి బిచాణా ఎత్తేసింది. నిందితురాలైన ఆ అధికారిణి పేరు నిమ్మగడ్డ వాణిబాల! మోసపోయామని తెలుసుకున్న బాధితులు నెత్తీనోరు కొట్టుకుంటూ సీసీఎస్ ఎదుట ఆందోళన చేశారు. వాణిబాల నుంచి డబ్బులు ఇప్పించాలని కోరారు. బాధితుల్లో వాణిబాల సహచరులు, సహోద్యోగులు, కిందిస్థాయి సిబ్బంది కూడా ఉండటం గమనార్హం. బాధితుల వివరాల ప్రకారం..నిమ్మగడ్డ వాణిబాల అబిడ్స్‌లోనే శ్రీ ప్రియాంక ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఫైనాన్స్ సంస్థ ఉంది. వ్యాపార వ్యవహారాలన్నీ ఆమె భర్త మేక నేతాజీ, కుమారుడు శ్రీహర్ష చూసుకుంటున్నారు. వాణిబాల తనకు తెలిసిన వారి నుంచి, సహచర ఉద్యోగుల నుంచి పెద్దమొత్తంలో తన ఫైనాన్స్ సంస్థలో డిపాజిట్లు చేయించింది. వారికి ఎప్పటికప్పుడు రిటర్న్స్ ఇస్తుండటంతో కిందిస్థాయి ఉద్యోగులు కూడా పెద్దమొత్తంలో డబ్బులు డిపాజిట్ చేశారు. గత ఐదు నెలలుగా రిటర్న్స్ రాకపోవడం, డిపాజిట్లూ వెనక్కి ఇవ్వకపోవడంతో డిపాజిటర్ల నుంచి ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. దీంతో కొద్దిరోజుల క్రితం ఆమె ఆఫీసుకు లాంగ్‌లీవ్ పెట్టేసింది. పైగా రిటైర్మెంట్‌కు రెండు-మూడు నెలల ముందే ఆమె ఉద్యోగం మానేయడంతో బాధితుల్లో ఆందోళన మొదలైంది. డిపాజిటర్లలో కొందరు సైదాబాద్‌లో ఉన్న ఆమె ఇంటికి వచ్చి నిలదీస్తుండటంతో రేపు మాపు అంటూ దాటవేస్తూ వచ్చింది. డిపాజిటర్ల నుంచి ఒత్తిడి పెరగడంతో రాత్రికి రాత్రే సైదాబాద్‌లోని ఇంటికి, అబిడ్స్‌లోని కార్యాలయానికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలిసి పరారైనట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

అంతరిక్షంలోకి భారత్!

- రోదసి నుంచి గోపి తోటకూర సందేశం

హూస్టన్, మే 20: తెలుగు తేజం గోపీచంద్ తోటకూర రోదసి యాత్రను విజయవంతంగా పూర్తిచేశారు. భారత్ తరఫున ఈ ఘనత సాధించిన తొలి అంతరిక్ష పర్యాటకుడిగా చరిత్ర సృష్టించారు. అలాగే రాకేశ్ శర్మ తర్వాత రోదసియాత్ర చేసిన రెండో భారతీయుడిగా నిలిచారు. అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్‌కు చెందిన ప్రైవేటు సంస్థ బ్లూ ఆరిజన్ రూపొందించిన న్యూషెపర్డ్-25 వ్యోమనౌకలో ఆదివారం రోదసిలోకి వెళ్లడం పట్ల గోపీచంద్ ఆనందం వ్యక్తం చేశారు. 'అంతరిక్షంలోకి భారత్' అంటూ గోపీ వ్యోమనౌక నుంచి చెప్పిన మాటలను బ్లూ ఆరిజన్ సంస్థ ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఈ వీడియోలో ఆయన 'నేను మన సుస్థిర భూగోళం కోసం పోరాడుతున్న యోధుడిని' అనే బ్యానర్‌ను ప్రదర్శిస్తూ.. అంతరిక్షం నుంచి సందేశమిచ్చారు. ఆ తర్వాత భారత జాతీయ పతాకాన్ని పట్టుకుని కనిపించారు. ఈ యాత్రలో గోపీచంద్‌తోపాటు మేసన్ ఏంజెల్, సిల్వైన్ చిరోన్, కెన్నెత్ ఎల్ హెస్, కరోల్ షల్లర్, ఎడ్ డ్వైట్ పాల్గొన్నారు.

'ఎంబీబీఎస్'పై అస్పష్టత

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నత విద్యా సంస్థల్లో 15 శాతం కన్వీనర్ కోటా సీట్లను ఏపీ, తెలంగాణ విద్యార్థుల కోసం కేటాయించారు. మెరిట్ ఆధారంగా రెండు రాష్ట్రాల విద్యార్థులకూ సీట్లు కేటాయిస్తున్నారు. ఇదే తీరులో తెలంగాణ విద్యార్థులకు ఏపీలో అవకాశం ఉంటుంది. అయితే, అటు నుంచి ఇటు వైపు వస్తున్నారే తప్ప... రాష్ట్ర విద్యార్థులెవ్వరూ ఏపీకి వెళ్లడం లేదని నిపుణులు చెబుతున్నారు. పదేళ్లుగా ఈ చట్టం కింద తెలంగాణలోని మెడికల్ కాలేజీల్లో ఏపీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. అయితే, రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటుతున్న నేపథ్యంలో జూన్ 2 తర్వాత జారీ చేసే నోటిఫికేషన్లకు కొత్త స్థానికత విధానం అమలు చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు 'స్థానికత'ను నిర్వచిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలి. అయితే, ఈ ఏడాది పాత పద్ధతిలోనే ఇంజనీరింగ్ ప్రవేశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వైద్య విద్య ప్రవేశాలపై సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? స్థానికతను ఏ విధంగా నిర్ణయిస్తుంది? అనే అంశాలపై విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. కాగా, ఎంబీబీఎస్ ప్రవేశాల గడువు ముంచుకొస్తుండటంతో స్థానికత అంశంపై స్పష్టత ఇవ్వాలని విద్యా శాఖకు వైద్య శాఖ ఫైల్ పంపింది. సంబంధిత ఫైల్ ప్రస్తుతం ఉన్నత విద్యా మండలి వద్ద పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఎన్నికల హడావుడి కారణంగా సంబంధిత ఫైల్‌ను పట్టించుకోలేదని తెలుస్తోంది. స్థానికతపై ఇప్పుడు జీవో ఇవ్వకుంటే పాత పద్ధతిలోనే ఎంబీబీఎస్ ప్రవేశాలకు అవకాశం కల్పించాల్సి ఉంటుంది. అలా చేస్తే రాష్ట్ర విద్యార్థులు యూజీలో 300-400 సీట్లతోపాటు పీజీలోనూ కొన్ని సీట్లు కోల్పోయే ప్రమాదం ఉందని వైద్య విద్య నిపుణులు చెబుతున్నారు.

ఈడబ్ల్యూఎస్ కోటా విషయంలోనూ..

స్థానికత అంశం ఇలా ఉంటే...ఈడబ్ల్యూఎస్(ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్) కోటా విషయం మరోలా ఉంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ఆరు మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ కోటా అమలవుతోంది. మిగతా కాలేజీల్లో అమలు చేయడం లేదు. ఈడబ్ల్యూఎస్‌ను అమలు చేయాలంటే సీట్ల సంఖ్యను 10శాతం మేర పెంచాలి. అప్పుడే మిగతా రిజర్వేషన్లు యథాతథంగా అమలు చేసే అవకాశం ఉంది. అయితే ఇంజనీరింగ్, నర్సింగ్, పారా మెడికల్ కాలేజీల్లో సీట్లు పెంచకుండానే ఈడబ్ల్యూఎస్ అమలు చేస్తున్నారు. కొత్తగా సీట్లు పెంచే అవకాశం లేనప్పుడు ఉన్న సీట్లలోనే ఆ కోటాను అమలు చేయాలని కొద్ది నెలల క్రితం జాతీయ వైద్య కమిషన్ స్పష్టం చేసింది. అంటే.. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆరు కాలేజీలు సహా మిగతా 50 కాలేజీల్లో (ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో)నూ ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేయాల్సి ఉంది. ఇందుకు అవసరమైన జీవోను వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేయకుంటే ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఆ కోటాను కచ్చితంగా అమలు చేయాలని న్యాయస్థానాల్లోనూ కేసులు దాఖలయ్యే అవకాశాలూ లేకపోలేదని వైద్య విద్య నిపుణులు సర్కారును హెచ్చరిస్తున్నారు.

డయాగ్నస్టిక్ వ్యవస్థను కుప్పకూల్చిన కాంగ్రెస్ సర్కారు

- తక్షణమే సిబ్బందికి పెండింగ్ వేతనాలు చెల్లించాలి
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై మాజీ మంత్రి హరీశ్ స్పందన



హైదరాబాద్/దేవరకొండ, మే 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలకు ఉచితంగా వైద్య పరీక్షలు అందించేందుకు ఏర్పాటు చేసిన తెలంగాణ డయాగ్నస్టిక్ వ్యవస్థను కాంగ్రెస్ సర్కారు ఐదు నెలల్లోనే కుప్ప కూల్చడం బాధాకరమని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సోమవారం 'డయాగ్నస్టిక్ హబ్‌లకు జబ్బు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. 'లక్షలాది మంది పేదలకు ఆర్థిక భారం లేకుండా నాణ్యమైన వైద్య పరీక్షలను అందించిన డయాగ్నస్టిక్ కేంద్రాలు ఇప్పుడు నిర్వహణ లోపంతో కొట్టుమిట్టాడుతున్నాయి. కేసీఆర్ హయాంలో 36 డయాగ్నస్టిక్ కేంద్రాలు ఏర్పాటు చేసి, 134 రకాల వైద్య పరీక్షలను అందుబాటులోకి తెచ్చి వైద్య సేవల్లో తెలంగాణను దేశానికి ఆదర్శంగా నిలిపారు. తెలంగాణ డయాగ్నస్టిక్ కేంద్రాల సిబ్బందికి 6 నెలలుగా వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి. ప్రజారోగ్యం పట్ల కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్య వైఖరికి ఇది నిదర్శనం. ఇప్పటికైనా తక్షణం స్పందించి డయాగ్నస్టిక్ కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులకు, సిబ్బందికి పెండింగ్ జీతాలు చెల్లించాలి. డయాగ్నస్టిక్ కేంద్రాల్లో అన్ని రకాల పరీక్షలు, వైద్య సేవలు ప్రజలకు అందేలా చర్యలు చేపట్టాలి' అని హరీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కిర్గిస్తాన్ రాజధాని బిష్కెక్‌లోని భారత విద్యార్థులే లక్ష్యంగా జరుగుతున్న దాడులు ఆందోళన కలిగిస్తున్నాయని, అక్కడి తెలంగాణ విద్యార్థుల భద్రతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని హరీశ్ మరో ట్వీట్‌లో కోరారు. రైతులు పండించిన ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేస్తామన్న కాంగ్రెస్ హామీ.. అదొక పెద్ద బోగస్ అని ఆరోపించారు. సన్నాలకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడం తగదని, అన్ని రకాల వడ్లకు రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పాలనలో టీచర్లపై లాఠీలు, బడుగు జీవులకు ఝూటా హామీలిస్తూ కాలయాపన చేస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు. సంగారెడ్డి జిల్లా నారాయణ్‌ఖేడ్‌లో ఉపాధ్యాయులపై లాఠీచార్జీని బీఆర్ఎస్ ఖండిస్తోందని, ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్ తండ్రి కనిలాల్ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో.. దేవరకొండలో రవీంద్రకుమార్‌ను పరామర్శించారు.

అధికారం ఏ ఒక్కరి సొత్తు కాదు

- ప్రజాతీర్పునకు కట్టుబడి సుపరిపాలన అందించాలి
- కానీ రేవంత్ బృందం మళ్లీ గారడీకి బయలుదేరింది
- 2 లక్షల ఉద్యోగాలిచ్చినా ప్రచారం చేసుకోలేకపోయాం
- మరే రాష్ట్రంలోనైనా 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు
- నిరూపిస్తే రాజీనామా చేస్తా... కేటీఆర్ సవాల్



ఖమ్మం/కొత్తగూడెం, మే 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాజకీయాల్లో విజయం, అధికారం ఎప్పుడూ ఏ ఒక్కరి సొత్తూ కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ప్రజాతీర్పుకు కట్టుబడి సుపరిపాలన అందించాలని సూచించారు. ప్రతిపక్షం ఉంటేనే ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్ రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఇల్లెందు, కొత్తగూడెం, ఖమ్మంలో కేటీఆర్ ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులతో నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మళ్లీ మోసం చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి బృందం బయలుదేరిందని విమర్శించారు. మాయమాటలతో గారడీ చేసేందుకు వస్తున్న కాంగ్రెస్‌కు ఓటు వేయవద్దన్నారు. అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చి రేవంత్ రెడ్డి ఇప్పుడు వాటిని అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినా చెప్పుకోలేకపోయామని కేటీఆర్ అన్నారు. ఏ నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఉద్యోగాలు ఇచ్చినట్లు రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ లేదా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ఉన్న పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని, రేవంత్ రెడ్డి అబద్ధాలను ఎవరూ విశ్వసించడం లేదని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో వరంగల్‌లో 'టెక్ మహీంద్రా'ను తీసుకొస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ కంపెనీ వెళ్లిపోయిందన్నారు. సింగరేణిని ప్రైవేటుపరం చేసేందుకు బీజేపీ, కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బ్లాక్‌మెయిల్ చేసే తీన్మార్ మల్లన్న లాంటి వ్యక్తిని ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిలపెట్టిందన్నారు. విద్యావంతులు, మేధావులు వెళ్లాల్సిన శాసన మండలికి 56 కేసులతో 74 రోజులు జైలుకెళ్లిన వారిని పంపిస్తారా అని ప్రశ్నించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

diksuchi@andhrajyothy.com

హైదరాబాద్ ● మంగళవారం 21 మే 2024

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ- తెలంగాణ స్టేట్ కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ సీపీజీ ఈటీ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా పీజీ, పీజీ డిప్లొమా, ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. జేఎన్‌టీయూహెచ్, తెలంగాణ మహిళ విశ్వవిద్యాలయం సహా కాకతీయ, ఉస్మానియా, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు యూనివర్సిటీల క్యాంపస్‌లు, గుర్తింపు పొందిన పీజీ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



తెలంగాణ కామన్ పీజీ ఎంట్రెన్స్ టెస్ట్

పీజీ ప్రోగ్రామ్‌లు

ఎంఏ స్పెషలైజేషన్‌లు: యాన్షియంట్ ఇండియన్ హిస్టరీ కల్చర్ అండ్ ఆర్కియాలజీ, అరబిక్, ఇంగ్లీష్, హిందీ, కన్నడ, మరాఠీ, పర్షియన్, సంస్కృతం, తెలుగు, ఉర్దూ, ఇస్లామిక్ స్టడీస్, లింగ్విస్టిక్స్, ఫిలాసఫీ, థియేటర్ ఆర్ట్స్, ఎకనామిక్స్ హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ

- మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్, మాస్టర్ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ టూరిజం మేనేజ్‌మెంట్

ఎంకాం స్పెషలైజేషన్‌లు: జనరల్, ఐఎస్, ఈ కామర్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఇన్సూరెన్స్ అండ్ బ్యాంకింగ్, ఫైనాన్షియల్ అకౌంటింగ్

- ఎంఈడీ, ఎంపీఈడీ

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: బోటనీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఇనార్గానిక్ కెమిస్ట్రీ, ఫిజికల్ కెమిస్ట్రీ, అనలిటికల్ కెమిస్ట్రీ, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ, ఫిజికల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్, జాగ్రఫీ, జియో ఇన్ఫర్మాటిక్స్, జియాలజీ, అప్లయిడ్ జియో కెమిస్ట్రీ, మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, మేథ్స్ విత్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, జియో ఫిజిక్స్, నానో సైన్స్, ఇంజనీరింగ్ ఫిజిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, స్టాటిస్టిక్స్, అప్లయిడ్ స్టాటిస్టిక్స్, జువాలజీ, ఫిషరీస్, బయోకెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫోరెన్సిక్ సైన్స్, జెనెటిక్స్, మైక్రోబయాలజీ, ఫర్మంటేషన్ టెక్నాలజీ, బయోటెక్నాలజీ, న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, ఫుడ్ సైన్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సైకాలజీ, సెరికల్చర్, డేటా సైన్స్

పీజీ డిప్లొమా

స్పెషలైజేషన్: చైల్డ్ సైకాలజీ, ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్, ఫోరెన్సిక్ సైన్స్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లు

- ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ), ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్ ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ

అర్హత వివరాలు

- ఎంఏ, మాస్టర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యు, ఎంహెచ్‌ఆర్ఎం, ఎంటీఎం ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి ఏదేని డిగ్రీ; ఎంఏ లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత లాంగ్వేజ్ సబ్జెక్టులతో డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. కనీసం 40 శాతం మార్కులు తప్పనిసరి. ఎంకాం కోర్సుల్లో ప్రవేశానికి బీకాం ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఈడీలో ప్రవేశానికి బీఈడీ; ఎంపీఈడీలో ప్రవేశానికి బీపీఈడీ/ బీపీఈ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి.
- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి సంబంధిత సబ్జెక్టులతో బీఏ/బీఎస్సీ/బీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ(ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ) కోర్సుకు బీటెక్(ఫుడ్ సైన్స్/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/ఫుడ్ అండ్ న్యూట్రిషన్) ఉత్తీర్ణులు; ఎమ్మెస్సీ జియోఇన్ఫర్మాటిక్స్‌కు బీఈ/ బీటెక్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి డిగ్రీ(అగ్రికల్చర్/వెటర్నరీ సైన్స్/ఫార్మసీ/ఫిషరీస్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మిగిలిన స్పెషలైజేషన్‌లకు బీఎస్సీ(ఎంఎల్‌టీ/ నర్సింగ్/ అగ్రికల్చర్/ హోం సైన్స్)/ బీఫార్మసీ/ బీఈ/ బీటెక్ అభ్యర్థులు అనర్హులు.
- పీజీ డిప్లొమా(ఫోరెన్సిక్ సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్సెస్)లో ప్రవేశానికి బీఎస్సీ(బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫ్యామిలీ మ్యారేజ్ కౌన్సెలింగ్ స్పెషలైజేషన్‌కు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. చైల్డ్ సైకాలజీ స్పెషలైజేషన్‌కు డిగ్రీ స్థాయిలో సైకాలజీ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివిన మహిళలు అప్లయ్ చేసుకోవచ్చు.
- ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లలో ఎమ్మెస్సీ(బయోటెక్నాలజీ/కెమిస్ట్రీ/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ)కి ఎంపీసీ/బైపీసీ/ఎంబైపీసీ గ్రూప్‌తో ఇంటర్/ పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఏ అప్లయిడ్ ఎకనామిక్స్, ఐఎంబీఏలకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్‌లో ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి.

సీపీజీఈటీ 2024 వివరాలు

- దీనిని సీబీటీ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అనాలజీస్, క్లాసిఫికేషన్, మ్యాచింగ్, కాంప్రహెన్షన్ ఆఫ్ రీసెర్చ్ స్టడీ/ఎక్స్‌పరిమెంట్/ థియరీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ(బయోకెమిస్ట్రీ/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ఫోరెన్సిక్ సైన్స్/జెనెటిక్స్/మైక్రోబయాలజీ)కి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40, ఫిజిక్స్/ బోటనీ/జువాలజీ/ జెనెటిక్స్/ మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ సబ్జెక్ట్ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ఎమ్మెస్సీ బయోటెక్నాలజీకి నిర్వహించే ఎగ్జామ్‌లో కెమిస్ట్రీ నుంచి 40 ప్రశ్నలు, బయోటెక్నాలజీ నుంచి 60 ప్రశ్నలు అడుగుతారు.
- ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం గంటన్నర. పరీక్ష సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600; ప్రతి అదనపు సబ్జెక్టుకు రూ.450
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **సీపీజీఈటీ 2024 తేదీలు:** జూలై 5 నుంచి
- **వెబ్‌సైట్:** cpget.tsche.ac.in

సీబీఐపీలో పీజీ డిప్లొమా

హరియాణాలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్(సీబీఐపీ)- 'పీజీ డిప్లొమా ఇన్ ట్రాన్స్‌మిషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్స్ విత్ ఆటోమేషన్ స్కాడా/డీఎంఎస్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 60 సీట్లు ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి 26 వారాలు. ఇది జాబ్ ఓరియంటెడ్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్. ఇందులో 75 శాతం థియరీ, 25 శాతం ప్రాక్టికల్ సెషన్స్ ఉంటాయి. స్పాన్సర్డ్, నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అకడమిక్ మెరిట్, పర్సనల్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. సందర్భానుసారం సంస్థ ఎంట్రెన్స్ టెస్ట్ కూడా నిర్వహించవచ్చు. వసతి సౌకర్యం, ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, పవర్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** నాన్ స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.1,00,000; స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.1,25,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మే 31
- **ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు, కౌన్సెలింగ్:** జూన్ 18 నుంచి 21 వరకు
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.cbip.org

ఎన్ఐటీసీలో పారామెడికల్ కోర్సులు

న్యూఢిల్లీలోని నేషనల్ ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్(ఎన్ఐటీసీ)- క్రాఫ్ట్స్‌మన్ ట్రెయినింగ్ స్కీం(సీటీఎస్) కింద పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఆంత్రప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తుంది. నిబంధనల ప్రకారం కోర్సులు పూర్తిచేసినవారికి నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రెయినింగ్(ఎన్‌సీవీటీ) సర్టిఫికెట్లు ప్రదానం చేస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలతోపాటు ప్రముఖ పీఎస్‌యూలలో సబార్డినేట్ ఉద్యోగాలు సహా వివిధ సర్వీస్ పోస్టుల భర్తీకి ఈ సర్టిఫికెట్లు తప్పనిసరి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వుడు అభ్యర్థులకు స్కాలర్‌షిప్ సౌకర్యం వర్తిస్తుంది. ఎంపికైన అభ్యర్థులకు ప్రభుత్వం బస్‌పాస్ సౌకర్యం కల్పిస్తుంది. ఇందుకు నెలకు రూ.100లు చెల్లించాల్సి ఉంటుంది.

కోర్సులు-సీట్లు: హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 216 సీట్లు ఉన్నాయి. ఫిజియోథెరపి టెక్నీషియన్ కోర్సు వ్యవధి ఏడాది. ఇందులో 60 సీట్లు ఉన్నాయి. డెంటల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో 48 సీట్లు ఉన్నాయి. రేడియాలజీ టెక్నీషియన్ కోర్సు వ్యవధి రెండేళ్లు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఫిజియోథెరపి టెక్నీషియన్, డెంటల్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులకు పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. రేడియాలజీ టెక్నీషియన్ కోర్సుకు సైన్స్ గ్రూప్‌తో ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థి వయసు 2024 ఆగస్టు 1 నాటికి పద్నాలుగేళ్లు నిండి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 1
- **వెబ్‌సైట్:** www.nitcindia.com

లిటిల్స్




మీకు తెలుసా?

- కొమ్ములు కొమ్మల్లా ఉండే ఈ జింకను రెన్ డీర్ అని పిలుస్తారు. ఉత్తర అమెరికాలో ఉండే వీటిని కరిబు(ఫ్రెంచ్ భాషలో) అంటారు. ఇవి ఆర్కిటిక్, సైబీరియా, ఉత్తర యూరప్ దగ్గరి ప్రాంతాల్లో నివసిస్తాయి.
- మగ జంతువులు కొట్లాడుకున్నప్పుడు కొమ్ములతోనే ఫైట్ ఉంటుంది.
- దీని శరీరంపై రెండు కోట్స్ ఉన్నట్లుంటాయి. లోపల ఉన్నితో అయితే పైన జుట్టు కనిపిస్తాయి.
- రష్యాలో కొన్ని లక్షల రెన్‌డీర్స్ ఉంటాయి. గుంపులు గుంపులుగా ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తాయి.
- ఆడ, మగ జంతువులు రెండింటికీ కొమ్ములు ఉంటాయి.



- యూరోపియన్ రెన్ డీర్స్ తక్కువ దూరానికి వలసలు వెళ్తాయి. గంటకు ఎనభై కిలోమీటర్ల వేగంతో పరిగెత్తుతాయి. రోజుకు కనీసం 55 కిలోమీటర్లు వెళ్తాయి. ఆగుతూ, నడుస్తూ ఏడాదికి 5000 కి.మీ. ప్రయాణిస్తాయివి. ఇవి ఒక చోట కుదురుగా ఉండవు. మంచి ఆహారం, ప్రాంతం కోసం వెళ్తూనే ఉంటాయి.
- యూరప్‌లో కొందరు చలిలో దూరప్రాంతాలకు వెళ్లాలనుకుంటే బరువును వీటిపై మోసుకెళ్తుంటారు.
- వీటిలో ఎనిమిది రకాల జాతులు ఉన్నాయి.
- పచ్చిక, మొక్కలు, పండ్లను తిని బతుకుతాయి. వీటి జీవనకాలం కనీసం 15 ఏళ్లనుంచి 20 ఏళ్ల వరకూ ఉంటుంది.
- ఇవి నదులు అడ్డు వచ్చినప్పుడు అతవేగంగా ఈతకొట్టగలవు.


సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 312

					9	4	1	
				1	6		7	3
			8				2	
1							4	
3		8				6		9
	6							7
	8				3			
2	9		5	8				
	4	1	2					

సుడోకు - 311 సమాధానం

6	1	9	2	7	8	5	3	4
4	7	5	6	1	3	2	9	8
2	3	8	4	9	5	1	7	6
7	6	4	3	8	1	9	5	2
8	9	1	5	2	7	6	4	3
5	2	3	9	6	4	7	8	1
9	4	2	8	5	6	3	1	7
3	5	7	1	4	2	8	6	9
1	8	6	7	3	9	4	2	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఇండియా శ్రామిక మార్కెట్

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం

ఇండియన్ ఎకానమీ

(సోమవారం (20.5.24) దిక్సూచి తరువాయి)

ఉపాధి సంబంధిత సవాళ్లు

తక్కువ అవకాశాలు - ఆర్థిక వ్యవస్థ నిర్మాణంలో కనిపించని మార్పు: అధికంగా నమోదవుతున్న ఆర్థిక వృద్ధిరేటు అదే స్థాయిలో ఉపాధి అవకాశాలను సృష్టించడంలో విఫలమవుతున్నది. సేవలరంగం సహాయంతో మూలధన సాంద్రత పద్ధతిలో ఆర్థికవృద్ధి జరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఇందుకు విరుద్ధంగా అభివృద్ధి చెందిన దేశాలు పారిశ్రామికరంగం సహాయంతో అధిక వృద్ధిని సాధించాయి. ఇది లేకపోవడం వల్ల భారత ఆర్థికవ్యవస్థ నిర్మాణంలో చెప్పుకోదగ్గ మార్పు రావడంలేదు.

అసమానతల శ్రామిక మార్కెట్-సాంకేతిక సవాళ్లు: నూతన సాంకేతిక పరిజ్ఞానం శ్రామిక మార్కెట్‌లో అనేక మార్పులు తెచ్చింది. మూలధన సాంద్రత ప్రక్రియ రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగా ఉద్యోగావకాశాల వృద్ధి తక్కువగా ఉంటున్నది. అధిక నైపుణ్యం అవసరమైన ఉద్యోగావకాశాలు పెరుగుతుండగా, తక్కువ నైపుణ్యం, నైపుణ్యం అవసరం లేని ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయి. ప్రాంతాలు, సామాజిక వర్గాలు, లింగపరమైన, వృత్తులపరంగా శ్రామిక మార్కెట్‌లో పెద్ద ఎత్తున అసమానతలు పెరుగుతున్నాయి.

ప్రాంతీయ అసమానతలు: ప్రత్యేకించి యువతకు ఉపాధి అవకాశాల సృష్టిలో దేశంలో ప్రాంతీయపరంగా తీవ్ర వ్యత్యాసాలు ఉన్నాయి. తూర్పు, మధ్య భారతదేశంలో గల రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. తక్కువ తలసరి ఆదాయాన్ని కలిగి ఉన్నాయి. ఉన్నత విద్య అభ్యసించిన యువత శాతం తక్కువగా ఉంది. సంఘటితరంగ ఉద్యోగిత తక్కువగా ఉంది. ఉద్యోగంలో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేని యువత శాతం ఈ ప్రాంతాల్లో ఎక్కువగా ఉంది. ప్రాంతాల వారీగా ఉద్యోగితా విధానాలు రూపొందించాల్సిన అవసరాన్ని పై అసమానతలు సూచిస్తున్నాయి.



విద్య-నైపుణ్యం-ఉపాధి సవాళ్లు-సంక్షోభం: 2000-2022 మధ్యకాలంలో ఉన్నతవిద్య అభ్యసించిన వారిలో నిరుద్యోగ శాతం పెరిగింది. విద్యకు, ఉపాధికి అవసరమైన అధికస్థాయి నైపుణ్యానికి గల తేడాను ఈ పరిస్థితి చూపిస్తున్నది.

సాంకేతికతలో, పర్యావరణంలో మార్పులు: సాంకేతికరంగంలో వస్తున్న అనూహ్య మార్పులు శ్రామిక మార్కెట్‌కు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఉదాహరణకు సాంకేతికతలో వచ్చిన కృత్రిమ మేథ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ) కొత్త ఉపాధి అవకాశాలతోపాటు అనేక సవాళ్లను శ్రామిక మార్కెట్ ముందు పెట్టింది. అంతేకాకుండా పర్యావరణంలో వస్తున్న మార్పులు అసంఘటితరంగ కార్మికుల జీవితాలను వ్యతిరేకంగా ప్రభావితం చేస్తున్నాయి. అయినప్పటికీ పర్యావరణ రక్షిత సుస్థిర వృద్ధి ప్రక్రియలో నూతన పర్యావరణ(గ్రీన్) ఉద్యోగాల సృష్టికి అవకాశాలు పెరుగుతున్నాయి. ఉదాహరణకు భారతదేశం 2030 నాటికి 500 గిగావాట్ల(జీడబ్ల్యూ) కాలుష్యరహిత విద్యుత్ ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకుంది. సౌరశక్తి, వాయుశక్తి లాంటి పునఃవినియోగిత ఇంధన సృష్టి ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించాలనుకుంటున్నారు. ఈ ప్రక్రియలో 30,40,000(సత్వర, దీర్ఘకాలాల్లో) ఉద్యోగాల సృష్టి జరిగే అవకాశం ఉంది. ఈవిధంగా సాంకేతికతలో, పర్యావరణంలో వస్తున్న మార్పులు సవాళ్లతోపాటు అవకాశాలను సృష్టిస్తున్నాయి.

యువత ఉపాధి సవాళ్లు: ఇండియాలో పనిచేయగల వయసు ఉన్నవారు 2011లో 59 శాతం ఉండగా 2021 నాటికి 63 శాతానికి పెరిగింది. రాబోయే 15 సంవత్సరాలు ఇదే పరిస్థితి స్థిరంగా ఉండనుంది. ఇండియా తన జనాభా నిధి(డెమోగ్రాఫిక్ డివిడెండ్)ని ఉపయోగించుకోవడంలో చివరిదశకు చేరింది. దేశం మొత్తం జనాభాలో యువత శాతం తగ్గడం ఆరంభమైనా అది ఇంకా 27 శాతం(దాదాపు 37 కోట్లు) ఉండటం, ఇతర దేశాలతో పోలిస్తే చాలా ఎక్కువనే చెప్పాలి.

యువ జనాభాలో తగ్గుతున్న శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి: యువ జనాభాలో 2000 సంవత్సరంలో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 54 శాతం ఉండగా 2022 నాటికి 44 శాతానికి తగ్గింది. యువత వయసు దశల ఆధారంగా(15-19, 20-24, 25-29) అది తీవ్రంగా తగ్గుతుండటం గమనార్హం. 2000, 2019 సంవత్సరాల మధ్య యువ కార్మికశక్తి, యువ జనాభా మధ్య నిష్పత్తి కూడా తగ్గిందని అంతర్జాతీయ కార్మిక సంస్థ వివరించింది.

యువతలోనే ఎక్కువ నిరుద్యోగం: ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ వయసు వారితో పోల్చితే మూడురెట్లు అధికంగా యువతలో నిరుద్యోగం ఉంది. ఇండియాలో కూడా ఇతర అధిక వయసు వారి కంటే యువతలో నిరుద్యోగం ఎక్కువగానే ఉంది. అంతేకాకుండా గత అనేక దశాబ్దాలుగా అది పెరుగుతూ ఉంది. ఇండియాలో యువతలో నిరుద్యోగం 2000 సంవత్సరంలో 5.6 శాతం ఉండగా, 2012లో 6.2 శాతం, 2018లో 18 శాతం, 2020లో 15.1 శాతంగా ఉంది.

చదువుకున్న యువతలో తీవ్ర నిరుద్యోగం: భారతీయ యువత ఉన్నతవిద్య అభ్యసిస్తున్నారు కానీ ఉద్యోగాల సృష్టి తగినంతగా జరగడం లేదని అంతర్జాతీయ కార్మికసంస్థ పేర్కొంది. నాలుగో తరగతి ఉద్యోగాల కోసం ఉన్నత విద్యావంతులు(పీహెచ్‌డీ, పీజీ, యూజీ కలిగిన వారు) వేలు, లక్షలుగా దరఖాస్తు చేయడాన్ని ఇందుకు ఉదాహరణగా ఐఎల్‌ఓ పేర్కొంది. ఉత్తరప్రదేశ్ పోలీసుశాఖలో '62' ప్యూన్ ఉద్యోగాల కోసం 93 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అందులో 3,700 మంది డాక్టరేట్లు, 5,000 మంది గ్రాడ్యుయేట్స్, 28,000 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. ఉద్యోగానికి అవసరమైన విద్యార్హత కేవలం 'అయిదో తరగతి' కావడం గమనార్హం.

- ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన మరో గ్రూప్-డి ఉద్యోగ పరీక్షకు 55 లక్షలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. ప్యూన్, వాచ్‌మన్, గార్డెనర్ లాంటి ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వారిలో చాలామంది ఉన్నత విద్యావంతులు ఉన్నారు. మధ్యప్రదేశ్‌లో 15 ప్యూన్, డ్రైవర్, వాచ్‌మన్ ఉద్యోగాలకు 11వేలమంది దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు చేసిన వారిలో డాక్టరేట్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. 2022లో బిహార్‌లో 15వేల రైల్వే ఉద్యోగాలకు లక్షలకొద్దీ నిరుద్యోగులు బిహార్, ఉత్తరప్రదేశ్ నుంచి దరఖాస్తు చేసుకున్నారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు ఉద్యోగ పరీక్ష ఫలితాల్లో అక్రమాలకు పాల్పడిందని 2023 జనవరిలో భారీఎత్తున నిరుద్యోగులు రోడ్ల మీద కొచ్చారు. అభివృద్ధి చెందిన రాష్ట్రంగా చెప్పుకుంటున్న గుజరాత్‌లో 2022 జనవరిలో పదో తరగతి అర్హతతో 3,400 ఉద్యోగాలకు ప్రకటన ఇస్తే 1,70,00 మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు.
- చదువుకున్న యువతలో నిరుద్యోగం ఎంత తీవ్రంగా ఉందో పై సంఘటనలు సూచిస్తున్నాయని అంతర్జాతీయ కార్మికసంస్థ రూపొందించిన ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక-2024 పేర్కొంది.
- 2010-2019 మధ్యకాలంలో దక్షిణాసియాలోని యువతలో 29.2 శాతం ఉద్యోగాల్లో, విద్యాలయాల్లో, శిక్షణలో గానీ లేరని నివేదిక తెలిపింది. ఇండియా పరిస్థితి కూడా అదేవిధంగా ఉంది. ఇండియాలో మహిళల్లో ఈ పరిస్థితి పురుషుల కంటే ఎక్కువగా ఉంది.

శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో లింగపరమైన అసమానత: గడిచిన రెండు దశాబ్దాలుగా శ్రామిక భాగస్వామ్య నిష్పత్తిలో తీవ్రమైన అసమానత అలాగే స్థిరంగా కొనసాగుతున్నది. 2022లో యువకుల్లో శ్రామిక భాగస్వామ్య నిష్పత్తి 61.2 శాతం ఉండగా, యువతుల్లో కేవలం 21.7 శాతంగా ఉంది. గ్రామాలు, పట్టణాల్లోనూ పరిస్థితి ఇలాగే ఉంది. ఇది 'భారతీయ శ్రామిక మార్కెట్‌లో గల లింగపరమైన అసమానతలకు సూచిక'అని నివేదిక వ్యాఖ్యానించింది.

తక్కువ నాణ్యత గల ఉద్యోగాల్లో యువత: పెద్ద వయసు(30 సంవత్సరాలు, 30 సంవత్సరాల కంటే ఎక్కువ) వారితో పోలిస్తే యువత తక్కువ నాణ్యతతో కూడిన ఉద్యోగాల్లో ఎక్కువగా ఉన్నారు. యువత పారిశ్రామిక, సేవారంగాల్లో ఎక్కువగా ఉన్నప్పటికీ రోజువారీ ఉద్యోగాల్లో, ప్రతిఫలం చెల్లించని కుటుంబ సంబంధిత పరిశ్రమల్లో, తక్కువ ఆదాయంతో కూడిన స్వయంఉపాధిలో యువత ఎక్కువగా ఉన్నారు. తక్కువ వేతనం, తక్కువ ఆదాయం ఇచ్చే తక్కువ నైపుణ్యం అవసరమైన ఉపాధిలో లేదా అసలే నైపుణ్యం అవసరం లేని ఉపాధిలో యువత పెద్దవారి కంటే ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) న్యూఢిల్లీలోని మానవాభివృద్ధి సంస్థతో కలిసి తయారుచేసిన 2024 భారత ఉద్యోగస్థితి(ఇండియా ఎంప్లాయ్‌మెంట్) నివేదిక తెలిపింది.

- భారతదేశం ఎదుర్కొంటున్న తీవ్రమైన నిరుద్యోగ సంక్షోభాన్ని ప్రత్యేకించి చదువుకున్న యువత నిరుద్యోగ స్థితిని ప్రాంతాల వారీగా, వివిధ సామాజిక వర్గాల వారీగా, లింగపరంగా, వృత్తులపరంగా భారత శ్రామిక మార్కెట్‌లో అసమానతలను పై నివేదిక తేటతెల్లం చేసింది. అధిక 'ఆర్థిక వృద్ధిరేటు, అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించడం సమస్యకు పరిష్కారం కాదు' అని కూడా నివేదిక సారాంశం. ప్రాంతాలు, వివిధ సామాజిక వర్గాలు, లింగపరంగా, వివిధ రంగాలవారీగా ప్రత్యేక ఉపాధి వ్యూహ విధానాల అవసరాన్ని నివేదిక నొక్కి చెప్పింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
కూకట్‌పల్లి, హైదరాబాద్.